ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

నిజామాబాద్ fb.com/vaartha

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-2-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 7 పేజీలు: 10+4 వెల: 6.50


కేజ్రీవాల్ ఆరోపణలపై విచారణకు ఆదేశం

25 బేసిస్ పాయింట్లు తగ్గించిన ఆర్‌బిఐ

5లో

# ఏపీ భూభారతి నిబంధనలు?

## వచ్చేదెప్పుడు! అమలయ్యేదెన్నడు?

## సాగీసాగని ల్యాండ్ రిజిస్ట్రేషన్లు

## క్రయ విక్రయాలు సాగక ఇబ్బందులు

## వివాదాస్పద సర్వేనంబర్లు సరిచేసుకొనే ప్రక్రియ శూన్యం

## టిప్పన్స్ లేనందున స్తంభించిన సర్వేలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి7:** ధరణి పోర్టల్‌స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చి నెలలు గడుస్తున్నా ఇంత వరకు రూల్స్‌ను ఫైనల్ చేయలేదు. దీంతో భూముల క్రయ విక్రయాలకు ఇబ్బందిగా మారింది. వ్యవసాయ భూ యజమానులైన రైతులు నానా ఇబ్బంది పడుతున్నారు. అయితే, విఆర్‌ఎలు, విఆర్‌వోల నియామకాలు పూర్తయ్యాకే భూభారతి రూల్స్ అమలులోకి తెస్తారని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది. విఆర్‌ఎలు,విఆర్‌వోల నియామక ప్రక్రియ పూర్తవడానికి మరింత సమయం పట్టేలా ఉంది. దీంతో భూభారతి రూల్స్ వచ్చేదెన్నడు? అమలయ్యేదెన్నడు?అని భూముల యజమానులు,రైతులు ప్రశ్నిస్తున్నారు. భూ భారతి రూల్స్ ఇంకా రాని కారణంగా ల్యాండ్ రిజిస్ట్రేషన్ పనులు మందగించాయి. తప్పుడు సర్వేల నెంబర్లను సరిచేసుకునే ప్రక్రియలు రెవెన్యూ అధికారులు అమలు చేయలేకపోతున్నారు. ఇలాంటి సాంకేతిక సమస్యల కారణంగా కూడా రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోతుంది. ఇప్పుడు వారం, పది రోజులుగా ధరణి పోర్టల్‌లో >>2






## 11 నుండి 3 రోజులు ఫ్రాన్స్, అమెరికాలో ప్రధాని పర్యటన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ ఎన్నికైన తర్వాత భారతప్రధాని తన మొట్టమొదటి అధికార పర్యటనను నిర్వహిస్తున్నారు. ఈనెల 12,13 తేదీల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆహ్వానంమేరకు ఆయన అమెరికాలో పర్యటించనున్నట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. అంతకు ముందు ప్రధాని ఫ్రాన్స్ పర్యటనకు కూడా వెళుతున్నారు. 11,12తేదీల్లో ఫ్రాన్స్‌లో పర్యటించి ఆదేశ అధ్యక్షుడు ఇమ్మాన్యు >>2

## అంతర్జాతీయ కోర్టుపై ట్రంప్ ఆంక్షలు

**వాషింగ్టన్,ఫిబ్రవరి 7:** అమెరికా అధ్యక్షుడుగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ దూకుడు మరీ పెంచేసారు. ఇపుడు ఏకంగా అంతర్జాతీయ క్రిమినల్‌కోర్టుపైనా ఆంక్షలు విధించారు. ఆ న్యాయమూర్తులు కానీ, వారి బంధువులు కానీ ఉద్యోగులు కానీ అమెరికాలోకి ప్రవేశించకుండా ఆంక్షలు విధించేయోచనలో ఉన్నారు. తీరా ఎందుకని పరిశీలిస్తే తమ మిత్ర దేశం ఇజ్రాయెల్‌ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుపైనా ఆదేశ రక్షణమంత్రిగ్యాలెంట్‌పైనా చట్టవిరుద్ధమైన నిరాధారమైన దర్యాప్తుచేసారని ఆగ్రహం వ్యక్తంచేసారు. ఐసిసిపై ఆంక్షలు విధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డరుపై >>2



## నిషేధిత జాబితాలో ప్రైవేటు ఆస్తులు చేర్చరాదు: హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి7:** రాష్ట్రంలో ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చే అధికారం ప్రభుత్వానికిగానీ, అధికారులకుగానీ లేదని, దీనికి సంబంధించి చట్టం స్పష్టంగా ఉందని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఎ కింద అనుసరించాల్సిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చలేరని, మార్గదర్శకాలకు విరుద్ధంగా >>2

## రూ. 500 కోట్ల పెట్టుబడితో హెచ్‌సి రోబోటిక్స్ విస్తరణ

### మూడేళ్లలో 2వేల మందికి ఉద్యోగాలు: మంత్రి శ్రీధర్ బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి7:** రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించి, తెలంగాణ యువతకు ఉపాధి కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో మరో రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు సెంటిలియాన్ నెట్ వర్క్స్‌కు చెందిన హెచ్‌సీ రోబోటిక్స్ ముందుకొచ్చినట్లు వివరించారు. ఆ వివరాలను శుక్రవారం కంపెనీ ప్రతినిధులతో కలిసి సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. 'హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా సెంటిలియాన్ నెట్ వర్క్స్, హెచ్‌సీ రోబోటిక్స్ తొమ్మిది దేశాల్లో డ్రోన్ టెక్నాలజీ, డ్రోన్ సాఫ్ట్ వేర్, టెలి కమ్యూనికేషన్, రోబోటిక్స్, విమాన రక్షణకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అభివృద్ధితో పాటు పలురంగాల్లో సేవలు అందిస్తూ.. 2వేల మందికి ఉపాధి కల్పిస్తుంది. తాజాగా మరో రూ.500 కోట్లు పెట్టేందుకు ముందుకొచ్చారు. ఫలితంగా ఈ ఏడాది 500 మందికి ఉద్యోగావకాశాలు దక్కుతాయి. ఈ సంఖ్య మూడేళ్లలో 2వేలకు చేరుతుందని పేర్కొన్నారు.

ఇప్పటివరకు ఐటీ రంగంలో పెట్టుబడులన్నీ హైదరాబాద్‌కే పరిమితమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ గల యువతకు ఉద్యోగాలను కల్పించాలనే సంకల్పంతో ద్వితీయ,తృతీయ శ్రేణి నగరాలకు ఐటీరంగాన్ని విస్తరించాలని సంకల్పించాం, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. సెంటిలియాన్ నెట్‌వర్క్స్ సంస్థ ఇప్పటికే తమ కార్యకలాపాలను కరీంనగర్‌లో ప్రారంభించింది. >>2



## కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే!

### అధిష్ఠానానిదే తుది నిర్ణయం

### 'ఫార్ములా' స్కాంలో కంపెనీకి నోటీసులిచ్చాం

### పిసిసి కార్యవర్గంపై రెండు రోజుల్లో ప్రకటన

### రాహుల్ గాంధీతో ఎలాంటి గ్యాప్ లేదు..

### న్యూఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి7:** రాష్ట్రంలో ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేనట్లేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంకేతాలు ఇచ్చారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. పలు కీలక అంశాలపై స్పందించారు. మంత్రివర్గంలో ఎవరెవరు ఉండాలో అధిష్ఠానానిదే నిర్ణయమని తెలిపారు. తాను ఎవరి పేరూ సిఫారసు చేయడం లేదని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు ఉండాలి, కొత్త మంత్రులుగా ఎవరు ప్రమాణం చేస్తారు అనే హైకమాండ్ డిసైడ్ చేస్తుందని. ఇందులో నా జోక్యం ఏమీ లేదని స్పష్టం చేశారు. పార్టీ ఇచ్చిన పని పూర్తి చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నానని పార్టీలో జరిగే ప్రతి విషయం అధిష్ఠానానికి తెలుసు అన్నారు. ఈ ఫార్ములా రేసు స్కామ్‌లో ఆ కంపెనీకి నోటీసులు ఇచ్చాం. ఆ కంపెనీ స్పందించేందుకు సమయం అడిగింది. సమాధానం వచ్చిన తర్వాత తదుపరి కార్యాచరణ ఉంటుందని, తొందరపడి ఎవరిని అరెస్ట్ >>2






శుక్రవారం న్యూఢిల్లీలో అక్కినేని జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాని మోడీ. చిత్రంలో నాగార్జున, అమల, లక్ష్మీ ప్రసాద్, నాగచైతన్య తదితరులు

# అక్కినేని జీవిత చరిత్రను ఆవిష్కరించిన మోడీ

## ప్రధానితో భేటీ అయిన నాగార్జున, అమల, నాగచైతన్య, సహా ఎఎన్ఆర్ కుటుంబ సభ్యులు, ఎంపి యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి7:** అక్కినేని కుటుంబం ప్రధాని నరేంద్ర మోడీని కలిసింది. ఇటీవల జరిగిన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో లెజెండరీ యాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు గురించి ప్రధాని మోడీ ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కుమారుడు, టాలీవుడ్ హీరో అక్కినేని నాగార్జున ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు జీవిత చరిత్రను ప్రధాని మోడీ ఆవిష్కరించారు. ప్రధాని మోడీని కలిసిన వారిలో అక్కినేని కుటుంబ సభ్యులు అమల, నాగచైతన్య, శోభిత ధూళిపాళ, నాగసుశీల, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఉన్నారు. దివంగత అక్కినేని నాగేశ్వరరావుపై మాజీ ఎంపీ యార్లగడ్డ ప్రసాద్ రచించిన అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ అనే పుస్తకాన్ని ప్రధాని మోడీ ఆవిష్కరించారు. కాగా, ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# ఏపీ భూభారతి నిబంధనలు?

>> టిప్పన్ ఆప్షన్ పనిచేయడం లేదు. డౌన్‌లోడ్ క్లిక్ చేస్తే నాట్ అవేలబుల్ అని చూపిస్తున్నంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అనేక గ్రామాలకు చెందిన గ్రామ నక్షలు అప్‌లోడ్ చేయలేదు. ముఖ్యంగా భూముల ధరలు అధికంగా ఉన్న గ్రామాలకు సంబంధించి క్యాడస్ట్రల్ మ్యాప్స్ సామాన్యులకు అందుబాటులో లేకుండా చేశారు. చాలా రెవెన్యూ గ్రామాల డేటా తెలియకుండా దాచిపెట్టారు. ఇప్పుడు టిప్పన్స్ సైతం కనిపించకపోవడంతో వివాదస్పద భూములు ఏవో గుర్తించడం కష్టంగా మారుతున్నది. టిప్పన్స్ లేని కారణంగా సర్వే చేయలేమంటూ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు ఫిర్యాదారులకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇస్తున్నారు. ఇది కూడా సర్వే కోసం రెండు,మూడేండ్లు తిరిగిన తర్వాత తామేం చేయలేమంటూ అధికారులు చేతులు దులుపు కుంటున్నారు. కనీసం భూభారతి అమల్లోకి తీసుకొచ్చే ముందు అన్ని గ్రామాల నక్ష,టిప్పన్స్ అందుబాటులో ఉండేలా చేయాలని రైతులు కోరుతున్నారు. ధరణి రాక ముందు... వీర్వో దగ్గరికి వెళ్తే 1 బి రిజిస్ట్రర్ చూసి ఆయా గ్రామాలకు సంబంధించి భూముల వివరాలన్నీ చెప్పేవారు. విలేజ్ మ్యాప్ చూపించేవాళ్లు, సరిహద్దులో ఏయే సర్వే నంబర్లు వస్తాయో వివరాలు తెలిసేది. ధరణి పోర్టల్ తీసుకొచ్చాక వాస్తవ సమాచారాన్ని ఇతరులెవరూ తెలుసుకోకుండా ఆంక్షలు పెట్టారు. ఏయే సర్వే నంబర్‌లో ఎంత భూమి ఉంది? ఆ సర్వే నంబర్లలో సబ్ డివిజన్లు ఎన్ని? ఆయా సబ్ డివిజన్లలో ఉన్న విస్తీర్ణమెంత? ఇప్పుడు సరిహద్దుల వివరాలేమిటో అంతుచిక్కని పరిస్థితి నెలకొంది. అత్యంత ఖరీదైన భూములున్న అనేక గ్రామాల్లో క్యాడస్ట్రల్ మ్యాపులను ధరణిలో అప్‌లోడ్ చేయలేదు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, శంషాబాద్, గండిపేట, శేరిలింగంపల్లి, మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్, శామీర్‌పేట, దుండిగల్, మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట తదితర మండలాల్లోని కొన్ని గ్రామాల మ్యాప్స్ అప్‌లోడ్ చేయలేదు. మేడ్చల్,సంగారెడ్డి,నల్లగొండ,యాదాద్రి జిల్లాల్లోని అనేక గ్రామాల మ్యాపులు సైతం కనిపించడం లేదు. విలేజ్ డాటా నాట్ అవేలబుల్ అని చూపిస్తున్నంది. అప్పటి సిఎం కెసిఆర్ ధరణి పోర్టల్‌ను ఆవిష్కరించిన మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లికి గ్రామ నక్ష లేదు. మూడు నెలల్లోనే రూపొందిస్తామన్న ప్రభుత్వానికి 5ఏండ్లు పట్టింది. ఇప్పటి వరకు ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. వివాదాస్పద భూములకు పరిష్కారం లభించాలంటే మ్యాప్స్ ఆధారంగా బౌండరీస్ తెలుసుకునే వీలుంది. ఎవరైనా కొనుగోలు చేయాలనుకునే వారు కూడా వివాదాలు ఉన్నాయా? లేదా? అన్న విషయాన్ని మ్యాప్స్ ఆధారంగా క్షేత్ర స్థాయి పరిశీలన చేసుకుంటే క్లారిటీ వస్తుంది. ఆ వెసులుబాటు ఇవ్వకుండా రెవెన్యూ యంత్రాంగం సమస్యలను జఠిలం చేస్తుందని ఆరోపణలు వస్తున్నాయి. ధరణి పోర్టల్‌లో జిల్లా,డివిజన్,మండలం,గ్రామం సెలెక్ట్ చేయగానే క్యాడస్ట్రల్ మ్యాప్ వస్తుంది. అందులో మనకు కావాల్సిన సర్వే నెంబర్ మీద క్లిక్ చేస్తే విస్తీర్ణమెంత? సబ్ డివిజన్లు ఎన్ని? ఏయే సబ్ డివిజన్‌లో ఎంత విస్తీర్ణం? ఇలా వివరాలన్నీ తెలుస్తాయి.సర్వే నెంబర్ మొత్తం విస్తీర్ణం పక్కనే చిన్న ఫోటో గుర్తు ఉంటుంది. దానిపై క్లిక్ చేస్తే ఆ సర్వే నంబర్ టిప్పన్ ఓపెన్ అవుతుంది. ధరణి పోర్టల్ ప్రారంభించిన నాటి నుంచి సర్వే నంబర్ల వారీగా టిప్పన్స్ డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉండేది. అయితే గడిచిన వారం రోజులుగా ఆ ఆప్షన్‌ను తొలగించారు. డౌన్‌లౌడ్‌పై క్లిక్ చేస్తే టిప్పన్ నాట్ అవేలబుల్ అని వస్తున్నది. అత్యంత ప్రాధాన్యత కలిగిన టిప్పన్ మ్యాప్స్ కనిపించకుండా మాయం చేయడంలో అంతర్యమేమిటో అర్థంకావడంలేదని భూచట్టాల నిపుణలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అనుమానిస్తున్నారు. ఏ ప్రభుత్వ,ప్రైవేట్ సర్వేయరైనా ఈ మ్యాప్ ఆధారంగానే సర్వే చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా టిప్పన్ డౌన్‌లోడ్ సదుపాయాన్ని కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే!

>> చేయం పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతల కేసుల విషయంలో చట్ట ప్రకారమే ముందుకు వెళతామని చెప్పారు. అర్జెంట్‌గా అరెస్ట్ చేయించి, జైల్లో వేయాలనే ఆలోచన తనకు లేదన్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో జరిగిన అక్రమాలపై జస్టిస్ లోకూర్ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రస్తుతం అడ్వకేట్ జనరల్ పరిశీలనలో ఉందని, ఏజీ ఒపీనియన్ తర్వాత దానిపై ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకుంటామన్నారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా పని చేస్తున్నానన్నారు.కులగణన ఆషామాషీగా చేసింది కాదని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎంతో జాగ్రత్తగా, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని చేశామని వివరించారు. సర్వే ప్రకారం బిసిలు 5.30 శాతం పెరిగారని చెప్పారు. లెక్కలతో సహా చూశాక బిజెపి సభ్యుడు పాయల్ శంకర్ ఈ విషయాన్ని ఒప్పుకున్నారని వెల్లడించారు. అలాగే ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం దక్కుతుందని భావిస్తున్నానని తెలిపారు. పిసిసి కార్యవర్గ కూర్పు కొలిక్కి వచ్చిందని, ఇందుకు సంబంధించిన విషయాలు ఒకటి, రెండు రోజుల్లో ప్రకటన ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డిఅన్నారు. తాను రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్ కోరలేదని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. నాకు రాహుల్‌గాంధీకి ఎలాంటి విబేధాలు లేవు. మేము చాలా సన్నిహితంగా ఉంటాము అని పేర్కొన్నారు.రాహుల్ గాంధీకి, తనకు మధ్య ఉన్న అనుబంధం గురించి తెలియని వాళ్లు ఎన్ని మాట్లాడుకున్నా తనకేం కాదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీతో నాకు ఎలాంటి గ్యాప్ లేదు ఇదంతా బిఆర్ఎస్ ప్రచారం,. అన్ని విషయాలు ఎప్పటికప్పుడు మేము ఫోన్‌లో చర్చించుకుంటున్నామన్నారు. మేము నిర్వహించిన కులగణపై పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ ప్రస్తావించారని గుర్తు చేశారు. ప్రభుత్వం, పార్టీ తీసుకునే అన్ని కీలక నిర్ణయాలు అధిష్ఠానం దృష్టిలో ఉంటాయని తెలిపారు. అధిష్ఠానానికి తెలియకుండా నిర్ణయాలు ఉంటాయని తెలియని వాళ్లు అనుకుంటే చేసేదేమీ లేదని వివరించారు. పార్టీ, పార్టీ నేతల మనోభావాలకు అనుగుణంగానే నడుచుకుంటానే తప్ప, వ్యక్తిగత నిర్ణయాలు ఎప్పుడూ ఉండవన్నారు. పార్టీ ఇచ్చిన పని పూర్తి చేయడమే తన లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.పని చేసుకుంటూ పోవడమే తనకు తెలుసునని, ప్రతి ఒక్క విమర్శకు స్పందించాల్సిన అవసరం లేదని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అతి త్వరలోనే పార్టీ ప్రతినిధులకు సంబంధించి ప్రకటన వస్తుందని వివరించారు.కులగణన పక్కాగా చేశామని. త్వరలో దీనిపై చట్టం కూడా తీసుకొస్తామని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సూర్యపేట,గజ్వేల్‌లో సభలు నిర్వహిస్తాం తెలిపారు. ఏదో ఒక హోటల్‌లో నలుగురు కూర్చుంటే దాన్ని అసంతృప్తి అని ఎలా అంటారు? అని ప్రశ్నించారు. డిసెంబరు 7, 2023న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు కేవలం 11 మందిని మాత్రమే మంత్రివర్గంలోకి తీసుకున్నారు. నిజామాబాద్,రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలాలకు ప్రాతినిధ్యం దక్కడం లేదు. అప్పట్లో త్వరలో కేబినెట్ విస్తరణ ఉంటుందని సిఎం ప్రకటించినా, ఏడాది గడిచినా దానిని అమలు చేయలేదు.

మంత్రివర్గంలో చోటు కోసం ఆశలు పెట్టుకున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి లాంటి నేతలు అసమ్మతి గళం వినిపించడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సిఎం రేవంత్ ఢిల్లీలో ఇప్పట్లో కేబినెట్ విస్తరణ ఉండదని ప్రకటించడాన్ని రాజకీయంగా కీలకంగా భావిస్తున్నారు. కేబినెట్ విస్తరణ పూర్తయితే చోటు దక్కని నేతలు అసంతృప్తికి గురవతారని, వారి ఆశలు సజీవంగా ఉంచేందుకు మంత్రివర్గ విస్తరణను ఆలస్యం చేస్తున్నారని తెలుస్తోంది. ఇటీవల పది మంది ఎమ్మెల్యేల రహస్య సమావేశం,ఢిల్లీలో జూపల్లి కృష్ణారావు ఫిర్యాదు వంటి పరిణామాల కారణంగా హైకమాండ్ ఎలాంటి వివాదాస్పద నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా లేదని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయ పరిస్థితులు మరింత ఉత్కంఠకు గురి చేస్తున్నాయి.

## ప్రైవేటు ఆస్తులు చేర్చరాదు: హైకోర్టు

>> తీసుకున్న నిర్ణయాలు చెల్లుబాటు కావని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలో 128 ఎకరాలను విక్రయించడానికిగాను ధరణి వెబ్ పోర్టల్లో స్లాట్ బుకింగ్‌కు అవకాశం లేకుండా నిలిపివేయడాన్ని సవాలు చేస్తూ బాచుపల్లికి చెందిన వెంకటసుబ్బయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్ రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది కటిక రవీందర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ సాదా బైనామా కింద కొనుగోలు చేశారన్నారు. 1992లో చట్టప్రకారం క్రమబద్ధీకరించుకున్నారని దీనికి సంబంధించి పట్టా కూడా జారీ అయిందన్నారు.

పెట్టుబడి రాయితీ కింద్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాలు కూడా పొందారని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. ఈ భూమిని విక్రయించడానికిగాను రిజిస్ట్రేషన్ ఫీజు తదితరాలు ఈ చలానా కింద రూ.30 లక్షలకు పైగా చెల్లించి విక్రయం కోసం స్లాట్ బుక్ చేసుకోవాలనుకుంటే బ్లాక్ చేశారన్నారు. జుల్ఫికర్ అలీఖాన్ అనే వ్యక్తి ఇచ్చిన వినతి పత్రం ఆధారంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ రిజిస్ట్రేషన్ కాకుండా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. సర్వే నెం 132, 133లో సాదాబైనామా కింద కొనుగోలు చేశాడని సిసిఎల్ఏకు చెప్పడంతో ఎలాంటి నోటీసు ఇవ్వకుండా రిజిస్ట్రేషను నిలిపివేయాలని ఆదేశాలు ఇవ్వడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. రిజిస్ట్రేషన్లు నిలిపిసే అధికారం సీసీఎల్ఏకు లేదని తెలిపారు. సెక్షన్ 22ఎ జాబితాలో ఉండటంగానీ లేదంటే కోర్టు ఉత్తర్వులుంటే తప్ప రిజిస్ట్రేషన్‌ను అడ్డుకోరాదన్నారు. ఇరువైపుల వాదనలను విన్న న్యాయమూర్తి ప్రైవేటు పట్టా భూములను రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఎ కింద నిషేధిత జాబితాలో చేర్చే అధికారం ప్రభుత్వానికి, అధికారులకు లేదని చట్టం స్పష్టంగా చెబుతోందన్నారు. రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 22ఎలో పేర్కొన్న పరిధిలోని అంశాల్లోకి వస్తే తప్ప ప్రభుత్వానికి, అధికారులకు ప్రైవేట్ ఆస్తులుకు నిషేదిత జాబితాలో చేర్చే అధికారంలేదన్నారు. నిషేధిత జాబితాలోని ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయరాదన్న మార్గదర్శకాలను రిజిస్ట్రేషన్ అధికారులు అమలు చేయాల్సి ఉందన్నారు. దీనికి విరుద్ధంగా చేపట్టిన ఎలాంటి చర్య అయినా చట్ట విరుద్ధమేనని అది చెల్లదన్నారు. అందువల్ల పిటిషనర్‌కు చెందిన పత్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం ఉన్నట్లయితే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఉత్తర్వుల కాపీ అందిన 4 వారాల్లో పూర్తి చేయాలని ఆదేశిస్తూ విచారణను మూసివేశారు.

## ఉద్యోగులు, అధికారులతో ఆర్‌టిసి ఎండీ వర్చువల్ మీటింగులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థకి చెందిన క్షేత్ర స్థాయి ఉద్యోగులు, అధికారులతో టిజిఎస్ఆర్‌టిసి ఎండీ విసి సజ్జనార్ శుక్రవారం వర్చ్వల్ సమావేశాలు నిర్వహించారు. హైదరాబాద్ బస్ భవన్ నుంచి ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా ఈ సమావేశాలను నిర్వహించారు. సంస్థ పనితీరుతోపాటు సంక్రాంతి ఆపరేషన్స్, ఉద్యోగుల సంక్షేమం, మహాలక్ష్మి పథకం మహిళలకు ఉచిత రవాణా సౌకర్య పథకం అమలు తదితర అంశాలపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చించారు. సమావేశంలో సీవోవో డాక్టర్ రవిందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, వివిధ విభాగాల హెచ్‌వోడీలు శ్రీదేవి, శ్రీధర్, వెంకన్న, విజయభాస్కర్ లతో పాట వర్చ్వల్‌గా కరీంనగర్ జోన్ ఈడీ ఖుస్రోషా ఖాన్, గ్రేటర్ హైదరాబాద్ అండ్ హైదరాబాద్ జోన్ ఇన్ చార్జీ ఈడీ రాజశేఖర్, ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలు హాజరయ్యారు. సంస్థ పనితీరును మెరుగుపరుచుకు నేందుకు క్షేత్రస్థాయి ఉద్యోగులు, అధికారులనుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. కామారెడ్డి,నర్సంపేట, మంచిర్యాల, నర్సంపేట, నాగర్‌కర్నూల్,మెదక్, ఆర్మూర్, జగిత్యాల, నల్లగొండ, హాయత్ నగర్2, వరంగల్2, బోధన్, తదితర డిపోల సిబ్బందితో ఉన్నతాధికారులు నేరుగా మాట్లాడారు. సంక్రాంతికి సిబ్బంది అద్భుతంగాపనిచేశారని కొనియాడారు. కుటుంబాలకు దూరంగా ఉండి పండుగను త్యాగంచేసి మరీ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చిన ప్రతి ఒక్క సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

## అమెరికాలో ప్రధాని పర్యటన

>> యేల్ మ్యాక్రాన్‌తో కలిసి భేటీ అవుతారు. కృత్రిమమేధపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొని ప్రసంగిస్తారు. భారత సంతతి కుటుంబాలతో భేటీ అయ్యే మోడీ అక్కడి పెట్టుబడిదారులు, ప్రముఖ కంపెనీల సిఇఒలను కూడా కలుసుకుంటారు. అటునుంచి అమెరికాకు వెళ్లి ట్రంప్‌తో భేటీ అవుతారని విదేశాంగశాఖ ప్రకటించింది. ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన మూడువారాలకే ఒక దేశ ప్రధానికి ఆహ్వానం రావడం అనేది అత్యంత అరుదైన అంశం అని విదేశాంగశాఖ చెపుతోంది. భారత్ అమెరికా దేశాలమధ్య కొనసాగుతున్న సంబంధాలకు ఈ ఆహ్వానం ఒక నిదర్శనమని ఆయన అన్నారు. ఇప్పటికే గతనెల 27వ తేదీ ప్రధానిమోడీ ట్రంప్‌లు తమ టెలిఫోన్ సంభాషణలో వాణిజ్యం,ఇంధన, రక్షణరంగంలోపరస్పర భాగస్వామ్యం, సహకారాన్ని పెంపొందించుకునే దిశగా మన వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగాలని స్పష్టంచేసారు. రెండుదేశాల మధ్య ద్వైపాక్షిక బంధం మరింత పటిష్ఠంగా ఉందనడానికి ఇదే నిదర్శనమని విదేశాంగ కార్యదర్శి మిస్రీ స్పష్టంచేసారు.

## ఖర్గేతో సిఎం రేవంత్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి7:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పీసీసీ కార్యవర్గంతో పాటు పలు అంశాలపై ఖర్గేతో చర్చించారు. ఎస్సీ వర్గీకరణ, కుల గణన అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని నిర్ణయించినట్లు ఖర్గేకు వెల్లడించారు. సూర్యాపేటలో ఈ నెలలో నిర్వహించనున్న బీసీ కుల గణన బహిరంగ సభకు రాహుల్ గాంధీని ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఏప్రిల్‌లో గజ్వేల్‌లో సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు రావాలని ఖర్గేను సిఎం రేవంత్ కోరారు.

## ఢిల్లీ బాద్‌షా తేలేది నేడే!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** ప్రతిష్టాత్మకంగా హోరాహోరీ ప్రచారంతో సాగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజేతలెవరో మరో 24 గంటల్లో తేలిపోతున్నది. నరాలు తెగే ఉత్కంఠకుతోడు రాజకీయంగా ఎవరు గెలుస్తారన్న అంశంపై పెద్ద ఎత్తున బెట్టింగ్‌లు జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానపోటీ ఆమ్ ఆద్మీపార్టీ, భారతీయ జనతాపార్టీలమధ్యనే జరుగుతోంది. గడచిన మూడు ఎన్నికలనుంచి కాంగ్రెస్ ఇక్కడ ఖాతా తెరవలేకపోతోంది.



ఐడిఎఎస్ ప్రొబేషనర్లు శుక్రవారం రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమైన దృశ్యం

# నైపుణ్య భారత్‌కు రూ. 8,800 కోట్లు

## విశాఖ కేంద్రంగా సౌత్‌కోస్ట్ రైల్వే జోన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం

### సఫాయి కర్మచారి కమిషన్ మూడేళ్లు పెంపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** దక్షిణకోస్తా రైల్వేజోన్‌లో కొత్తగా ఏర్పడతున్న విశాఖపట్టణం డివిజన్‌ను వాల్తేర్ డివిజన్‌లోని కొంతభాగాన్ని వేరుచేసి ఏర్పాటుచేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వాల్తేరు డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలు పలాసా విశాఖ, దువ్వాడ, కూనేరు, విజయనగరం, నౌపడాజంక్షన్, పర్లాకిమిడి, బొబ్బిలి జంక్షన్, సాలూరు, సింహాచలం నార్త్, దువ్వాడ బైపాస్, బదలపూడి దువ్వాడ విశాఖ స్టీల్‌ప్లాంట్, జగ్గయ్యపాలెం ప్రాంతాలు మొత్తం 410 కీలోమీటర్లను విశాఖపట్టణం డివిజన్ పరిధిలోకి చేర్చారు. ఈ డివిజన్ ఇపుడు కొత్తగా ఏర్పాటవుతున్న దక్షిణ కోస్తాజోన్‌లోకి వస్తుంది. అలాగే వాల్తేరు డివిజన్‌లో ఇతర ప్రాంతాలు కొత్తవలస, బచేలి,కూనేరు, తేరువాలిజంక్షన్, సింగాపూర్‌రోడ్డు, కోరాపుట్‌జంక్షన్, పర్లాకిమిడి, గున్‌పూర్ మొత్తం 680 కిలోమీటర్లను కొత్త డివిజన్‌కింద మార్చి రాయగడ డివిజన్‌గా మారుస్తున్నారు. ఈ డివిజన్ తూర్పుకోస్తా రైల్వేజోన్‌పరిధిలోకి వస్తుంది.

బ్రిటిష్ వలసవాదుల కాలంనాటి పేరు కావడంతో వాల్తేరుపేరును మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే కేంద్ర ప్రభుత్వపరిధిలో కొనసాగుతున్న నైపుణ్యభారత్ పథకాన్ని 2026వరకూ కొనసాగిం చేందుకు ప్రధానిమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్‌కమిటీ ఆమోదం తెలిపింది. 2022-23 నుంచి 2025-26 వరకూ కొనసాగే ఈపథకానికి 8800 కోట్లు నిదులు కూడా కేటాయిం చింది. స్కిల్ ఇండియా కార్యాచరణతో నిపుణులైన, భావితరం పారిశ్రామికరంగానికి అవసరమైన వర్క్‌ఫోర్స్‌ను సిద్ధంచేయడమేనని, డిమాండ్‌కుఅనుగుణంగాను, టెక్నాలజీ ఆధారిత పారిశ్రామిక అనుసంధానంతోకూడి శిక్షణ దేశవ్యాప్తంగా అమలుచేయాలనినిర్ణయించింది. ప్రధానమంత్రి కౌశల్ వికాస్‌యోజన 4.0 కింద పిఎం నేషనల్ అప్రెంటిస్ ప్రమోషన్ స్కీమ్, జన్‌శిక్షన్ సంస్థాన్ స్కీమ్, ఈమూడు కూడా కీలకమైన అంశాలని కేబినెట్‌లో చర్చించారు. ఈ మూడు స్కీమ్‌లను ఇపుడు స్కిల్ ఇండియా పథకం కిందనే అమలుచేస్తున్నారు. ఉపాధి శిక్షణ, పట్టణ, గ్రామీణ జనాభాను కూడా పరిగణన లోనికి తీసుకుని ఈ స్కీం అమలవుతుంది. అంతేకాకుండా అణగారిన వర్గాలనుఅత్యంత సాంకేతిక విలువ లున్న వృత్తి విద్యకు చేరువచేయాలని భావిస్తున్నారు. ఇప్పటివరకూ ఈ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కింద 2.27కోట్లమందికి తర్ఫీదునిచ్చామని కేబినెట్‌లో అధికారులు ప్రధానికి వివరిం చారు. అలాగే కేబినెట్‌లో జాతీయ సఫాయి కర్మచారి కమిషన్‌ను మరో మూడేళ్లపాటు పొడిగించాలని నిర్ణయించారు. మార్చి 2025నుంచి మరోమూడేళ్లపాటు ఈ కర్మచారి కమిషన్ పనిచేస్తుంది. అంటే 31.03.2028వరకూ పనిచేస్తుంది. మూడేళ్ల పొడిగింపుతో కమిషన్‌కు రూ.50.91 కోట్లుకేటాయింపులు కూడాచేస్తారు. పారిశుధ్య సిబ్బందికి సామాజిక ఆర్థిక సంక్షేమ అభ్యున్నతికి పాటుపడటంతోపాటు పారిశుధ్యరంగంలో కార్మికులకు ఉన్న మౌలిక వనరులపైనా కృషిచేస్తుంది. ప్రమాదకర డ్రైన్లు పరిశుభ్రం చేసేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా కృషిచేస్తుంది.

# ఇక యేటా సినిమా అవార్డులు

## ఫిబ్రవరి 6న తెలుగు సినిమా బర్త్‌డే వేడుకలు

### ఫిలిం ఛాంబర్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** తెలుగు చలన చిత్ర పరిశ్రమలో పదేళ్లగా నిలిచిపోయిన అవార్డుల కార్యక్రమాన్ని పున:ప్రారంభించాలని ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు సినిమా పుట్టినరోజు సందర్భంగా ఇకపై ప్రతీ ఏటా ఫిబ్రవరి 6వ తేదీన అంబరాన్నంటేలా సినీ అవార్డుల వేడుకలను నిర్వహించనుంది. ఓ అవార్డు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందనే ఉద్దేశ్యంతో అందుకే మళ్లీ అవార్డుల కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని ప్రతిపాదన చేసింది. ప్రతీ ఏటా ఫిబ్రవరి 6 ప్రభుత్వం ఇచ్చే అవార్డులతో పాటు, ఫిల్మ్ ఛాంబర్ నుంచి అవార్డులు ఉంటాయని ఈ సందర్భంగా ఫిల్మ్ ఛాంబర్ ప్రకటించింది. అవార్డులొక్కటే కాకుండా, ప్రత్యేక జెండా రూపొందించి, తెలుగు సినిమా పుట్టిన రోజు ప్రపంచ సినిమాకు తెలిసేలా ప్రతి నటుడి ఇంటిపై, థియేటర్ల వద్ద ప్రత్యేకంగా జెండా ఎగురవేయాలని నిర్ణయించింది. ఇక జెండా రూపకల్పన బాధ్యతను రచయిత పరుచూరి గోపాలకృష్ణకు అప్పగించింది. అలాగే అవార్డుకు ఏ పేరు పెట్టాలనే దానిపై చర్చించి త్వరలోనే ఓ నిర్ణయం తీసుకోనున్నారు. అవార్డులకు సంబంధించిన కమిటీ కూర్పు ఎలా ఉంటుంది.? అన్ని క్రాఫ్ట్స్‌కి చెందిన వారితో జ్యూరీ ఏర్పాటు చేస్తారా..? ఎలాంటి విధివిధానాలు రూపొందిస్తారు..? అనే దానిపై త్వరలోనే క్లారిటీ రానుంది. కాగా ఏటా ఉగాదికి నంది అవార్డులు ఇవ్వడం దశాబ్ద కాలం క్రితం వరకూ ఆనవాయితీగా ఉండేది. ఒకట్రెండు సార్లు వాయిదా పడ్డా ఆ తర్వాతి ఏడాదైనా పురస్కారాలు ప్రకటించి ఇచ్చేవారు. కానీ ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత అవార్డుల అంశం పెండింగ్‌లో పడింది. నటీనటులకు ప్రోత్సాహం ఎంతో అవసరమని, అందుకు ఓ మంచి ఆలోచనతో ముందుకెళ్తున్నామని ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ తెలిపారు.

# హెచ్‌సి రోబోటిక్స్ విస్తరణ

>> రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అండగా ఉంటాం. వీరికి రావాల్సిన ప్రోత్సాహకాలు రూ.4500 కోట్లు 2016 నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. మేం అధికారంలోకి రాగానే ఈ బకాయిలను చెల్లించేందుకు చొరవ తీసుకున్నాం. సహేతుక కారణాలు చూపకపోతే గతంలో పరిశ్రమల ఏర్పాటుకు గతంలో కేటాయించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటాం. ఇతర అవసరాలకు భూములను వినియోగిస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. పరిశ్రమల పునరుద్ధరణకు గతంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్ పై ప్రత్యేక అధ్యయనం చేస్తున్నాం. దీని వల్ల పరిశ్రమలకు మేలు జరుగుతుందని భావిస్తే అధిక నిధులు కేటాయించి యథావిధిగా కొనసాగిస్తామని చెప్పారు. గతేడాది దావోస్ లో చేసుకున్న 18 ఒప్పందాల్లో 17 పట్టాలెక్కాయి. 10 ఒప్పందాల పురోగతి 50 శాతం కంటే ఎక్కువగా ఉంది. కేవలం ఒప్పందాలు చేసుకుని రావడమేకాదు.. వాటిని కార్యరూపంలోకి తెచ్చేందుకు ప్రత్యేకచొరవ తీసుకుంటున్నాం. మేం ఉద్యోగాలను కల్పించేందుకు పాటు పడుతుంటే.. ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తూ పారిశ్రామికవేత్తలను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మాకు రాజకీయాలు కాదు.. రాష్ట్రాభివృద్ధేముఖ్యం. పారిశ్రామికాభివృద్ధికి గత ప్రభుత్వం తీసుకున్న పాలసీలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సెంటిలియాన్ నెట్ వర్క్స్ ఛైర్మన్, ఎండీ వెంకట్, డైరెక్టర్ రాధాకిషోర్, ఆ సంస్థ ఇండియా ఆపరేషన్స్ హెడ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కోర్టుపై ట్రంప్ ఆంక్షలు

>> సంతకం కూడాచేసారు. ట్రంప్ నెతన్యాహు శ్వేతసౌధంలో సమావేశం అయిన అనంతరం ఈ చర్యకు దిగారు. క్యాపిటల్ హిల్‌లో చట్టసభ సభ్యులతో ఇజ్రాయెల్‌ప్రధానిభేటీ అయి వివిధ అంశాలపైచర్చలుకూడా జరిపారు. గాజాపైచేపట్టిన సైనిక చర్యలో ఇజ్రాయెల్ యుద్ధనేరాలకు పాల్పడిందని బెంజమిన్ నెతన్యాహుకు గత ఏడాది నవంబరులో ఐసిసి అరెస్టు వారంట్ జారీచేసింది. ఇజ్రాయెల్ సైన్యం మానవహక్కులకు పాల్పడుతోందని మండిపడింది. ఈక్రమంలో ఐసిసిపై గుర్రుగా ఉన్న ట్రంప్ ఆంక్షలు విదించారు. అదికార దుర్వినియోగానికి పాల్పడిందని, అమెరికా ఇజ్రాయెల్ రెండుదేశాలపై ఐసిసికి ఎలాంటిఅ ధికారపరిధిలేదని తేల్చిచెప్పారు. ఇరుదేశాలపై చర్యలతోఐసిసి ప్రమాదకరమైన ఉదాహరణను సృష్టించిందని దుయ్యబట్టారు. ట్రంప్ నిర్ణయంతో ఐసిసి ఆస్తులను స్తంభింపచేయడం ఐసిసి అధికారులు ఉద్యోగులు వారి బంధువులు అమెరికాలోకి ప్రవేశించకుండా అగ్రరాజ్యం నిరోధించే చర్యలుచేపట్టవచ్చు. అయితే ఐసిసిలో అమెరికా, ఇజ్రాయెల్‌లు సభ్యదేశాలుకావు. దీనిపై హేగ్‌లోని అంతర్జాతీయ నేరన్యాయస్థానం ఇంకా స్పందించాల్సి ఉంది.

## వారం - వర్జ్యం

తేది : 8-02-2025, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
ఏకాదశి రా.8.16
మృగశిర సా.6.06
వర్జ్యం : రా.2.25-4.00
దు.ఉ.6.46-8.20
శుభసమయం : ఉ.8.30-9.15, సా.3.50-4.30
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ఆర్థికపరిస్థితి సంతృప్తికరంగా వుంటుంది. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**వృషభం :** ముఖ్యమైన విషయాలు తెలుసుకుంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**మిథునం:** పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. రుణాలు తప్పవు. వాహన యోగం.

**కర్కాటకం :** కుటుంబ సమస్యలు ఎదురైన నిదానంగా పరిష్కరించు కుంటారు. వాహన సౌఖ్యం. కాంట్రాక్టులు దక్కుతాయి.

**సింహం:** ముఖ్యమైన వ్యవహారాలు ముందుకు సాగవు. ధనవ్యయం పెరుగుతుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కన్య:** కొత్త వస్తువులు, గృహం, స్థలం కొనుగోలు యత్నాలు వాయిదా వేస్తారు. రుణఒత్తిడులు ఉంటాయి.

**తుల :** గృహ నిర్మాణ ఆలోచనలు నిలకడగా వుండవు. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**వృశ్చికం:** బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. శుభవార్తలు వింటారు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**ధనుస్సు:** సంఘంలో ఆదరణ పొందుతారు. కొత్త వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**మకరం:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. వాహనయోగం. సోదరుల నుండి సాయం పొందుతారు.

**కుంభం:** రుణాలు చేయాల్సి వస్తుంది. మిత్రుల నుండి వత్తిడులు ఎదురైతాయి, క్రయవిక్రయాలలో లాభాలు.

**మీనం:** ధనవ్యయం. పనులలో నిదానం అవసరం. చికాకులకు దూరంగా వుండండి. బంధువుల నుండి విలువైన సమాచారం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 2025-26 నుంచి ఇంజినీరింగ్ కాలేజీల్లో కొత్త ఫీజులు!

## ఫీజు నిర్ధారణ కోసం 1,229 కాలేజీలు దరఖాస్తు

## 20 ఇంజినీరింగ్ కాలేజీలు ఫీజు నిర్ధారణకు దరఖాస్తు చేయలేదు

## 2022 కంటే 62 కాలేజీలు తగ్గాయి

## ప్రారంభమైన 2025-28 బ్లాక్ పీరియడ్ ఫీజు నిర్ధారణ ప్రక్రియ

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలతోపాటు ఇతర వృత్తి విద్య కోర్సుల ఫీజుల నిర్ధారణ ప్రక్రియ ప్రారంభమైంది. 2022లో నిర్ణయించిన 2022-25 బ్లాక్ పిరియడ్ కాలపరిమితి ఈ ఏడాదితో ముగియనుంది. ఈ నేపథ్యంలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి 2025-28 బ్లాక్ పిరియడ్‌కి సంబంధించిన ఫీజు నిర్ధారణ కోసం తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్‌సీ) ఇంజనీరింగ్ కాలేజీలతోపాటు ఎంబీఏ, ఎంసీఏ, బీ ఫార్మసీ, బీఈడీ, లా, బీపీఈడీ తదితర వృత్తి విద్యా కోర్సుల ఫీజులను నిర్ణయించడం కోసం దరఖాస్తులను స్వీకరించింది. దరఖాస్తు గడువు ముగిసే సమయానికి రాష్ట్రంలో 1229 కాలేజీలు దరఖాస్తు చేసుకున్నాయి. అయితే గత బ్లాక్ పిరియడ్‌లో దరఖాస్తు చేసుకున్న కాలేజీల కంటే 62 కాలేజీలు తగ్గాయి. ప్రధానంగా ఇంజనీరింగ్ కాలేజీలతోపాటు ఎంబీఏ కాలేజీలు ఫీజుల నిర్ధారణ కోసం దరఖాస్తు చేసుకోలేదు. గత బ్లాక్ పిరియడ్‌లో 176 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు దరఖాస్తు చేసుకోగా.. ఈసారి కేవలం 157 కాలేజీలు మాత్రమే దరఖాస్తు చేసుకున్నాయి. బీ ఫార్మసీలో గతంలో 122 కాలేజీలు దరఖాస్తు చేస్తే.. ఈసారి 119 కాలేజీలు అప్లయి చేశాయి. ఎంఫార్మసీకి గతంలో 114 కాలేజీలు దరఖాస్తు చేస్తే ఈసారి 106 దరఖాస్తు చేశాయి. ఎంబీఏ కాలేజీలు గత 2022 బ్లాక్ పిరియడ్‌లో 267 దరఖాస్తు చేయగా.. ఈ సారి 249 కాలేజీలే దరఖాస్తు చేశాయి. బీఈడీ కాలేజీలు గతంలో 213 దరకాస్తు చేసుకుంటే.. ఈ ఏడాది 200మాత్రమే దరఖాస్తు చేసుకున్నాయి. మొత్తంగా 2022 బ్లాకన పిరియడ్‌లో 1291 కాలేజీలు దరఖాస్తు చేసుకోగా.. 2025 బ్లాక్ పిరియడ్‌కి 1229 కాలేజీలు దరఖాస్తు చేసుకున్నాయి. కాలేజీలు ఫీజు నిర్ధారణ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఆయా కాలేజీలు ఏఎఫ్ఆర్‌సీకి సమర్పించిన ఆదాయ, వ్యయాలను పరిశీలించిన అనంతరం కాలేజీ యామజాన్యాలతో ఏఎఫ్ఆర్‌సీ ముఖాముఖి చర్చలు జరపనుంది. కాలేజీలు విద్యార్థులు ఏర్పాటు చేసిన సౌకర్యాలు.. వారి వార్షిక ఖర్చుతోపాటు.. వారి ఆదాయం మేరకు ఆయా కాలేజీలకు వార్షిక ఫీజులను కోర్సును బట్టి నిర్ణయించి ఆ ప్రతిపాదనలను కాస్త ప్రభుత్వానికి సమర్పించనుంది. ఏఎఫ్ఆర్‌సీ సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఆయా కాలేజీలకు కోర్సుల వారీగా(ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ) ఫీజులను నిర్ధారణ చేయనుంది. ఈ ఏడాది జూన్, జులై నెలలో ప్రారంభమయ్యే అడ్మిషన్లన ప్రక్రియ కంటే ముందుగానే కాలేజీలకు ఫీజులను నిర్ణయించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కాలేజీల నుంచి దరఖాస్తులను స్వీకరించిన ఏఎఫ్ఆర్‌సీ ఆ తరువాత నిర్వహించాల్సిన ప్రక్రియను త్వరలోనే ప్రారంభించి మే చివరి నాటికి ప్రభుత్వానికి తమ ప్రతిపాదనలను పంపించడానికి ప్రణాళికను సిద్ధం చేసుకుంది.




సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ, మాజీ ఎంపి వెంకటేష్ నేత తదితరులు

# నేతకానీలకు ప్రత్యేక గ్రూప్ కేటాయించాల్సిందే

## ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, మాజీ ఎంపి వెంకటేష్ నేత

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులాల జనాభాను తప్పుల తడకగా భావిస్తూ నేతకాని సమాజాన్ని తక్కువ జనాభాగా చూపించడం జరిగిందని నేతగాని కులస్తులు నిరసన తెలియజేస్తున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ నందు నేతకాని కులసంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రకటనపైన 'నేతకానిల నిరసన గలం' పేరుతో పాత్రికేయుల సమావేశాన్ని" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, మాజీ ఎంపి వెంకటేష్ నేతలు హాజరై మాట్లాడారు. ఎస్సీ కులాలలో అధిక జనాభాను కలిగిన మూడవ పెద్ద కులం నేతకానిలకు కులగణనలో తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. వాస్తవలెక్కులను దాచిపెట్టి అశాస్త్రీయంగా తక్కువ సంఖ్యను ప్రపంచానికి తెలియజేస్తూ న్యాయబద్ధంగా చట్టబద్ధంగా రావలసిన వాటాను అందించకుండా కుట్రలు చేశారన్నారు.

మాల ద్వారానే ప్రభుత్వం మాపట్ల అణచివేత ధోరణి ప్రదర్శించి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ నేతకానిలకు అన్యాయం జరిగిన మాట వాస్తవమేనని వారి న్యాయబద్ధ పోరాటానికి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని భవిష్యత్తులో వాస్తవ జనాభాను తెలియజేసి వారి వాటాను వారు కేటాయించాల్సిందిగా ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిని ప్రసాద్ నేత మాట్లాడుతూ ఈ రిజర్వేషన్ వర్గీకరణ ద్వారా భవిష్యత్తు అంధకారమైందని విద్యార్థుల జీవితాలు ఆగమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు మా జనాభాను సీ గ్రూప్ నుండి వేరుచేసి ప్రత్యేకమైన డీ గ్రూపుగా చేర్చిమూడు శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతకాని కుల సంఘ అధ్యక్షులు దుర్గం రాజేష్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దర్శనాల భువనచంద్ర, కులసంఘ నాయకులు బోర్లకుంట దీపక్ కుమార్, దుర్గం శేఖర్, చల్లూరి ప్రకాష్ కామెర ప్రకాష్, అనపర్తి యువరాజ్, దుర్గం వినోద్, జాడి రాజ్ కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిరంతర ప్రక్రియగా రేషన్‌కార్డుల జారీ

## మీ సేవలో దరఖాస్తు చేసుకోవడానికి సర్కారు అవకాశం

## రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు ఇక సరళతరం

**హైదరాబాద్, ఫిబ్రవరి7,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు ఒక కీలక ప్రకటన చేసింది. ఇకపై కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. అంతేకాదు, కొత్త రేషన్ కార్డులు మాత్రమే కాకుండా ఇప్పటికే ఉన్న రేషన్‌కార్డుల్లో పేర్లు మార్పులు, చిరునామా మర్పులు ఇతర విలాసం మార్పులు అవసరమైనా వాటిని కూడా ఆన్‌లైన్ ద్వారా సులభంగా అప్డేట్ చేసుకొనే అవకాశం కల్పించింది. ఈ ప్రక్రియన మరింత సరళతరం చేసేందుకు ప్రభుత్వం మీ సేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తును అందుబాటులోకి తెచ్చింది. ప్రజలు తమ సమీపంలోని మీ సేవ కేంద్రాలను సందర్శించి అవసరమైన మార్పులు, కొత్త దరఖాస్తులను చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు. కొత్తరేషన్ కార్డుల జారీ నిరంతరం కొనసాగుతోందని దీనికి ఒక నిర్దిష్టమైన గడువులేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు అందించడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని స్పష్టం చేస్తూ ప్రజలు అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించింది. ప్రభుత్వం చేపట్టిన ఈ కొత్త నిర్ణయంతో రేషన్‌కార్డులు కోసం ఎదురు చూసే ప్రతి ఒక్కరికి ఊరట కలిగింది. లబ్దిదారుల నుంచి రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించాలని మీసేవ కమీషనర్‌ను పౌరసరఫరాల శాఖ కోరింది. రేషన్‌కార్డుల మంజూరుకు మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. నిరంతరం మీసేవా కేంద్రాలలో రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసు కోవచ్చని ప్రభుత్వం మీసేవ కమిషనర్‌కు తెలిపింది.

# పాఠశాల విద్యాశాఖ కొత్త ప్రయోగం

## టెన్త్ క్లాస్ విద్యార్థులకు.. 8,9 తరగతి విద్యార్థులతో ఆల్ ది బెస్ట్!

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 10వ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఒత్తిడి, టెన్షన్ లేకుండా పరీక్షలకు హాజరయ్యేలాగా పాఠశాల విద్య శాఖ చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా 10వ తరగతి పరీక్షలకు వెళ్లనున్న విద్యార్థులకు 8, 9వ తరగతి విద్యార్థుల నుంచి ఆల్ ది బెస్ట్.. బెస్ట్ ఆఫ్ లక్.. చెప్పించాలని నిర్ణయించారు. అన్నలూ.. అక్కలూ ఆల్ ది బెస్ట్.. గుడ్ లక్.. బెస్ట్ ఆఫ్ లక్.. టెన్షన్ పడకండి.. ఒత్తిడికి గురికాకండి.. మీరే మాకు ఆదర్శం.. పరీక్షలు బాగా రాయండి అన్న పోస్టర్లు ప్లకార్డులు పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు 8, 9వ తరగతి విద్యార్థులు స్వాగతం పలకనున్నారు. టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గ్రామస్తులు, తల్లిదండ్రులు సైతం శుభాకాంక్షలు తెలుపుతారు. ఇలాంటి వినూత్న ప్రయత్నానికి పాఠశాల విద్యాశాఖ శ్రీకారం చుట్టనుంది. 10వ తరగతి వార్షిక పరీక్షలు మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్న విషయం తెలిసిందే. ఈ పరీక్షకు 5.1లక్షలకు పైగా విద్యార్థులు హాజరుకానున్నారు.

విద్యార్థుల్లో మనోధైర్యం నింపేలా పరీక్షల సందర్భంగా 8, 9వ తరగతి విద్యార్థుల చేత బెస్ట్ విషెస్, ఆల్ ది బెస్ట్ విషెస్ చెప్పించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలిచ్చింది. తల్లిదండ్రులు సహా గ్రామస్తుల చేత సైతం పోస్టర్లు, ప్లకార్డులతో శుభాకాంక్షలు చెప్పించాలని సూచించింది. సెంట్రల్ మార్కుల రిజిష్టర్.. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటికే యాక్షన్‌ప్లాన్‌ను రూపొందించి అమలుచేయనున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టనున్నారు. కొత్తగా సెంట్రల్ మార్కుల రిజిష్టర్‌ను నిర్వహించాలని సూచించారు. రోజు, వారంతపు పరీక్షలను నిర్వహించి, విద్యార్థులు సాధించిన మార్కులను ఆయా రిజిష్టర్‌లో నమోదు చేయాలని దానిని.. పాఠశాల హెచ్‌ఎంలు ఎప్పటికప్పుడు సమీక్షించాలని, నెమ్మదస్తులు కోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలని.. డీఈవోలు, ఎంఈవోలు పాఠశాల వారిగా సమీక్షించాలని సూచించారు.

## పోక్సో చట్టం కింద నలుగురు నిందితులకు రిమాండ్

**హైదరాబాద్ (నార్సింగి), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ జరిగిన ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం హైదర్షాకోట్‌కు చెందిన ఓ మైనర్ బాలికకు నలుగురు యువకులు మాయమాటలు చెప్పి

# హైదర్షాకోట్‌లో బాలికపై గ్యాంగ్‌రేప్


అత్యాచారం చేశారు. బాలిక ఆ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

బాలిక తల్లిదండ్రులు నార్సింగి పోలీసులకు జరిగిన ఘోరంపై ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై స్థానిక ప్రజలు తీవ్రఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని, మరొకరు ఇలాంటి దారుణాలకు ఒడిగట్టకుండా ఉండేలా వీరికి శిక్షలు వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ దారుణానికి ఒడిగట్టిన దుండగులు మధుసూదన్, జయంత్, తరుణ్ కుమార్, సాయికుమార్‌లను రిమాండ్‌కు తరలించి, కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

## రతన్ టాటా ఆస్తుల్లో మోహినీమోహాన్‌దత్తాకు

# రూ.500 కోట్లు!

### తాజాగా వెలుగులోకి వచ్చిన వీలునామా



**ముంబయి, ఫిబ్రవరి 7:** దివంగత పారిశ్రామిక వేత్త టాటాసన్స్ అధినేతగా కొనసాగిన రతన్ టాటా రాసిన తన వీలునామాలో పలువురికి తన ఆస్తులు చెందాలని రాసారు. అనేక సామాజిక సేవల్లోను పాలుపంచుకున్న రతన్ టాటా తన వద్దపనిచేస్తున్న వ్యక్తులు, పెంపుడు శునకాలకు ఇస్తూ వీలునామా రాసారు. ఇపుడు మరో వీలునామా బయటకు వచ్చింది. అందులో ఒక రహస్య వ్యక్తికి తన ఆస్తిలో 500 కోట్లు ఇవ్వాలని రతన్‌టాటా రాసారు. జెంషెడ్‌పూర్‌కు చెందిన ట్రావెల్స్ వ్యాపారవేత్త మోహిని మోహన్ దత్తా అని మీడియా చెపుతోంది. మోహన్‌దత్తా ఆరుదశాబ్దాలకు పైగా రతన్ టాటా దగ్గర నమ్మకంగాపనిచేసారు. తాజ్‌గ్రూప్ హోటల్స్‌లో భాగం అయిన తాజ్ సర్వీసెస్‌లో 2013నుంచి మోహన్‌దత్తాకు చెందిన స్టాలియన్ ట్రావెల్ ఏజెన్సీ కలిసి పనిచేస్తోంది. టాటాగ్రూప్‌నకు చెందిన అధికారుల వివరాలప్రకారం మోహన్‌దత్తా టాటా కుటుంబానికి అత్యంత సన్నిహితునిగా మెలిగారు. రతన్‌టాటా మరణించినపుడు దత్తా ఆయనతో ఉన్న అనుబంధంపై మాట్లాడుతూ రతన్‌టాటా 24 ఏళ్లవయసునుంచి తెలుసని అన్నారు. తన జీవితంలో తాను ఎదిగేందుకు ఎంతోసాయంచేసారని గుర్తుచేసుకున్నారు. రతన్‌టాటా మరణానంతరం బయటకు వచ్చిన వీలునామాలోమూడు దశాబ్దాలుగా తనవద్దపనిచేస్తూ తోడుగా ఉన్న వ్యక్తిగత సహాయకులు రాజన్‌షా, సుబ్బయ్య, పెంపుడు శునకం టిటోపేర్లనుచేర్చారు. టాటాకు ఉన్న సుమారు 10వేల కోట్ల ఆస్తులు, ఆయన నెలకొల్పిన ఫౌండేషన్‌లకు సోదరుడు జిమ్మీ టాటాకు తన సహాయకులు ఇతరులకు చెందుతాయని అందులో రాసినట్లుగా తెలుస్తోంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..

# శ్రవణ్‌రావు ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిం దితుడుగా వున్న మీడియా అధినేత శ్రవణ్ రావు ముందస్తు బెయిల్‌పై హైకోర్టులో వాదనలు శుక్రవా రం నాడు ముగిశాయి. దీనిపై తీర్పును న్యాయస్థానం రిజర్వ్ చేసింది. ఈ సందర్భంగా జరిగిన విచారణలో పిపి తన వాదనలు వినిపిస్తూ శ్రవణ్‌రావుకు బెయిల్ ఇవ్వరాదని కోరారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయన కీలక నిందితుడని, అమెరికాకు పారిపోయి అక్కడి నుంచి బెయిల్ పిటిషన్ దాఖలు చేస్తున్నాడని పిపి తెలిపారు. శ్రవణ్‌రావును చట్టబద్దమైన నేరగాడుగా పరిగణించాలని ఆయన కోరారు. ఈ వాదనలతో శ్రవణ్‌రావు తరపు న్యాయవాది విబేధించారు. దీనిపై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది.

# తీన్మార్ మల్లన్నపై కామారెడ్డిలో కేసు నమోదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఎంఎల్‌సీ తీన్మార్ మల్లన్నపై మరో కేసు నమోదయింది. మల్లన్న తమ కులాన్ని దూషించడంతోపాటు కించపరుస్తూ ప్రసంగం చేశారని ఆరోపిస్తూ కామారెడ్డి జిల్లా బాన్సువాడ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదయింది. రెడ్డి సంఘం సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు బాన్సువాడ పోలీసులు ఈ కేసును నమోదు చేశారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న స్వార్థ రాజకీయ లబ్ధి కోసం రెడ్డిలపై ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని ఆరోపించారు.

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), హెడ్ క్వార్టర్స్ సర్కిల్
ఖైరతాబాద్, హైదరాబాద్-500004
నిట్ నెం: 09/T1/TS/SEHOC/TISS/2025, తేదీ: 05.02.2025, 1) పని పేరు మరియు సుమారు అంచనా కాంట్రాక్ట్ విలువ వివరాలు: రాజేంద్రనగర్ వద్ద హిల్ టాప్ భవన సెంటర్ బిల్డింగ్ వద్ద మరియు P/o TGIRDలోని పాత ల్యాండ్ సెల్ బిల్డింగ్ మరియు S.R. శంకరన్ బ్లాక్ ఆఫీసర్స్ క్వార్టర్స్ (2) పెద్ద ప్రత్యేక సివిల్ మరియు పారిశుధ్య మరమ్మతు పనులు, ECV రూ.67,88,606/- 2) బిడ్డర్ల అర్హత యొక్క చివరి తేదీ, సమయం: 21.02.2025 మ.3.00 గం.వద్ద. 3) టెండర్ల స్వీకరణ యొక్క చివరి తేదీ, సమయం: 21.02.2025 మ.3.30 గం.వద్ద. 4) టెండర్ల తెరచు తేదీ: టెక్నికల్ బిడ్: 21.02.2025 సా.4.00 గం. వద్ద. ప్రైస్ బిడ్: 24.02.2025 మ.1.00 గం.వద్ద. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in వద్ద 07.02.2025 నుండి మ.3.00 గం. అప్లై చూడవచ్చును. సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), తరపున, హెడ్ క్వార్టర్స్ సర్కిల్, హైదరాబాద్
DIPR.No.10060-PP/CL/Advt/1/2024-25, తేదీ: 07.02.2025

# బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**వికారాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** బిటెక్ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన క్షీరసాగర్ సత్యనారాయణ పిల్లల చదువు నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి వికారాబాద్ పట్టణంలోని గాంధీ కాలనీలో అద్దెకు ఇల్లు తీసుకుని నివాసం ఉంటున్నాడు. సత్యనారాయణ కూతురు జ్యోతి హైదరాబాద్ నగరంలో ఓ కళాశాలలో బీటెక్ చదువుతుంది. ఇదిలా ఉండగా, సత్యనారాయణ దగ్గరి బంధువులకు సంబంధించి పెళ్ళి ఉండటంతో కుటుంబ సభ్యులందరు వారి స్వగ్రామమైన ముజాహిద్‌పూర్‌కి ఈ నెల 5న వెళ్ళారు. కూతురు జ్యోతి తనకు పరీక్షలు ఉన్నాయని, చదువుకోవాలని చెప్పి 6వ తేదీన వికారాబాద్‌కు తిరిగి వచ్చింది. బంధువుల పెళ్ళికి కావాల్సిన బట్టలు వికారాబాద్‌లోని అద్దె రూమ్‌లో ఉండటంతో సత్యనారాయణ కుటుంబంతో సహా తిరిగి వికారాబాద్‌కు శుక్రవారం ఉదయం వచ్చారు. ఎంతసేపు కూతురు జ్యోతి ని పిలువగా తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు బద్దలు కొట్టి తెరిచి చూశారు. కూతురు జ్యోతి(19) ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడాన్ని చూసిన తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతురాలి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీమకుమార్ తెలిపారు.

### ఉరివేసుకుని టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్ (ఉప్పల్), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** ఉరివేసుకుని పదో తరగతి చదవుతున్న ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ ఇందిరానగర్‌లో నివసించే నీలం విజయ్‌కుమార్, పావనిలకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె నీలం పవిత్ర (15) రామంతాపూర్‌లోని ఒక ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. అయితే శుక్రవారం ఉదయం పదిన్నర సమయంలో తల్లి పావని తన కుమార్తె పవిత్రను స్కూల్ నుంచి ఇంటికి తీసుకుని వెళ్లి మెటిమలు వస్తున్నాయని ఆసుపత్రి తీసుకెళ్లి చూయించింది. అనంతరం తిరిగి 12.30 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద వదిలి బ్యాంక్ పని మీద బయటికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. తిరిగి వచ్చి చూసే సరికి ఇంట్లో ఫ్యాన్‌కు విద్యార్థిని పవిత్ర ఉరివేసుకుని కనిపించిందని తెలిపారు. దీంతో వెంటనే స్థానికుల సహాయంతో కిందకు దింపు చూడగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి ఒక చెల్లెలు నీలం బిందు ఉందని పోలీసులు తెలిపారు. తల్లి నీలం పావని ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ముంబయిలో ఆగని డ్రగ్స్ స్మగ్లింగ్

## ఎన్‌సిబి దాడిలో రూ.200 కోట్ల కొకైన్, హైబ్రిడ్ గంజాయి జప్తు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** దేశ ఆర్థిక రాజధాని ముంబాయిలో డ్రగ్స్ దందాలు ఆగడం లేదు. ఓవైపు పోలీసులు మరోవైపు కోస్ట్ గార్డ్ ఇంకోవైపు నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) వరుసగా దాడులు చేస్తున్నా మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాల కార్యకలాపాలు యధేచ్ఛగా కొనసాగుతూనే వున్నాయి. తాజాగా శుక్రవారం నవీ ముంబాయిలో 200 కోట్ల రూపాయల విలువ చేసే కొకైన్, హైబ్రీడ్ గంజాయిని జప్తు చేశారు. ఈ సందర్భంగా నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. నెల రోజుల క్రితం ముంబాయి తీర ప్రాంతంలో ఓ పడవలో 200 గ్రాముల కొకైన్ లభ్యం కాగా దీనిపై విచారణ జరిపిన ఎన్‌సిబి అధికారులు నవీ ముంబయిలో ఓ ప్రాంతంలో దాచి వుంచిన 11.54 కిలోల నాణ్యమైన కొకైన్‌తోపాటు 5.5 కిలోల హైబ్రీడ్ గంజాయిని జప్తు చేశారు.

గంజాయిని 200 ప్యాకెట్లలో ప్యాకింగ్ చేసి వుండ గా పట్టుకున్నారు. పట్టుబడ్డ మాదకద్రవ్యాల విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో 200 కోట్ల రూపాయలుగా తేలింది.

కొకైన్, హైబ్రీడ్ గంజాయి అమెరికా నుంచి కొరియ ర్‌లో పార్సిల్ ద్వారా ముంబాయి వచ్చినట్లు తేలింది. పట్టుబడ్డ నలుగురు స్మగ్లర్ల వివరాలను ఎన్‌సిబి అధికారులు వెల్లడించలేదు. వీరిని విచారిస్తున్నామని, వీరికి అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్ ముఠాలతో సంబంధాలు వుండివుంటాయని వారు చెబుతున్నారు. కాగా నవీ ముంబాయి ప్రాంతంలో 2024 ఏడాదిలో 654 డ్రగ్స్ కేసులు వె లుగు చూడగా ఈ సందర్భంగా 939 మంది స్మగ్లర్లు అరెస్టయ్యారు. అంతకు ముందు ఏడాది 2023లో 475 కేసులతో పోలిస్తే గత ఏడాది ఎక్కువగా వుండడం గ మనార్హం. గత ఏడాది పట్టుబడ్డ డ్రగ్స్ విలువ మూడున్నర వేల కోట్ల రూపాయలకు పైగానే వుంటుందని అధికారులు చెబుతున్నారు.

భారత్ డైనమిక్స్ లిమిటెడ్
(రక్షణ మంత్రిత్వశాఖ యొక్క భారత ప్రభుత్వ సంస్థ)
CIN :-L24292TG1970GOI001353
కార్పొరేట్ కార్యాలయం : ప్లాట్ నెం. 38-39, TSFC బిల్డింగ్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, హైదరాబాద్-500032.
నమోదిత కార్యాలయం : కంచన్‌బాగ్, హైదరాబాద్: 500058. టెలి : 040-23456145; ఫ్యాక్స్ : 040-23456110
ఇ-మెయిల్: investors@bdl-india.in; వెబ్‌సైట్ : https://bdl-india.in

31వ డిసెంబర్ 2024తో ముగిసిన త్రైమాసిక మరియు తొమ్మిది నెలల కాలానికి ఆడిట్‌కాని ఆర్థిక ఫలితాల స్టాండ్ ఎలోన్ యొక్క సంగ్రహం

(రూ.లక్షలలో)

| క్ర సం. | ముఖ్యాంశాలు | త్రైమాసిక ముగింపు | | | తొమ్మిది నెలల ముగింపు | | వార్షిక ముగింపుకొంకు |
|---|---|---|---|---|---|---|---|
| | | 31.12.2024 (ఆడిట్‌కానివి) | 30.09.2024 (ఆడిట్‌కానివి) | 31.12.2023 (ఆడిట్‌కానివి) | 31.12.2024 (ఆడిట్‌కానివి) | 31.12.2023 (ఆడిట్‌కానివి) | 31.03.2024 (ఆడిట్‌అయినవి) |
| 1 | ఆపరేషన్స్ నుండి మొత్తం రాబడి | 83213.69 | 54476.88 | 60161.99 | 156807.52 | 151515.36 | 236927.51 |
| 2 | ఆ కాలానికి నికర లాభం/(నష్టం)(పన్ను మినహాయింపుకు ముందు మరియు/లేదా అసాధారణ ఐటమ్‌లు) | 19288.40 | 16647.02 | 18910.26 | 37058.76 | 44036.14 | 82823.52 |
| 3 | నికర లాభం/(నష్టం) ఆ కాలానికి (పన్ను మినహాయింపు తర్వాతకు ముందు మరియు/లేదా అసాధారణ ఐటమ్‌లు) | 19288.40 | 16647.02 | 18910.26 | 37058.76 | 44036.14 | 82823.52 |
| 4 | నికర లాభం/ (నష్టం) పన్ను తర్వాత కాలం కొరకు (మినహాయింపు తర్వాత మరియు/లేదా అసాధారణ ఐటమ్‌లు) | 14712.54 | 12253.16 | 13503.40 | 27687.33 | 32394.42 | 61272.06 |
| 5 | ఆ కాలానికి మొత్తం సమగ్ర రాబడి (ఆ కాలానికి లాభం/(నష్టం) కలుపుకొని (పన్ను తర్వాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తర్వాత) | 15009.13 | 12116.47 | 13688.78 | 27651.23 | 32080.33 | 60952.33 |
| 6 | సాధారణ షేర్ పెట్టుబడి (ఒక్కొక్క షేర్-రూ.5/- యొక్క మౌళిక విలువ) | 18328.12 | 18328.12 | 18328.12 | 18328.12 | 18328.12 | 18328.12 |
| 7 | గత సంవత్సరం యొక్క ఆడిట్ అయిన బ్యాలెన్స్‌షీట్‌లో చూపిన విధంగా ఇతర ఈక్విటీ. | - | - | - | - | - | 345354.21 |
| 8 | షేర్ ఒక్కంటికి ఆర్జనలు (ఒక్కొక్కటీ రూ.5/- యొక్క యాన్యులైజ్డ్ కానివి) కొనసాగించబడిన మరియు నిలిపివేయబడిన నిర్వహణల కొరకు బేసిక్ మరియు డైల్యూటెడ్ (రూపాయలలో) | 4.01 | 3.34 | 3.68 | 7.55 | 8.84 | 16.72 |

గమనికలు:
1. రక్షణ ఉత్పత్తిలో నియమించబడిన కంపెనీని, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MCA) సెగ్మెంట్ రిపోర్టింగ్ యొక్క ఆవశ్యకత నుండి మినహాయించింది.
2. కంపెనీకి అనుబంధ సంస్థలు/సంఘాలు/ఉమ్మడి వ్యాపారాలు లేవు.
3. పైన పేర్కొనబడిన ఆర్థిక ఫలితాల స్టేట్‌మెంట్ 06 ఫిబ్రవరి 2025న నిర్వహించబడిన వారి సంబంధిత సమావేశాలలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదింపబడి మరియు ఆడిట్ కమిటీచే సమీక్షించబడింది.
4. పైన పేర్కొనబడిన ఆర్థిక ఫలితాలు, కంపెనీల చట్టం 2013 సంబంధిత దాని క్రింద నిబంధనలతో చదువబడే విధంగా మరియు (SEBI) (LODR) నిబంధనలు 2015 మరియు దాని సవరణల యొక్క నిబంధన 33 యొక్క నిబంధన నియమాలను మరియు అందులోని సంబంధిత నిబంధనలతో చదువబడే కంపెనీల చట్టం 2013 యొక్క సెక్షన్ 133 క్రింద ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ నిర్దేశితానికి అనుగుణంగా తయారుచేయబడినవి.
5. పైన పేర్కొనబడిన ఆర్థిక ఫలితాలు, కంపెనీల చట్టం 2013 అందులోని సంబంధిత నిబంధనలతో చదువబడే విధంగా మరియు (SEBI) (LODR) నిబంధనలు 2015 మరియు దాని సవరణలు, దాని యొక్క నిబంధన 33 యొక్క దాని నియమ నిబంధనలను అనుసరించి 133 సెక్షన్ క్రింద నిర్దేశించబడిన ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ ప్రకారం తయారుచేయబడినవి. పైన పేర్కొన్నది SEBI (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) నిబంధనలు 2015 యొక్క నిబంధన 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజ్‌లతో దాఖలైన ఆడిట్‌కాని ఆర్థిక ఫలితాల యొక్క సవివర నమూనా యొక్క సంగ్రహం. 31వ డిసెంబర్ 2024తో ముగిసే త్రైమాసిక మరియు తొమ్మిది నెలలు ఆడిట్ కానటువంటి ఆర్థిక ఫలితాల యొక్క సంపూర్తి ఫార్మాట్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్ సైట్ అనగా www.bseindia.com మరియు www.nseindia.com పై సంబంధితంగా అందుబాటులో ఉన్నాయి, మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్ www.bdl-india.in పైన కూడా ఉన్నాయి.
6. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు 06.02.2025న నిర్వర్తించబడిన దాని సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఒక్కొక్క రూ.5/-యొక్క ముఖ విలువ యొక్క షేర్ ఒక్కంటికీ రూ.4 యొక్క ఇంటీరిమ్ డివిడెండ్ ప్రకటించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈక్విటీ వాటాలపై ఇంటీరిమ్ డివిడెండ్ యొక్క చెల్లింపు నిమిత్తం "రికార్డ్ తేదీ"గా 14 ఫిబ్రవరి 2025ను కంపెనీ నిర్ణయించింది.

ప్రదేశం : హైదరాబాద్
తేదీ : 06.02.2025

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ తరఫున
సం/-
Cmde ఎ.మాధవరావు (రిటైర్డ్.)
ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్
(DIN: 09808949)

వార్త

ఒక రాజ్యంలో నివసించే ప్రజల భాషను తెలుసుకోకుండా, ప్రజాభిప్రాయం తెలుసుకోవడం సాధ్యంకాదు.

-బార్కర్

# అక్ర 'మార్కుల' ఆటకట్టించలేమా?

విద్యా సంవత్సరానికి సంబంధించి పరీక్షల తేదీలను ప్రకటించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో టెన్షన్ ప్రారంభమైంది. పరీక్షా విధానంలో మార్పులు, తప్పులు లేని ప్రశ్నపత్రాలు ఇవ్వడంలో విఫలం,లీకులు సర్వసాధారణమైపోయాయి. ఈ యేడాది పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందడం సహజమే. తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ముడిపడి ఉండే ప్రధానంగా పదో తరగతి, ఇంటర్మీడియేట్, కొన్నియూనివర్సిటీలు నిర్వహిస్తున్న డిగ్రీ కోర్సులు, ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి ప్రొఫెషనల్ కోర్సుల ప్రవేశఅర్హత పరీక్షలు, ఇతర కామన్ ఎంట్రన్స్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించలేకపోతున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్‌కు సంబంధించి కీలకమైన ప్రశ్నపత్రాల్లో గత రెండు, మూడు దశాబ్దాలుగా ఒక్కసారి కూడా తప్పులు లేకుండా ఇవ్వలేకపోయారంటే అధికారగణం అసమర్థతను ఊహించుకోవచ్చు. ఈయేడాది ఎలాంటి తప్పులు లేకుండా ప్రశ్నపత్రాలు రూపొందించి వాటిని పరీక్ష నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పాలకులు పాత పాటే పాడుతున్నారు. గత అనుభవాల దృష్ట్యా పాలకులహామీలపై నమ్మకం కలగడంలేదు. లీకులు ఒకపక్క, మరొకపక్క తప్పులు, అధికారగణం అసమర్థతను చెప్పకనే చెబుతున్నాయి. ఈ వైఫల్యాల కారణంగా ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిపోతున్నది. ప్రస్తుతం ఉన్న పాలకుల కాలంలోనే ఈ అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని, పరీక్షా నిర్వహణలో సమర్థవంతంగా వ్యవహరిస్తున్నారని చెప్పడం లేదు. ఏనాటి నుంచో ఇది కొనసాగుతున్నది. ప్రశ్నపత్రాలు లీక్ అయిన విషయం కొన్ని సందర్భాల్లో బయటపడుతుంది. ఇలా బయటపడిన సందర్భాల్లో ప్రభుత్వం విధిలేని పరిస్థితుల్లో పరీక్షలను వాయిదా వేస్తున్నది. మళ్లీ పరీక్షలు నిర్వహిస్తున్నది. ఇందుకు గత పదేళ్లలో చూసినా ఎన్నో ఉదహరించవచ్చు. రద్దు అయిన పరీక్షలకు తిరిగి హాజరు కావాల్సిన విద్యార్థుల పరిస్థితి ఒక్కసారి పాలకపెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. రాత్రింబవళ్లు కష్టపడి పరీక్షలకు తయారై రాయాల్సిన సమయానికి అది వాయిదా పడినా లేక రాసిన పరీక్షను రద్దుచేసి మళ్లీ రాయమన్నా ఆ విద్యార్థులు ఎంతటి నిరాశానిస్పృహలకు గురవుతారో పాలకులు ఆలోచించడం లేదు. ఇక ప్రశ్నపత్రాలు లీక్ అయి బయటపడకుండా ఉంటే ఈ ప్రశ్నపత్రాలు కొన్నవారు అందలమెక్కిపోతున్నారు. ప్రశ్నపత్రాల జవాబును కంఠస్తం చేసిన ప్రబుద్ధులు ఎలాంటి కష్టం లేకుండా మేధావులుగా పైకివెళ్లిపోతుంటే సంవత్సరం పొడువునా శ్రద్ధాశక్తులతో కష్టపడి చదివిన మెరికల్లాంటి విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. ప్రభుత్వంపరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఈ పరీక్షలపై పటిష్టమైన నిఘా ఉంచాలి. అసలు అవి ఏ దశలో లీక్ అవు తున్నాయి?బాధ్యులు ఎవరు? ప్రశ్నపత్రాలుతయారు చేసేవారా?వాటిని సరిచూసి సక్రమంగా ఉన్నాయా?లేదా అని నిర్ధారించేవారా? లేక ఈ ప్రశ్నపత్రాలు రహస్యంగా తయారు చేసి రవాణా చేస్తున్నవారా? లేక పరీక్షా కేంద్రాలకు చేరిన తర్వాత అది నిర్వహిస్తున్న అధికారులా? తదితర విషయాలు క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. గతంలో ఒకసారి మెడికల్ ప్రశ్నపత్రాలు రూపొందించిన ప్రొఫెసరే లీక్‌కు బాధ్యుడు కాగా మరొకసారి ఎంసెట్ ప్రశ్నపత్రాలు ముద్రించిన ప్రింటింగ్ యజమాని బాధ్యుడైనట్లు అప్పటి పోలీసుల దర్యాప్తులో వెల్లడయింది. మొత్తం ఇలాంటి కీలకమైన పరీక్షల్లో కూడా అవకతవకలు జరుగుతుండడంతో విద్యావ్యవస్థ ఎంతటి పతనావస్థకు దిగజారిపోతున్నదో స్పష్టమవుతున్నది. చదువుల తల్లి సరస్వతిదేవిని నడిబజారులో విక్రయించేఘోర స్థితి చేరడం, చదివే జీవన్మరణ సమస్యగా రాత్రింబవళ్లు కృషి చేస్తున్న విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచిస్తే ఆవేదన కలగకతప్పదు. నిత్య అధ్యయనంతో విజ్ఞానం ఆర్జించి పరిశోధనలతో మేధాసంపత్తిని పెంచుకోవాల్సిన విద్యావిధానం డబ్బుతో కొనుక్కునే స్థాయికి దిగజారడం దురదృష్టకరం. ఇందుకు కోచింగ్ సెంటర్లను కానీ, మరి కొన్ని రెసిడెన్షియల్ కాలేజీలనుకానీ నిందించి ప్రయోజనం లేదు. విద్యను వ్యాపారవస్తువుగా మార్చి స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం ప్రభుత్వమే వారికి కల్పించినట్లు పరిస్థితులు చెబుతున్నాయి. వారిలో కూడా కొందరు ఇప్పటికీ విద్యాబోధనే పరమావధిగా భావించే వారు కూడా ఉన్నారు. కానీ తమ కళ్లముందే వెలసిన కోచింగ్ సెంటర్లు అతి స్వల్పకాలంలోనే కోట్లకు పడగెత్తడం చూసిన వారికి ఆ 'ఉన్నతి'ని తాము కూడా సాధించాలనే ఆశ పెరగడం సహజమే. ఆ ఆశే దురాశగా రూపాంతరం చెందినప్పుడు అక్రమాలకు అదుపు ఉండదు. అందుకే వారిని విమర్శించడానికి ముందు ఈ పరీక్షల నిర్వహణకు వేలాదిరూపాయల జీతభత్యాల రూపేణ ప్రజాధనం తీసుకుంటూ బాధ్యత వహిస్తున్న సంబంధిత అధికారులను నిలదీయాలి. ఆశాఖలోని కొందరు అధికారుల అవినీతితో పాటు రాజకీయజోక్యం, ఆశ్రిత పక్షపాతం వల్లనే పరీక్షల కు ఈ దుస్థితి దాపురిస్తున్నది. అంతేకాదు పరీక్షాపత్రాలు లీకైన సందర్భాల్లో కూడా బాధ్యులైన అధికారులపై పటిష్టమైన చర్యలు లేకపోవడం వల్లనే మళ్లీమళ్లీ పునరావృతం అవుతున్నాయి. అక్రమాలకు బాధ్యులైన అధికారులను తొలగించడమే కాదు, క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేసివారి ఫొటోలను మీడియా ద్వారా, వాల్‌పోస్టర్ల ద్వారా ప్రజలకు తెలియపరచాలి. ప్రభుత్వం అంత కఠినంగా వ్యవహరించకపోతే డబ్బులతో పరీక్షాపత్రాలు కొనుగోలు చేయాలనే ఆశపడేవారికి, వ్యాపారం చేసేవారికి భయం ఉండదు.

జీవితంలో తృప్తి పడటం నేర్చుకున్న వ్యక్తి ఎన్నడూ విచారానికి గురికాడు. అది చేతకాని వ్యక్తి ఎప్పుడూ దుఃఖానికి గురవుతూనే ఉంటాడు.



జార్జి ఇలియట్

నీ గురించి ప్రజలు ఏమనుకోవాలని కోరుకుంటావో, అలా కావడానికి ప్రయత్నించడంలోనే జీవితానికి సార్థకత ఉంది.



విలియం జేమ్స్

## ప్రజావాక్కు



### బోసిపోతున్న ప్రభుత్వ ఖజానా

ప్రయాగరాజ్ స్టేషన్‌లో ట్రైన్ కోసం బెంచ్ మీద కూర్చుని నిరీక్షిస్తున్న పూరిశంకరాచార్య నిశ్చలానంద స్వామి వారిని చూసి ఆయన చాలామంది రాజకీయనాయకులు, పెద్ద ప్రభుత్వ ఉద్యోగులు నేర్చుకోవలసింది ఎంతైనా ఉంది. కళ్లు బైరులు తెచ్చే ఆయన ప్రొఫైల్ చూస్తే ఆయన ఎంత సామాన్య జీవితం గడుపుతున్నారో అర్థంఅవుతోంది. ప్రజాధనాన్ని విలాసవంతమైన ప్రయాణ ఖర్చులకు,తమ తమ బంధుమిత్రుల దైవదర్శనాలకు, పనిపేరుతో విలాస ప్రయాణాలకు ఖర్చుపెట్టేవీరుఇలాంటి మహానుభావులను చూసయినా స్వయం అవలోకన చేసుకొని నడుచుకుంటే ప్రభుత్వాల ఖజానా ఎందుకు బోసి పోతుంది. ఆలోచించాలి. డిప్యూటీ సి ఎం గారు ఈ విషయములో ఒక్కరే కొరడా ఝళిపించగల సామర్థ్యం ఉన్న వారు అనుకోవడంలో సందేహం లేదు.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### వ్యాఖ్యల దుమారం

బిజెపికి చెందిన ఎమ్మెల్యే, ఎంపి మంత్రులు తరుచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తాజాగా మోహన్‌భగవత్ వీరి పంచన చేరారు. దేశ చరిత్రను, దివంగత నాయకులను అవమానిస్తూ మాట్లాడటంఅంటే వీరికిచాలా ఇష్టంలాఉంది. ఎమ్మెల్యేలు, ఎంపిలు ప్రజల ముందు మాట్లాడే సమయంలో ఆచితూచి మాట్లాడాలి. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడటం సబబు కాదు.

-మిథునం, హైదరాబాద్

### ఆంగ్ల మాధ్యమంగా విద్యాబోధన

కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు ఇటీవల ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ఆంగ్లాన్ని విద్యాబోధన మాధ్యమంగా ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. తెలుగు రాష్ట్రాలు రెండూ ప్రాథమికవిద్య నుంచే ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపడుతున్నాయి. అందుకు అనుగుణంగా, వచ్చే విద్యా సంవత్సరం నుండే ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రారంభించటానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. జపాన్,ఐర్లాండ్,పోలాండ్, ఫిన్లాండ్,దక్షిణకొరియా వంటి దేశాల్లో ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరుగుతోంది. దీంతోవిద్యార్థికిబోధనఅంశం సమగ్రంగా అర్థమవుతుంది.

-సి.హెచ్. ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### సెకి ఒప్పందం రద్దు చేసుకోవాలి!

రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గాల్సిందే అంటున్నారు. మరి గత ప్రభుత్వం సెకితో చేసుకున్న సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంరాష్ట్రానికి పూర్తిగా నష్టదాయకం. దానిపై తెలుగు దేశంపార్టీ న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించడం జరిగింది. ఆ తర్వాత ఒప్పందంలో అవినీతి చోటు చేసుకుందని ఆధారాలతో సహా అమెరికా న్యాయస్థానంలో కేసు కూడా నమోదు చేశారు. ఈ అవినీతిలో జగన్ లడ్డూలా దొరికాడు అనికూడా వ్యాఖ్యానించారు. ఈనేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రభుత్వానికి భారమైన సెకి ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. లేదంటే కొనుగోలు షరతులనైనా మార్చుకోవాలి? ఈ విషయంలో ముఖ్యమంత్రి చర్యలు తీసుకోకపోతే ప్రజల్లో ప్రభుత్వం పై విశ్వాసం పోతుంది!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### ఆ రోజులు మళ్లీరావు

మగ ప్రధానులు చూపలేని ధైర్యాన్ని ఇందిరాగాంధీ చూపారు. వారు చేయలేని సాహస కృత్యాలను ఆవిడ చేశారు. రాజకీయ ప్రత్యర్థుల నోటనుంచి శభాష్,వీరనారి,అపరదుర్గ అనే మాటలు వచ్చేలా పనిచేశారు. పాలన బావుంటే అప్పట్లో ఉన్న ప్రతిపక్ష నాయకులు ఇలానే ప్రశంసించేవారు. విలువలను పాటిస్తూ అధికార పార్టీ వారిని గౌరవంగా చూసేవారు. ఇప్పుడు అలాంటి ప్రతిపక్ష నాయకులు కాగడా పట్టుకుని వెతికినా కానరావటం లేదు. అధికారంలో ఉన్న వారిని చూసి అసూయపడే వారు ఎంత పనిచేస్తున్నా ప్రజలకు మంచి చేయడం కోసం చెమటోడ్చుతున్నా విమర్శించేవారు అధికారం కోసం పాకులాడే స్వార్థబుద్ధి గలవారే కనబడుతున్నారు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### అంతర్యుద్ధం

బర్మాలో జరుగుతున్న అంతర్యుద్ధం తారాస్థాయికి చేరిన బర్మాలో సామాన్య ప్రజలకు ప్రజాస్వామ్యం పట్ల ఉండే ఆకాంక్షను వ్యక్తీకరణ చేస్తుంది. 87 శాతం ఓట్లు గెలుచుకున్న సూకీ ని కాదని ముఖ్యమైన అధికారాలను దగ్గర పెట్టుకొని నియంతృత్వ పోకడలతో అధికారంలోకి వచ్చిన సైన్యం ను ప్రజలు ఎవగించుకుంటున్నారు. అది ప్రజాస్వామ్యం పట్ల ఆ పాలన పట్ల అక్కడి ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనం. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజాపాలన జరిగితే మంచిది.

-భారత అవినాష్, జనగామ

మన విధి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విస్తరిస్తున్న అవయవాల వ్యాపారం

**అన్నింటి కంటే ముఖ్యంగా అవయవదానం గూర్చి ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. అమెరికా, స్పెయిన్ లాంటి దేశాల్లో పదిలక్షల మందిలో మరణాంతరం నలభై మంది అవయవదానం చేస్తుంటే, యునైటెట్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, స్వీడన్ తదితర దేశాలో ఇరవైఅయిదు మందివరకు ఉన్నారు. మన దేశంలో కేవలం 0.8కు మాత్రమే పరిమితమౌతున్నారు. ఇక యువకులను మోసం చేసి కిడ్నీ వ్యాపారం చేసే వారిపై చర్యలు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. దర్యాప్తు విచారణలో జరుగుతున్న జాప్యం కూడా ఇందుకు ఒక కారణంగా చెప్పచ్చు. ఇప్పటికైనా ఈ విషయంలో పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అవయవమార్పిడి వైద్యం సామాన్యులకే కాదు సన్నజనానికి కూడా అందుబాట్లోకి తేవాలి.**

దామెర్ల సాయిబాబ

ఆశయం జీవితానికి విలువ నేర్పుతుంది. ఆశ ఆట పట్టిస్తుంది. అదే ఆశ మరో అడుగు ముందుకు వేసి అత్యాశగా మారి దురాశగా రూపాంతరం చెందితే సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుంది. కష్టపడకుండా తెల్లవారేసరికి లక్ష్మీపుత్రులు కావాలనే దురాశతో కొందరు చేయరాని, చేయకూడని పనులు చేస్తున్నారు. ఈ డబ్బు సంపాదనలో మంచి, చెడు ఆలోచించడం లేదు. ఏమిచేసైనా డబ్బు సంపాదించాలనే ఆరాటం పెరిగిపోతున్నది. ఇది అది అని కాదు. ఎక్కడబడితే అక్కడ మంచి చెడులు గూర్చి పట్టించుకోకుండా డబ్బుసంపాదనే ధ్యేయంగా కొందరు చేయరాని, చేయకూడని పనులు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. మానవ అవయవాలు, జీవితాలతో వ్యాపారం చేసే దుస్సంప్రదాయానికి తెగపడుతున్నారు. ఈ డబ్బు సంపాదన ఆరాటంలో రకరకాల మార్గాలను అనుసరిస్తున్నారు. ఏకంగా ఇన్సూరెన్స్ చేయించి ఆ తర్వాత సదరు వ్యక్తిని హతమార్చి డబ్బు కాజేసే కార్యక్రమం గూర్చి వింటుంటుంటే ఆవేదన కల్గుతుంది. మనుషుల ప్రాణాలు అత్యంత కిరాతకంగా తీసి దాన్ని డబ్బుగా మార్చుకోవడం కంటే మరొక దుర్మార్గం ఉండదేమో. ఇక మానవ అవయవాల వ్యాపారం కూడా తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా చాపకింద నీరులా విస్తరిస్తున్నది. శ్రీలంక రాజధాని కొలంబో కేంద్రంగా ఈ రాకెట్ కొనసాగుతున్న విషయం గతంలో బయటపడింది. విజయవాడ ప్రాంతంలో కూడా మరొక ముఠాను పోలీసులు పట్టుకున్నారు. తాజాగా హైదరాబాద్‌లో గత నెలలో వెలుగు చూసిన కిడ్నీల వ్యాపారంలోవిస్తుపోయే విషయాలు వెలుగు చూస్తున్నాయి. కేవలం తొమ్మిది పడకలకు అనుమతులు పొందిన ఆస్పత్రిని ఏకంగా ముప్పయి పడకలతో నిర్వహిస్తూ అందులో కిడ్నీల మార్పిడి చేసే వ్యాపారం చేస్తున్నట్లు ఒక వ్యక్తి టెలిఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించడంతో జరిపిన తనిఖీల్లో బయటపడింది. తమిళనాడుకు చెందిన ఇద్దరు మహిళలను హైదరాబాద్‌కు తీసుకువచ్చి గత నెల 17న వారి నుండి కిడ్నీలు తీసి కర్ణాటకకు చెందిన మరో ఇద్దరికి అమర్చినట్లు దర్యాప్తు అధికారులుగుర్తించారు. కిడ్నీ గ్రహీతల నుండి యాభైఐదు లక్షల రూపాయల మేర వసూలు చేసి కిడ్నీదాతలకు నాలుగు లక్షలు మాత్రమే ఇచ్చినట్లు అధికారుల దర్యాప్తులో బయటపడింది. ఇలా ఈ ముఠా దాదాపు తొంభైకి పైగా కిడ్నీమార్పులు చేసినట్లు చెపుతున్నారు. అనేక రాష్ట్రాల్లో ఈ కేసులు విస్తరించి ఉండడంతో స్థానిక పోలీసుల నుండి దర్యాప్తును రాష్ట్ర సిఐడికి ప్రభుత్వం అప్పగించింది. గత ఏడాదిలో మరొక కిడ్నీ మార్పిడి వెలుగుచూసిన కేసులో అంతర్జాతీయ కిడ్నీ రాకెట్ సూత్రధారి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుడుగా కేరళ పోలీసులు గుర్తించారు. కొచ్చి విమానాశ్రయంలో పట్టుబడిన నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు ముఠా ఈ కిడ్నీ వ్యాపారంలో పాలుపంచుకోగా అందులో ఒక వైద్యుడు ఉన్నట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. అటు కర్ణాటక ఇటు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పేద యువకులను ఇరాన్‌కు తీసుకువెళ్లి అక్కడ వారి కిడ్నీలను అమ్ముతున్నారు. ముఖ్యంగా డబ్బుఅవసరం ఉన్న పేద యువకులను గుర్తించి వారికి డబ్బు ఆశచూపి, వారికి కావాల్సిన పాస్‌పోర్టు, వీసాలు దళారులే సమకూర్చి ఇరాన్‌కు తరలిస్తున్నారు. ఎవరికిడ్నీ ఏ గ్రహీతకు సరిపోతుందో మెడికల్‌గా నిర్ధారించుకొన్న తరువాత ఈ మార్పిడి కార్యక్రమం చేయిస్తున్నారు. అయితే బాధిత యువకుడు ఒకరు ఇటీవల మరణించడంతో అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కూపీలాగుతున్నారు. అంతకు ముందు హైదరాబాద్‌లో ఇలాంటి సంఘటనే చోటు చేసుకొన్నది. హైదరాబాద్‌కు చెందిన ఒక యువకుడు విశాఖపట్నం వెళుతున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పివెళ్లి శ్రీలంకలోని కొలంబోలో శవమై తేలాడు. కూపీలాగడంతో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విఫలమై ప్రాణాలు కోల్పోయినట్లు వెలుగుచూసింది. ఎందరో యువకులు దళారుల మాయలో పడి డబ్బుల ఆశలో ఈ వలలో చిక్కుకొంటున్నారు. ఈ అవయవాల మార్పిడి ఆపరేషన్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగు చూస్తున్న విషయాలు స్పష్టం చేస్తున్నాయి. మరొకపక్క కిడ్నీ వ్యాధులు ప్రబలిపోతున్నాయి. మారిన ఆహార అలవాట్లతో కిడ్నీవ్యాధి దేశవ్యాప్తంగా తెలుగురాష్ట్రాల్లో బాగా పెరిగిపోయింది. వ్యవసాయ రంగంలో పెరుగుతున్న క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువులు,ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీనికితోడు వాతావరణ కాలుష్యం, జీవన విధానంలో మార్పులు కారణంగా మూత్రపిండాలు, కాలేయ వ్యాధులు విస్తరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా కోటి మందికిపైగా మూత్రపిండాలకు సంబంధించిన దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో కొట్టుమిట్లాడుతున్నారు. దాదాపు పదిలక్షల వరకు మూత్రపిండాలు మార్పిడి చికిత్సచేయాల్సిన అవసరం ఉందంటున్నారు. అవసరం మేరకు మూత్రపిండాలు ఇచ్చే దాతలు ముందుకు రావడంలేదు. ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే దాదాపు లక్షన్నర మందికిపైగా మూత్రపిండాలు పనిచేయక డయాలిసిస్‌తో జీవనం సాగిస్తున్నారు. వీరికిమార్పిడి చికిత్స ఒక్కటేపరిష్కారం. అయితే ఇందుకు యాభైలక్షల రూపాయల వరకు వ్యయంచేయాల్సి ఉంటుంది. నిరుపేదలుఅంతటి ఖర్చును పెట్టుకునే పరిస్థితుల్లో లేరు. మరొకపక్క ప్రభుత్వం నుండి ఈవిషయంలో పెద్దగా శ్రద్ధ కన్పించడంలేదు. ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయి కోమాలో ఉన్న వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించి 'జీవన్‌ధార్' పథకంకింద ముందుగా నమోదు చేయించు కున్న వారికి సీనియార్టీ బట్టి మార్పిడి చికిత్సచేస్తున్నారు. అయితే ఏళ్లతరబడి ఎదురు చూసి తమ టర్మ్ వచ్చేలోపలే అసువులు బాసినవారెందరో ఉన్నారు. తెలంగాణలో అవ యవ మార్పిడికి నలభైఒక్క ఆస్పత్రులకే అనుమతులున్నా యి. దాదాపు 15 వేల 7 వందల మందికి పైగా జీవన్ ధార్ ట్రస్టులో రిజిస్టర్ చేసుకొని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. ఇప్పటికీ పరిస్థితుల్లో మార్పు వచ్చినట్టు కన్పించడం లేదు. తెలంగాణలో, అటు ఆంధ్రప్ర దేశ్‌లో డయాలసిస్ చేయించుకునే ఆర్థిక స్తోమత లేక మం చానికే పరిమితమై రోజురోజుకూ కృంగి కృశించి అసువులు బాస్తున్న వేలాది కుటుంబాల వేదన వర్ణనాతీతంగా ఉంది. నరకయాతను అనుభవిస్తూ యమలోకానికి పయనం కడుతుంటే ఏమీ చేయలేని నిస్సహాయకస్థితిలో ఉన్న కుటుంబ సభ్యులు పడుతున్న వేదన వర్ణనాతీతం. తెలంగాణలో గత ప్రభుత్వం ఈ డయాలసిస్ సెంటర్లు పెంచి పేదలకు ఉచితంగా చికిత్సఅందించే ఏర్పాటుచేసింది. అవి అవసరం మేరకు కిడ్నీ బాధితులందరికీ సరిపడేస్థాయిలో, అందుబాటులో లేవనే చెప్పచ్చు. పాలకులు ఈ విషయంలో శ్రద్ధ తీసుకొని అటు కిడ్నీల వ్యాపారానికి ఫుల్‌స్టాప్ పెట్టించడ మేకాక ఇటు ప్రభు త్వపరంగా చర్యలు తీసుకొని మార్పిడి చికిత్స సామాన్యులకు అందుబాటులోకి వచ్చేలా చేయాల్సి న అవసరంఉంది. అన్నింటి కంటే ముఖ్యంగా అవయవదా నం గూర్చి ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. అమెరికా, స్పెయిన్ లాంటి దేశాల్లో పదిలక్షల మంది లో మరణాంతరం నలభైమంది అవయవదానం చేస్తుంటే, యునైటెట్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, స్వీడన్ తదితరదేశాలో ఇరవైఅయిదు మందివరకు ఉన్నారు. మన దేశంలో కేవలం 0.8కు మాత్రమే పరిమితమౌతున్నారు. ఇక యువకులను మోసంచేసి కిడ్నీ వ్యాపారం చేసే వారిపై చర్యలు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. దర్యాప్తు విచారణలో జరుగుతున్న జాప్యం కూడా ఇందుకు ఒకకారణంగా చెప్పచ్చు. ఇప్పటికైనా ఈ విషయంలో పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసు కొని అవయవమార్పిడి వైద్యం సామాన్యులకే కాదు సన్నజనానికి కూడా అందుబాట్లోకి తేవాలి. •

ఒక్క మాట

# విమాన ప్రయాణాలు ఎంత వరకు సురక్షితం!

బి.మధుసూదన్‌రెడ్డి

దక్షిణ కొరియాలో గత ఆదివారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో ఏకంగా 179మంది దుర్మరణం పాలవడం వింటేనే విమాన ప్రయాణం అంటే వణుకు పుట్టేస్తున్నది. 175 మంది ప్రయాణికులతో పాటు ఆరుగురు సిబ్బందితో కూడిన విమానం థాయిలాండ్ నుంచి సియోల్‌కు 290 కిమీ దూరంలోఉన్న ముయాన్‌కు బయలుదేరి జెజు ఎయిర్‌కు చెందిన బోయింగ్ జెట్ విమానం దిగుతుండగా కుప్పకూలిపోయి రక్షణ గోడను ఢీకొని ముక్కలైపోయి 179 మందిని పొట్టన పెట్టుకుంది. ఇద్దరు సిబ్బంది మాత్రమే గాయాలతో బయట పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా 2024లో జరిగిన అత్యంత ఘోర విమాన ప్రమాదంగా దీనిని గుర్తిస్తున్నారు. అదే విధంగా ప్రపంచ క్రిస్టియన్లు బాక్సింగ్ డే వేడుకల్లో మునిగిన వేళ అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 25 డిసెంబర్‌న కజకిస్థాన్‌లో కూలిపోవడంతో 38 ప్రాణాలు కోల్పోవడం, 29 మంది గాయాలతోబయటపడడం కూడా మనల్ని కలిచి వేసిన ప్రమాదంగా మన మనసుల్లో నమోదు అయింది. ఈ విమానాన్ని రష్యా మిలిటరీ కూల్చి వేసిందనే ఆరోపణ కూడా వినవలసిరావడం విచారకరం. తరుచుగా జరుగుతున్న వాణిజ్యపరమైన విమాన ప్రమాదాలు ప్రపంచ ప్రయాణికుల గుండెల్లో వణుకును పుట్టిస్తున్నాయి. ఏవియేషన్ వర్గాల అధ్యయనాల ప్రకారం 53 శాతం విమాన ప్రమాదాలు మానవ తప్పిదాలతో, 21 శాతం మెకానికల్ వైఫల్యాలతో, 11శాతం ప్రతికూల వాతావరణాల వల్ల జరుగుతున్నట్లు తేలింది. అయినప్పటికీరోడ్డు, రైలు ప్రయాణాలతో పోల్చితే విమాన ప్రమాదాలు చాలా తక్కువగా నమోదు అవుతున్నట్లు వివరిస్తున్నారు. 2018 22 మధ్య సమయంలో ప్రపంచవ్యాప్తంగా 13.7 మిలియన్ల విమానయాన ప్రయాణీకుల్లో ఒక్క ప్రయాణీకుడు మాత్రమే ప్రమాదంలో ప్రాణం కోల్పోయినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. అదే విధంగా 16 మిలియన్ల వాణిజ్య విమానాల్లో ఒక్కటి మాత్రమే ప్రమాదానికి గురి అవుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 2024లో ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమైన వాణిజ్యపరమైన విమాన ప్రమాదాలు 20 వరకు జరుగగా, అందులో 400 వరకు ప్రయాణీకులు మరణించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2024లో రష్యా మిలటరీ విమాన కూల్చివేతలో 74 మంది, బ్రెజిల్ ప్రమాదంలో 62మంది, కాట్మండు ప్రమాదంలో 18మంది, రష్యా విమానప్రమాదంలో 15మంది, లుతువానియా విమాన ప్రమాదంలో నలుగురు ప్రయాణీకులు/సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. భారత్‌లో మాత్రమే ఒక్క ఏడాది 2022లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.69 లక్షల మంది ప్రాణాలు వదిలారు. 2023లో సగటున రోజుకు 474మంది ప్రజలు మరణిస్తున్న విషయం మరువరాదు. 2014- 23 మధ్య కేవలం భారత్‌లో జరిగిన 638 రైలుప్రమాదాల్లో 2,453 మంది మృతి చెందినట్లు తెలుస్తున్నది. విమాన ప్రయాణాల భద్రతకు విమాన పైలెట్‌సిబ్బంది, విమాన ఇంజన్ కండీషన్,సిబ్బందికి అందించే శిక్షణలాంటిఅంశాలు సంబంధాన్ని కలిగి ఉంటాయి. విమాన ప్రమాదాలకు కొంతవరకు పక్షులు ఢీకోవడం కూడా మరోకారణంగా గుర్తించబడింది. ఇప్పటికైనా విమానయానాలు పరలోక ప్రయాణాలు కాకుండా వారిని సురక్షితంగా తమ తమ గమ్యస్థానాలకు చేర్చాలని, మానవ తప్పిదాలను పూర్తిగా తప్పించాలని ఆశిద్దాం. •

# గాజాపై అమెరికా అధ్యక్షుని ప్రభావం

ఎం కె కుమార్

ట్రంప్ గాజాపై అమెరికా యాజమాన్యాన్ని ప్రస్తావిస్తూ, 'మేము దానిని సొంతం చేసుకుంటాం, అభివృద్ధి చేస్తాం, వేలాది ఉద్యోగాలు కల్పిస్తాము" అంటూ గాజాను ఒక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా చూపే ప్రయత్నం చేశారు. గతంలో కూడా ట్రంప్ "జస్ట్ క్లీన్ అవుట్" అంటూ పాలస్తీనా ప్రజలను జోర్డాన్, ఈజిప్టుకు బలవంతంగా తరలించాలనే సూచన చేశారు. ఇది 1948 జెనీవా కన్వెన్షన్ ప్రకారం జాతిహత్య ఉద్దేశం కింద పరిగణించబడుతుంది. అంతేకాదు, ఇజ్రాయెల్ జరుపుతున్న యుద్ధ నేరాలను విమర్శించే ఐక్యరాజ్యసమితి, మానవ హక్కుల మండలి, పాలస్తీనా ప్రజలకు సహాయపడే యుఎన్ ఏజెన్సీలకు మద్దతును కూడా ట్రంప్ ఉపసంహరించుకున్నారు. ఇజ్రాయెల్‌ను తక్షణంగా ఆపాల్సిన అవసరం ఉన్న సమయంలో, ట్రంప్ ప్రభుత్వం 2000 పౌండ్ల బాంబుల సరఫరాను కొనసాగించింది. ఇది గాజా, వెస్ట్‌బ్యాంక్, లెబనాన్, సిరియాలో ఇజ్రాయెల్ హింసను మరింత పెంచడానికి దోహదపడింది. ట్రంప్ చేసిన ప్రకటనలు గాజా ప్రజలను పూర్తిగా తరిమేయాలని ఉద్దేశించినట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాలస్తీనాప్రజలు, ప్రతిఘటన వర్గాలు ట్రంప్ మాటలను ఖండించాయి. ప్రపంచ మంతా గాజాను జియోనిస్ట్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రదేశంగా చూస్తున్నది. ట్రంప్ మాత్రం దానిని మరణం, విధ్వంసంగా పేర్కొన్నారు. ట్రంప్ నిజంగా గాజాపై అమెరికా దండయాత్రకు ప్రణాళిక వేస్తున్నాడా? లేక ఇది కేవలం రాజకీయ ఆడంబరమా? కాలమే సమాధానం చెప్పాలి. ట్రంప్ తనను యుద్ధాలను ముగించే నేతగా ప్రస్తావించుకున్నాడు. ఆయన చర్యలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని24 గంటల్లో ముగిస్తానని చెప్పినా, అది సాధ్యపడలేదు. గాజా కాల్పుల విరమణ కూడా మిగిలిపోలేదు. ఇప్పుడు ఆయన గాజా జనాభాపై జాతి ప్రక్షాళనకు మద్దతుగా మాట్లాడటం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు గురైంది. ట్రంప్ ప్రవేశపెట్టిన అబ్రహం ఒప్పందాలు ప్రణాళిక, పాలస్తీనా స్వేచ్ఛా ఉద్యమాన్ని అణిచివేయడానికి రూపొందించబడింది. ఆయన అల్లుడు జారెడ్ కుష్నర్ ముందుకు తెచ్చిన ఈ ప్రణాళికను బిడెన్‌హారిస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. దీని ద్వారాఈజిప్ట్, జోర్డాన్, మొరాకో, యుఎఇ, సూడాన్ దేశాలను ఇజ్రాయెల్‌తో ఒప్పందాలు చేసుకునేందుకు ఒత్తిడి చేశారు. ఇప్పుడు సౌదీ అరేబియా కూడా ఒప్పందంలో చేరాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ ఒప్పందాల అసలు ఉద్దేశ్యం పాలస్తీనా, హిజ్బుల్లా, ఇరాక్, ఇరాన్, యెమెన్ వంటి ఖియాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్ అనే దేశాలు, సంస్థలను అణగదొక్కడమే. అక్టోబర్ 7న గాజాలో తిరుగుబాటు, జైలు విచ్ఛిన్నం, విధ్వంసం జరిగింది. దీని తర్వాత, ఈ ఒప్పందాలను సమర్థించడం అరబ్ దేశాలకు కూడా కష్టంగా మారింది. ట్రంప్ యుద్ధాలకు వ్యతిరేకి కాదు. ఆయన చర్యలు గాజా ప్రజల పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఇజ్రాయెల్ జియోనిస్ట్ లాబీ, వైట్‌హౌస్, అమెరికా పాలనపై ఎంత ప్రభావం కలిగిఉందో ప్రపంచం చూస్తోంది. అత్యంత ప్రజాదరణ లేని నాయకుడైన ట్రంప్, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) అరెస్ట్ వారెంట్ ఉన్న నెతన్యాహును వైట్‌హౌస్‌కు ఆహ్వానించాడు. దీనివల్ల ఆయన "అమెరికా ఫస్ట్" అనే నినాదం వెనుక "ఇజ్రాయెల్ ఫస్ట్" వుంది కదా? అనే ప్రశ్న ఉత్పన్నమయింది. అమెరికా ఆధిపత్యం తగ్గి



పోతున్న ఈ పరిస్థితిలో, ట్రంప్ తన యుద్ధాలు, ఆంక్షలు, బెదిరింపులు ఇకపై పని చేయవని గ్రహించాలి. జి7దేశాలకు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్ ఆవిర్భావం ప్రపంచ శక్తి సమతుల్యతను మార్చేస్తోంది. ఇజ్రాయెల్ వద్ద ఆధునిక ఆయుధాలు,బలమైన మద్దతుఉన్నప్పటికీ, గాజాలో విజయం సాధించలేకపోయింది. కాల్పుల విరమణ ఒప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. హమాస్‌ను ఓడించలేకపోయింది. బందీ లను విడిపించలేకపోయింది. తన స్వంత ప్రజల దగ్గరే ఓడిపోయిన నెతన్యాహు, యుద్ధ నేరాలకు బాధ్యుడయ్యాడు. అన్ని హింసల మధ్య పాలస్తీనా ప్రజలు లొంగిపోవడానికి నిరాకరించారు. ఇజ్రాయెల్ అమెరికా యుద్ధ యంత్రాన్ని ఎదుర్కొంటూ, తమ హక్కులకోసం పోరాటం కొనసాగిస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం గాజాలో కాల్పుల విరమణకు అంగీకరించడంపై అనేక చర్చలు జరిగాయి. దీనికి ప్రధాన కారణాలు,విస్తరించిన ఇజ్రాయెల్ సాయుధ దళాలకు విరామం అవసరం. అమెరికా కొత్త అధ్యక్షుడి ఒత్తిడి, తక్కువ హింసాత్మక విధానాలను అనుసరించాలనే వ్యూహం వుంది. ట్రంప్ నెతన్యాహును ఏ విధంగా ఒప్పించి ఉంటారనే ప్రశ్నకు ఒక అంచనా ఉంది. ఆయన అమెరికా వ్యూహాన్ని అనుసరించాలి. అదే సమయంలో యుద్ధాలను తగ్గిస్తూ ప్రపంచ ఆధిపత్యాన్ని కొనసాగించాలని సూచించి ఉండవచ్చు. నెతన్యాహు కూడా ఇది తన సైన్యానికి విశ్రాంతి కల్పించడానికి, బందీల విడుదల ద్వారా దేశీయ ఒత్తిడిని తగ్గించడానికి ఉపయోగపడుతుందని భావించవచ్చు. అంతర్జాతీయంగా ఒక సానుకూలత సృష్టించడానికి ఉపయోగపడుతుందని అంగీకరించవచ్చు. ట్రంప్ నెతన్యాహును ఏమని ఒప్పించి ఉంటారనే ప్రశ్నకు ఒక అంచనా ఇది. అమెరికా వ్యూహాన్ని మార్చే ప్రయత్నంలో భాగంగా, ప్రపంచ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు యుద్ధాన్ని పూర్తిగా నిలి పివేయకుండానే మరొక మార్గాన్ని అన్వేషించమని సూచించి ఉండవచ్చు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ పాలస్తీనియన్లను ఈజిప్ట్, జోర్డాన్‌లో పునరావాసం కల్పించాలని ప్రతిపాదించారు. అయితే, ఈ నిర్ణయాన్ని పాలస్తీనియన్లు, ఈజిప్ట్, జోర్డాన్‌తోపాటు ఇతర అరబ్‌దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ట్రంప్ గాజాలో అమెరికా ప్రత్యక్ష పాత్ర ఉండొచ్చని కూడా పేర్కొన్నారు. అయితే, ఈ తరలింపు వ్యూహం విఫలమయ్యేలా కనిపిస్తోంది. ఎందుకంటే అన్ని అరబ్ దేశాలు దీనికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలిచాయి. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, యుద్ధంకాకుండా అమెరికా, ఇజ్రాయెల్ తమ లక్ష్యాలను ఎలా సాధిస్తాయి? శాంతియుత మార్గాలు పనిచేయకపోతే, మళ్లీదాడులకు, యుద్ధానికి మారుతారా? ఈ అస్పష్టత కారణంగా గాజా ప్రజలు, శాంతిని కోరుకునే ప్రపంచం ఆందోళనతో ఎదురుచూస్తోంది. అధ్య క్షుడు ట్రంప్ యుద్ధం కాకుండా ఆధిపత్యాన్ని సాధించాలనే లక్ష్యంతో ఉన్నాడు. ఈ వ్యూహంలో ప్రధానంగా రెండు భాగాలు ఉన్నాయి. పొరుగు ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడం. ఇందులో గ్రీన్‌ల్యాండ్ లేదా కెనడా వంటి ప్రాంతాలను స్వాధీనం చేసుకోవాలని టార్గెట్ ఉంది. ఇది అమెరికాకు సహజ వనరులను పెంచుతుంది. రష్యా, చైనాలపై వ్యూహాత్మక క్షేత్రం ఏర్పడటానికి దోహదపడుతుంది. వ్యూ హాత్మకలోతును పెంచడం. అమెరికా, ఆర్కిటిక్ ప్రాంతంపై నియంత్రణ పెంచుకోవడం ద్వారా మరింత ప్రభావవంతంగా మారుతుంది. అలాగే యూరోపియన్ దేశాలకు సమీపంగా కొత్త గ్రీన్‌ల్యాండ్ సరిహద్దు ఏర్పడుతుంది. ఈ వ్యూహం వాస్తవంగా యుద్ధం లేకుండా అమెరికాకు విజయాన్నిసాధించడంలో సహాయపడుతుంది. అలాగే కొన్ని విధ్వంసకర యుద్ధాలను నివారించడంలో దోహదం అవుతుందని ఊహించవచ్చు. ఈవ్యూహారచన గతంలో జరిగిందే. అమెరికా, అంతరిక్ష లేదా వైమానిక యుద్ధంవైపు అడుగులు వేయాలని సూచిస్తుంది. ట్రంప్ వంటి నాయకులు తమ అధికారాన్ని సాధించడానికి చేసే వ్యూహాలు చాలా దేశాలకు ఇబ్బందులను కలిగిస్తాయి. •

# కేజ్రీవాల్ ఆరోపణలపై విచారణకు ఎల్జీ ఆదేశం

### ఆప్ అధినేత ఆరోపణలను ఖండించిన బిజెపి




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి తమ అభ్యర్థులను కొట్టుకుపోయేందుకు కుట్రలు చేసిందని మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ విచారణకు అనుమతించారు. ఓట్లలెక్కింపు ఈనెల 8వ తేదీ జరుగుతున్న దున ఇప్పటి నుంచే అభ్యర్థులను కొనుగోలు చేసేందుకు బిజెపి సిద్ధం అవుతోందని కేజ్రీవాల్ ఆరోపించారు.అయితే ఈ వ్యాఖ్యలు బిజెపి ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని, ఎన్నికల ఫలితాలను సైతం దిగజార్చేవిధంగా కేజ్రీవాల్ వ్యాఖ్యలు చేస్తున్నారని బిజెపి ఆరోపించింది. ఇదిలా ఉంటే లెఫ్టినెంట్‌గవర్నర్ వికె సక్సేనా ఈ ఆరోపణలపై వాస్తవాలు వెలికితీయాలంటూ విచారణకు ఆదేశించారు. ఢిల్లీ ఎసిబి అధికారులు కేజ్రీవాల్‌ను ప్రశ్నించేందుకు ఆయన ఉంటున్న సివిల్‌లైన్స్ నివాసానికి వెళ్లారు. అయితే ముందు లాంఛనంగా కేసు నమోదు చేయాలని ఎసిబి భావిస్తోంది. ఎసిబి చర్యలు తీసుకోవాల్సిందిపోయి ఎందుకు డ్రామాలు చేస్తోందని ఆప్ ఎంపి సంజయ్‌సింగ్ ప్రశ్నించారు. విచారణలో మొత్తం వాస్తవాలు వెలుగులోకి వస్తాయి కదా అని ఆయన పేర్కొన్నారు. మాజీ సీఎం ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్‌కేజ్రీవాల్ తన సోషల్‌మీడియా పోస్టులో మొత్తం 16మంది ఆప్ అభ్యర్థులకు బిజెపినుంచి ఆఫర్లు వచ్చాయని, వారికి మంత్రి పదవులివ్వడంతోపాటు ఒక్కొక్కరికీ రూ.15 కోట్లు ఇస్తామని ఆఫర్లు ఇస్తున్నారని కేజ్రీవాల్ విమర్శించారు. కొన్ని సర్వేసంస్థలు బిజెపికి 55 సీట్లు వస్తాయని ముందునుంచే చెపుతోందని, గడచిన రెండగు గంటల్లోనే 16 మంది తమ అభ్యర్థులకు ఈ ఆఫర్లు వచ్చాయని ఆయన చెప్పారు. ఎగ్జిట్‌పోల్స్ సర్వేల వివరాల వాస్తవికతను కేజ్రీవాల్ ప్రశ్నించారు. వారికి నిజంగా 55 సీట్లే వస్తుంటే మావాళ్లకు ఆఫర్లు ఎందుకు ఇస్తున్నారని కేజ్రీవాల్ ప్రశ్నించారు. దీన్నిబట్టే ఇవన్నీ బోగస్ సర్వేలని తెలిసిపోతున్నదని అన్నారు.

ఆప్ అభ్యర్థులను చీల్చేందుకు బిజెపి మైండ్‌గేమ్ ఆడుతోందన్నారు.అయితే ఏ ఒక్కరు కూడా అటువైపు వెళ్లబోరని కేజ్రీవాల్ అన్నారు. ఆప్ సీఎం అభ్యర్థి కల్కాజీనుంచి పోటీ చేసిన అతిశీ మాట్లాడుతూ వారికి మెజార్టీ సీట్లు వస్తేమా అభ్యర్థులకు ఎందుకు ఆఫర్లు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఢిల్లీలో ఎగ్జిట్‌పోల్స్ అన్నీ కూడా బిజెపికే విజయం అని చెపుతూ ఆప్ అభ్యర్థులను నిస్తేజపరిచే కుట్రలుచేసారని ఇదంతా బిజెపి కుట్రల్లో భాగమేనని అన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఈఆరోపణపై సమగ్ర విచారణ జరగాలని భావిస్తున్నారు, ఎసిబి ఈ ఆరోపణల్లో నిజమెంతుందో వెలికితీయాలని ఎల్‌జివికె సక్సేనా కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

70 సీట్ల అసెంబ్లీ ఎన్నికలకుగాను ఓట్లలెక్కింపు ఈనెల 8వ తేదీన జరుగుతుంది. అదేరోజు ఫలితాలు కూడా వెల్లడి అవుతాయి.



# 25 బేసిస్‌పాయింట్లు తగ్గించిన ఆర్బీఐ

### రెపోరేట్లు తగ్గితేనే వ్యవస్థలోకి మరింత నగదు

### ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**ముంబయి, ఫిబ్రవరి 7:** భారతీయ రిజర్వుబ్యాంకు రెపోరేట్లను ఈ ఏడాది తొలిసారి సవరించింది. మానిటరీ పాలసీ కమిటీ సమీక్షల్లో ఏకగ్రీవంగా 25 బేసిస్ పాయింట్లు తగ్గించాలని నిర్ణయం వారు. 6.5నుంచి 6.25శాతానికి కుదించినట్లు గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్ట మొదటిసారి నిర్వహించిన సమీక్ష అనంతరం రెపోరేట్ల వివరాలను ప్రకటించారు. ఆర్‌బిఐ సభ్యులతోపాటు ముగ్గురు బయటిప్రముఖులు, ఏకగ్రీవంగా రెపోరేట్లను తగ్గించాలని అభిప్రాయం వ్యక్తం చేసారన్నారు. 2020 మే సమీక్ష కాలంనుంచి ఇప్పటివరకూ 11 సమీక్ష సమావేశాలు జరిగినా రెపోరేట్ల జోలికి వెళ్లలేదు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మందగమనం ఆర్థికపరమైన వ్యవస్థలపై ప్రభావం చూపిస్తున్నదని అందువల్లనే వృద్ధి కూడా చరిత్రాత్మక సగటునుంచి తగ్గుతున్నదన్నారు. అయితే క్రమేపీ ప్రపంచ ఆర్థికవ్యవస్థ ఊపందుకుంటున్నదని మరింత పటిష్టపడుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేసారు. వడ్డీరేట్ల కుదింపులో అమెరికా బాండ్ల రాబడులు కూడా ఒక్కసారిగాపెరిగాయి. అలాగే డాలర్‌కరెన్సీ కూడా పెరిగింది. జిడిపి వృద్ధిరేటు ఆర్థిక సంవత్సరంలో 6.4శాతంగా ఉంటుంది. రానున్న ఆర్థిక సంవత్సరంలో వాస్తవ వృద్ధి 6.7శాతంగాఉంటుందని, మొదటి త్రైమాసికంలో ఏడుశాతం, రెండోత్రైమాసికంలో 6.5శాతం, నాలుగోత్రై మాసికంలో 6.5శాతం గా ఉంటుందని ఆర్‌బిఐ వెల్లడించింది. ఇక రిటైల్ ద్రవ్యోల్బణం కూడా 48 శాతంగా ఉంటుందని గత త్రైమాసికంలో 4.4శాతంగా ఉందని మల్హోత్రా పేర్కొన్నారు. బ్యాంకులనుంచి నగదు లభ్యత పటిష్టంగానే ఉందని వ్యవస్థలోకి మరింత నగదును చొప్పించేందుకు అవసరమైన చర్యలు కూడా అమలువుతాయన్నారు. స్థిరాస్తులపై రాబడులు, ఈక్విటీలుకూడా బ్యాంకులకు మంచి ఫలితాలిస్తున్నట్లు ఆయన చెప్పారు. అయితే డిజిటల్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.అన్నిరంగాలకు సంబంధించిన వారు కూడా కఠిన చర్యలకు ఉపక్రమించాలని బ్యాంకులు కూడా వీటిని కట్టడిచేసే కార్యాచరణ మరింతవేగంగా అమలుచేయాలని సూచించారు.

# దేశాన్ని అస్థిరపరిచేందుకు విచ్ఛిన్నకర శక్తుల కుట్రలు



### ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** దేశంలో కొన్ని విచ్ఛిన్నకరశక్తులు భారత్‌ను అస్థిరపరిచే కుట్రలుచేస్తున్నాయని దేశప్రజలు అప్రమత్తంగా ఉండి తిప్పికొట్టాలని ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్ హెచ్చరించారు. వాతావరణ మార్పులకంటే ఈ శక్తులనుంచి మరింత తీవ్రస్థాయి ముప్పు ఎదురవుతుందని కొందరు వ్యక్తులు ఈ తరహా వ్యవహారశైలితో కొనసాగుతున్నారన్నారు. మరికొందరయితే ఏకంగా ప్రజల్లోనే చీలికలు తెచ్చి వేర్పాటు వాద సిద్ధాంతాలను చొప్పిస్తున్నారని, కులం, మతం, ప్రాంతం ఆధారంగా విచ్ఛిన్నకర శక్తులు కీలకపాత్రలు పోషిస్తున్నారన్నారు. ప్రాంతీయతత్వం, జాతీయ వాదంలు రెండూ సమాంతరంగా వెళుతున్నాయని తరిచితరిచి చూస్తే జాతి వ్యతిరేకశక్తుల కుట్రలే ఇవన్నీ అని తెలుస్తుందన్నారు. కర్ణాటక సాహిత్య సంస్కృతిక వైభవ వేడుకల సభలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ ఈ జాతివ్యతిరేకశక్తులు విభిన్న మార్గాల్లో ఎదురవుతుంటారని, కొత్తకొత్త మార్గాలతో, అనేక అంశాలను చీలిక వాదానికి మూలంగా ఎంపికచేసుకని ప్రజల్లోకి చొప్పిస్తారని హెచ్చరించారు. దేశం సాంస్కృతిక వారసత్వ సంపదను మనమే పరిరక్షించుకోవాలని ఉపరాష్ట్రపతి అన్నారు. భారత దేశ అభివృద్ధి ఇపుడు ప్రపంచ దేశాలకు సైతం కనిపిస్తోందని, దేశ ప్రజలు ఈ అభివృద్ధి ఫలాలు అందుకుంటున్న దశలో విచ్ఛిన్నకర శక్తులు, వేర్పాటువాద శక్తులను గుర్తించి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. భారత ఆర్థిక ప్రగతిపై మాట్లాడుతూ ప్రపంచ ఆర్థికసంస్థలు ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఇతర సంస్థలన్నీ కూడా భారత్ ను పెట్టుబడులకు సానుకూల గమ్యస్థానంగా చూస్తున్నాయని అన్నారు. ప్రపంచస్థాయి పెట్టుబడులకు ఇపుడు భారత్ హబ్‌గా నిలవడం మన కెంతో గర్వకారణమని అన్నారు.




# లిఖిత పూర్వకంగానే జవాబిస్తాం

### కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్

**ముంబయి, ఫిబ్రవరి 7:** మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో అవకతవకలు చోటుచేసుకున్నాయంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీచేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. రాజకీయ పార్టీలు లేవనెత్తిన ప్రశ్నలను, సూచనలను తాము గౌరవిస్తున్నామని త్వరలోనే లిఖితపూర్వకంగా స్పందిస్తామని పేర్కొంది. మహారాష్ట్ర ఓటర్లకు సంబంధించి పూర్తి వాస్తవాలు విధానపరమైన అంశాలతోనే కమిషన్ సమాధానం ఇస్తుందని వివరించింది. కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ప్రతిపక్షాలకు చెందినపార్టీలు ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకుని ఓటర్ల సంఖ్యపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. అట్టడుగు వర్గాలకు చెందిన ఎందరో ప్రజల ఓట్లను ఓటర్ల జాబితాలనుంచి తొలగించారని, కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లు ఉన్నా అక్కడి ఓటర్లను మరో కేంద్రానికి మార్చారని ఆరోపించారు. ఈక్రమంలో మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలు తమకు ఇవ్వాలని ఈసీని కోరామని, దీనిద్వారా కొత్తగాచేరిన ఓటర్లు ఎవరనేది కచ్చితంగా తెలుస్తుందని తెలిపారు. అలాగే ఎంతమంది ఓటర్లను తొలగించారో ఒక బూత్‌నుంచి మరొక బూత్‌కు ఎందుకు బదిలీచేసారో కూడా తెలుస్తుందని పేర్కొన్నారు. అయితే ఈ విషయమై ఈసీనుచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా లేదు కనకనే ఓటర్ల జాబితాను తమకు ఇచ్చేందుకు ఎన్నికల సంఘం ఆసక్తిచూపించడంలేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిపై స్పందించిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ తాము లిఖిత పూర్వకంగానే సమాధానం ఇస్తామని ఇందులో వాస్తవాలను దాచే ప్రసక్తేలేదన్నారు.

# రెపోరేట్ల ప్రభావంలేని సెన్సెక్స్ నిఫ్టీ

### కీలక కంపెనీల షేర్లన్నీ దిగువన ట్రేడింగ్



**ముంబయి, ఫిబ్రవరి 7:**రెపోరేట్లను తగ్గిస్తూ ఆర్బీఐ ప్రకటించిన ఎంపిసి సమీక్ష నిర్ణయాలు ట్రేడర్లను సంతృప్తిపరచలేదు. నిఫ్టీ, సెన్సెక్స్ రెండూ కూడా దిగువప్రాంతంలోనే ట్రేడింగ్‌ముగించాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపించడంతో విదేశీ నిధులు అధికశాతం విత్‌డ్రా అయ్యాయి. వరుసగా మూడోరోజు కూడా ఈక్విటీలు తగ్గుముఖం పట్టాయి. 30షేర్ బిఎస్‌ఇ బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 197.97 పాయింట్లు క్షీణించి 77,860.19పాయింట్ల వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ఆసాంతం అనిశ్చితంగానే కొనసాగింది. ఈ రోజు ట్రేడింగ్‌లోసుమారు 0.74శాతం క్షీణించి 77,475.4పాయింట్లకు సైతం ఒకదశలోచేరింది. ఇక ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ కూడా 43.40 పాయింట్లు క్షీణించి 23,559.95 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగించింది. ఐటిసి తన త్రైమాసిక ఫలితాల్లో తగ్గుదల నమోదుచేయడంతో రెండుశాతం షేర్లు క్షీణించాయి. నికరలాభం 5013.16క ఓట్లుగా కంపెనీ ప్రకటించింది. ఎస్‌బిఐ, ఆదాని పోర్ట్స్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఐసిఐసిఐబ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, పవర్‌గ్రిడ్‌లు కూడా ట్రేడింగ్‌లో వెనకబడ్డాయి. ఆర్‌బిఐ వడ్డీరేట్లకుదింపు మార్కెట్లకు ఎలాంటి ఊతం ఇవ్వలేదు. ఆర్‌బిఐ గవర్నర్ వ్యాఖ్యల్లో ఎలాంటి కొత్త అంశం లేదని భావించారు. బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్‌ఎంసిజి, ఇంధనరంగ స్టాక్‌లన్నీ కూడా ట్రేడింగ్‌లో వెనకబడ్డాయి. వీటికితోడు ఒక్కొక్కటిగా వస్తున్న ఆర్థిక ఫలితాలు కూడా మరి కొంత ప్రభావితం చేస్తున్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించినట్లు మెమతా ఈక్విటీస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే అన్నారు. టాటాస్టీల్‌మాత్రం 4శాతం పెరిగింది. భారతి ఎయిర్‌టెల్ స్టాక్ నాలుగుశాతంపెరిగింది. ఐదురెట్లు నికరలాభం పెరిగి 16,134.6 కోట్లకుచేరింది. ఇండస్ టవర్స్ బిజినెస్ జోరందుకోవడం, ట్యారిఫ్ పెంపు వంటివికూడా కొంత షేర్లకు ఊతం ఇచ్చాయి. జొమాటో, వమీంద్ర, అల్ట్రాటెక్ సిమెంట్; టెక్‌మహీంద్రాలు కూడా లాభాల్లోనే ముగిసాయి. వడ్డీరేట్ల ఆధారిత రంగాలయిన ఆటోమొబైల్ స్టాక్స్‌కూడా లాభనష్టాలులేని దశలోముగిసాయి. ఆర్‌బిఐ రేట్లవల్ల ఆటో, హోం లోన్లు కొంతమేర వడ్డీరేట్లు తగ్గవచ్చని బ్యాంకింగ్ రంగ నిపుణులు చెపుతున్నారు. రెపోరేట్లు ఎక్కువ ఉంటే డిపాజిట్లపై రిటర్నులు పెరుగుతాయి. పొదుపు, ఇన్వెస్ట్‌మెంట్ ఉత్పత్తుల రెపోరేట్లను ఇవి నిర్ణయిస్తాయి. రెపోరేట్లు తగ్గితే వడ్డీ ఆధారిత రంగాల్లో రిటర్నులు కూడా తగ్గుతాయి. ఆసియా మార్కెట్ల పరంగా దక్షిణకొరియా, జపాన్ మార్కెట్లు దిగువన ముగిస్తే షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు సానుకూలంగానే ముగిసాయి. ఇక యూరో పియన్ మార్కెట్లు కూడా దిగువస్థాయిలోనే ముగిసాయి. అమెరికా మార్కెట్లు మాత్రం ముం దురోజు భారీగాపెరిగాయి. బ్రెంట్ ముడిచమురు 0.73శాతంపెరిగి బ్యారెల్‌కు 74.83డాలర్లుగా కొనసాగింది. మార్కెట్లనుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు 3549.95 కోట్ల విలువైన షేర్లను విక్రయించి లాభాల స్వీకరణ బాటపట్టారు.

# అమెరికా తుదిజాబితాలో 487 మంది భారతీయులు



**వాషింగ్టన్, ఫిబ్రవరి 7:** అక్రమ వలసదారులను తరలింపు ప్రక్రియను ముమ్మరంచేసిన అమెరికా 104 మంది భారతీయులను వెనక్కి పంపించిన తర్వాత అమెరికా బహిష్కరించిన తుది జాబితాలో మరో 487 మంది భారతీయులు ఉన్నారని విదేశాంగశాఖ ప్రకటించింది. అమెరికా ప్రభుత్వం భారత్‌కు తెలియజేసిందని వెల్లడించింది. వలసదారులకు సంకెళ్లు వేసి తరలిస్తున్నారని వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ వీటికి సంబందించి అమెరికా వద్ద ఆందోళన తెలియజేసామని విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా అమెరికాతో సంప్రదింపులు జరుపుతామని చెప్పారు. అక్రమంగా అమెరికా వెళ్లినట్లు గుర్తించిన భారతీయులను సురక్షితంగా తీసుకువస్తామన్నారు. సైనిక విమానాల్లో తరలిస్తోన్న ప్రక్రియపై మిస్రీ స్పందిస్తూ తాజా బహిష్కరణ ప్రక్రియ మునుపటి విమానాలతో పోలిస్తే భిన్నంగా ఉందన్నారు. అయినప్పటికీ జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని అమెరికా ప్రభుత్వ విధానంలోనే పేర్కొన్నట్లు విదేశాంగ కార్యదర్శి స్పష్టంచేసారు. అక్రమ వలసదారులను తిరిగి స్వదేశాలకు పంపించే ప్రక్రియ కొత్తదేమీ కాదని భారత్ ఇప్పటికే ప్రకటించింది. గడచిన 15 ఏళ్లలో 15,756 మంది భారతీయులను వెనక్కి పంపించినట్లు విదేశాంగమంత్రి జైశంకర్ తెలిపారు. 2009లో ఈ సంఖ్య 734గా ఉండగా 2019లో గరిష్టంగా 2042 మందిని తిరిగిపంపించిందన్నారు. 2025లో భారత్‌కు ఇప్పటివరకూ 104 మందిని పంపించిందని విదేశాంగమంత్రి తెలిపారు.

# యుఎస్ ఎయిడ్‌లో 9700 మందికి ట్రంప్ ఉద్వాసన

**వాషింగ్టన్, ఫిబ్రవరి 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ నిర్ణయాలుప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఇప్పటికే ఇతర దేశాలపై టారిఫ్‌లు ఆంక్షలతో విరుచుకుపడుతున్న ఆయన స్వదేశంలోనూ కొన్ని సంస్థల్లో సమూల ప్రక్షాళన చేపట్టేందుకు సిద్ధం అయ్యారు. ప్రపంచంలో అతిపెద్ద సహాయ సంస్థ అయినా అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ అనే యుఎస్ఎయిడ్‌లో ఏకంగా 9700 మందికిపైగా ఉద్యోగాలను తొలగించేందుకు ట్రంప్ యంత్రాంగం ఆలోచనచేస్తోంది. ఈసంస్థకు ప్రపంచ వ్యాప్తంగా పదివేలమందికిపైగా ఉద్యోగులున్నారు. ఈ సంఖ్యను 300 దిగువకు తీసుకురావాలని చూస్తున్నారు. కేవలం 294 మంది మాత్రమే ఏజెన్సీలో పనిచేసేలా ట్రంప్‌ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధంచేస్తోంది. వీరిలో 12 మంది ఆఫ్రికా, బ్యూరో ఎనిమిది మంది ఆసియా బ్యూరోలో ఉండనున్నారట. మిగతా 9700 మందికి త్వరలోనే ఉద్వాసన పలకనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అయితే దీనిపై అమెరికా విదేశాంగశాఖనుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.ఈ సహాయ సంస్థను తీవ్రవాద ఉన్మాదులు నడుపుతున్నారని వాళ్లందరినీ వెళ్లగొట్టేస్తానని ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అటు డోజ్ విభాగ సారథి టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా దీనిపై మాట్లాడుతూ యుఎస్‌ఎయిడ్ నేరగాళ్లసంస్థ అని ఆరోపించారు. ఈక్రమంలోనే ఇటీవల ఈ సంస్థలో వందలాదిమంది ఉద్యోగులను సెలవుపై పంపించారు. సుమారు 120 దేశాలకు మానవతా దృక్పథంతో సాయంచేయడానికి ఆదేశాల అభివృద్ధికి, భద్రతకు నిధులు సమకూర్చడానికి యుఎస్ ఎయిడ్‌ను నెలకొల్పారు. ఈ సంస్థ వందలకోట్ల డాలర్లను సాయంగా అందిస్తోంది. అలాగే అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపైనా ట్రంప్ ఆంక్షలు విధించారు. ఇందుకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై తాజాగా ఆయన సంతకంచేసారు. అమెరికా దాని మిత్రదేశం ఇజ్రాయెల్ లక్ష్యంగా నిరాధార దర్యాప్తులు చేపడుతోందని ఈసందర్భంగా అధ్యక్షుడు దుయ్యబట్టారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై అరెస్టువారంట్‌జారీచేసి అంతర్జాతీయ క్రిమినల్‌కోర్టు తన అధికారాలను దుర్వినియోగం చేసిందని మండిపడ్డారు. ఆంక్షల నేపథ్యంలో ఐసిసి అధికారులు అమెరికాలో ప్రవేశించకుండా వారిపై నిషేధాజ్ఞలు అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించారు.





# సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్

# ఏడుగురు ఉగ్రవాదులు హాతం

**శ్రీనగర్, ఫిబ్రవరి 7:** భారత్ భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించాలన్న పాక్ ఉగ్రవాదుల కుట్రలను భద్రతా బలగాలు భగ్నంచేసాయి. నియంత్రణరేఖను దాటేందుకు యత్నిస్తుండగా ఏడుగురు చొరబాటుదారులను హతమార్చాయి. మృతుల్లో పాకిస్థాన్ ఆర్మీ సిబ్బందికూడా ఉన్నట్లు తెలుస్తోంది. జమ్ముకాశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో గల కృష్ణఘాటి సెక్టార్‌లో ఈనెల 4,5 తేదీలమధ్యరాత్రివేళ ఈ ఘటన చోటుచేసుకుంది. నియంత్రణ రేఖను దాటి భారత ఫార్వర్డ్‌పోస్ట్‌పై దాడికి యత్నిస్తున్న పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్‌పై సైన్యం మెరుపుదాడికి పాల్పడింది. ఈ క్రమంలోజరిగిన కాల్పుల్లో ఏడుగురు చొరబాటుదారులు హతమైనట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. మృతుల్లో ఇద్దరు ముగ్గురు పాకిస్థానీ ఆర్మీ రోగ్యులర్ సిబ్బందికూడా ఉన్నారు. మిగిలిన వారు ఉగ్రవాదులన అల్ బదర్‌గ్రూప్‌నకు చెందిన వారయి ఉండవచ్చని ఈ వర్గాలుతెలిపాయి. పాక్‌ప్రధాని షెహబాజ్ షరీప్ శాంతిమంత్రం వల్లెవేసిన కొద్దిరోజులకే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. కాశ్మీర్ సహా అన్ని సమస్యలకు భారత్‌తోసంప్రదింపుల ద్వారానే పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నట్లు ఇటీవల ఆయన ఒక కార్యక్రమంలో వ్యాఖ్యానించారు.

ఇదిలా ఉండగా జైషేమహ్మద్ లష్కరే తాయిబా వంటి ఉగ్రసంస్థలు తాజాగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో కశ్మీర్ సంఘీభావ దినం పేరుతో సంయుక్త సదస్సు నిర్వహించినట్లు తెలిసింది. దీనికి హమాస్ ప్రనతినిధులు కూడా హాజరైనట్లుప్రచారం జరగడంతో భారత నిఘా వర్గాలు మరింతగా అప్రమత్తం అయ్యాయి.

# 700 మంది క్యాంపస్ రిక్రూట్‌లపై ఇన్ఫోసిస్ వేటు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ సుమారు 700మంది కొత్త ఉద్యోగులను మైసూరు క్యాంపస్‌నుంచి ఇంటికి పంపింది. ఐటి ఉద్యోగుల సంఘం నాస్కెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్ (నైట్స్) శుక్రవారం ఈప్రకటనచేసింది. జాయిన్ అయిన కొద్దినెలలకే వీరందరినీ తొలగించిందని నైట్స్ వెల్లడించింది. ఇది అత్యంత అనైతికమని ఇన్ఫోసిస్ నిర్బంధంగా ఉద్యోగులను పంపించివేయడం ప్రారంభించిందని అందులో భాగంగానే 700 మంది క్యాంపస్ రిక్రూట్‌లను తొలగించిందని నైట్స్ అధ్యక్షుడు హర్‌ప్రీత్‌సింగ్ సలూజా ఆరోపించారు. ఈ ఉద్యోగుల తొలగింపుప్రక్రియలో కంపెనీ బౌనర్లు, సెక్యూరిటీ సిబ్బందిని కూడా నియమించిందని చెపుతూ ఉద్యోగులను మొబైల్‌ఫోన్లు కూడా లోపలికి అనుమతించలేదని, ఎందుకంటే ఎవరైనా విడియో చిత్రిస్తారన్న అనుమానంతోనే ఎవ్వరి మొబైల్ ఫోన్లను అనుమతించలేదన్నారు. ఇలా ఏకపక్షంగా ఆకస్మికంగా తొలగించడం ఉద్యోగులపై తీవ్ర ప్రభావం పడుతుందని సలూజా ఆరోపించారు. అయితే ఇన్ఫోసిస్ మాత్రం తమ చర్యను సమర్థించుకుంది. క్యాంపస్ రిక్రూట్ అయిన ఉద్యోగులు కంపెనీలో నిర్వహించిన అంతర్గత పరీక్షల్లో విఫలం అయ్యారని అందువల్లనే వారిని పంపించివేస్తున్నట్లు తెలిపింది. కొత్త ఉద్యోగులు అందరికీ మూడుసార్లు అసెస్‌మెంట్ క్లియర్‌చేసే అవకావం ఇచ్చామని, విఫలం అయితే వారు కంపెనీలో కొనసాగేందుకు అర్హులు కాదని ముందే స్పష్టం చేసామన్నారు. వారి కాంట్రాక్టులో కూడా స్పష్టంగా తెలిపామని కంపెని ప్రకటించింది. రెండుదశాబ్దాలుగా ఇదే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కంపెనీ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్తీర్ణులైన వారిని కొనసాగిస్తున్నామని తెలిపింది. అయితే నైట్స్ మాత్రం కేంద్ర కార్మిక ఉపాధికల్పనశాఖకు ఫిర్యాదు చేస్తామని ప్రకటించింది. ఇలా ఎంతమాత్రం కొనసాగనీయకూడదని ఐటి వర్కర్ల హుందాతనం, హక్కులను పరిరక్షిస్తామని సలూజా వెల్లడించారు.

# సిద్ధరామయ్యకు భారీ ఊరట

**బెంగళూరు, ఫిబ్రవరి 7:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఊరట నిచ్చాయి. కర్ణాటకలో ముడా కుంభకోణం కలకలం సృష్టించిన క్రమంలో లోకాయుక్తపోలీసుల దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు బదలీ చే యాలని వేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసును దర్యాప్తు సంస్థకు అప్పగించాలనే అభ్యర్థనను నిరాకరించింది.



ముడా స్కామ్ కర్ణాటక రాజకీయాల్లో కలకలం రేపుతోంది. ముడా స్థలాల కేటాయింపుల్లో ముఖ్యమంత్రి సిద్ధరా మయ్య కుటుంబసభ్యులు లబ్దిపొందడం అం దుకు ముఖ్యమంత్రి అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు దాఖలాలతో సామాజిక కార్యకర్త టిజె అబ్రహం గవర్నర్‌కు ఫిర్యాదుచేసారు. ఆయన తోపాటు స్నేహమయి కృష్ణ, ప్రదీప్‌కుమార్‌లు ముఖ్యమంత్రిపై ఫిర్యా దులు చేసారు. దీనితో ప్రథమ నిందితుడిగా సిద్ధరామయ్యపై కేసు నమోదయింది సిద్ధరామయ్య సతీమణి పార్వతి, బావమరిది మల్లిఖార్జున్‌స్వామితో పాటు మరో వ్యక్తిపేరు ఈ నిందితుల జాబి తాలో చేర్చారు. ఈ విషయంపై సిద్ధరామయ్య మాట్లాడుతూ తాను ఏ తప్పు చేయలేదని తప్పుచేసి ఉంటే ఇంతకాలం రాజకీయాల్లో ఉండటం అసాధ్యమన్నారు. భగవంతుడి ఆశీస్సులు ఉన్నంత వరకూ తనను ఎవరూ ఏమీ చేయలేరని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఆయన సతీమణి తమ భూములను తిరిగి ముడా సంస్థకు ఇచ్చేసారు. ఈ వ్యవహారంలో తనను విచారించేందుకు గవర్నర్ అనుమతి మంజూరు చేయడాన్ని సీఎం హైకోర్టులో సవాల్ చేసినా ఆయనకు న్యాయం జరగలేదు. దీనితో ఆయన సుప్రీంకోర్టుకు అప్పీలు చేసారు.

# సెలవు ఇవ్వలేదని సహోద్యోగులపై దాడి: నలుగురికి కత్తిపోట్లు

**కోల్‌కత్తా, ఫిబ్రవరి 7:** అత్యవసరపనిపై వెళ్లాలని సెలవు కావాలని అడిగిన ప్రభుత్వ ఉద్యోగికి సెలవు ఇవ్వకపోవడంతో సహనం కోల్పోయాడు. ఉన్నతాధికారి కాదనడంతో ఆతడి కోపం కట్టలు తెంచుకుంది. తన వెంట తెచ్చుకున్న కత్తితో ఉన్నతాధికారితోపాటు సహచర ఉద్యోగులపైనా దాడిచేసాడు. తర్వాత అదే కత్తితో తిరుగతూ కనిపించాడు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కత్తాలో న్యూటౌన్‌ప్రాంతానికిచెందిన కారిగరి భవన్‌లోని సాంకేతిక విద్యావిభాగంలో అమిత్‌కుమార్ సర్కార్ విధుల్లో ఉన్నాడు. ఎప్పటిలాగే ఆఫీస్‌కు వచ్చిన కుమార్ లీవ్ కావాలని ఉన్నతాధికారిని కోరితే ఆయన తిరస్కరించారు. అదే విషయంలో తన సహోద్యోగులతో గొడవకూడా జరిగింది. ఈ గొడవలో అమిత్‌వెంట తెచ్చుకున్నకత్తితో సహచర ఉద్యోగులపై దాడికి దిగాడు. వీపున బ్యాగ్, రక్తంతో తడిసిన కత్తితో వెళుతున్న అమిత్‌ను స్థానికులు విడియోలు తీయడంతో



అసలు విషయం వెలుగులోకి వచినచంది. ఆఫీస్ లో జరిగిన ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై పోలీస్ అదికారి మాట్లాడుతూ నిందితుడు తన సహోద్యోగులతో సెలవు విషయంలో గొడవపడ్డాడని, సెలవు నిరాకరించడానికి గల కారణం, సహోద్యోగులపై కత్తితో ఎందుకు దాడిచేసారో ఆరా తీస్తున్నట్లు తెలిపారు. నిందితుడికి మానసిక ఆరోగ్య సమస్యలున్నాయని అనుమానిస్తున్నామని ఆ కోణంలో కేసు దర్యాప్తు చేస్తామన్నారు. అమిత్ కత్తిదాడలో జయదేబ్ చక్రవర్తి, శంతను సాహా, సర్తాలేట్, షేక్ సతాబుల్‌లు గాయపడ్డారని వీరిలో ఇద్దరిపరిస్థితి విషమంగా ఉందన్నారు.

# మహాకుంభ్‌కు 40 కోట్లమంది భక్తులు

### కుంభమేళాప్రాంతంలో మళ్లీ అగ్నిప్రమాదం





**మహాకుంభ్‌నగర్, ఫిబ్రవరి 7:** ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు భక్తులు వెలువలా వస్తున్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలకు ప్రతినిత్యం లక్షల్లోనే భక్తులు వస్తున్నారు. కుంభమేళా ప్రారంభం అయినప్పటినుంచి నేటివరకూ 40 కోట్లమంది భక్తులు పుణ్యస్నానాలు చేసారని యుపి ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం నాటికి 39.74 కోట్లమంది భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు తెలిపారు. పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13వ తేదీ మహాకుంభమేళా ప్రారంభించారు. ఈనెల 26వ తేదీ శివరాత్రి వరకూ ఈకుంభమేళా కొనసాగనున్నది. సుమారు 45రోజులపాటు జరిగే ఈ మహాకుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి సుమారు 50 కోట్లమంది భక్తులు వస్తా రని యుపి ప్రభుత్వం అంచనావేస్తోంది. అం దుకు తగిన ఏర్పాట్లుకూడా చేసింది. ఇదిలా ఉం డగా మహాకుంభమేళాలో మరోసారి అగ్నిప్ర మాదం సంభవించింది. శకంరాచార్య మార్గ్‌లోని సెక్టార్ 18లో శుక్రవారం ఉదయం మంటలు చెలరేగాయి. అక్కట ఏర్పాటు చేసిన టెంట్లు మంటల్లో కాలిపోతున్నాయి. వెంటనే అప్రమత్తం అయిన అధికారులు అగ్నిమాపక యంత్రాల సాయంతో మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగ ఆశ్రమిస్తున్నారు. అదృష్టవ శాత్తూ ఈప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరిపీల్చు కుంటున్నారు.

# ట్రంప్‌కు భయపడుతున్న విశ్వగురువు

## ఇజ్రాయెల్ యుద్ధం ఆపిన మోడీ వలసవెళ్లిన భారతీయుల ఇక్కట్లను ఆపలేరా?: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



శుక్రవారం గాంధీభవన్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపి విహెచ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, షబ్బీర్‌అలీ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు విశ్వగురువుగా ప్రచారం చేసుకొంటున్న భారత ప్రధానమంత్రి భయపడుతున్నారని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఎద్దేవా చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ విదేశాంగ మంత్రి జై శంకర్‌కు దమ్ము లేదు, విదేశాంగ మంత్రి పూర్తిగా విఫలమయ్యారు అని ఆవేదన చెందారు. విశ్వ గురువులు భయపడుతారా?కానీ ఏం బలహీనతతో ట్రంప్ కి మోదీ భయపడుతున్నారు అని అన్నారు. రష్యా, ఉక్రెయిన్ దాడులను ఆపేవాళ్ళు అమెరికాలో ఉన్న మనవాళ్ళని తీసుకురాలేరా? అని ప్రశ్నించారు. ట్రంప్ అమెరికా ప్రెసిడెంట్ అయ్యాక ఇండియాకి ఇబ్బంది ఉండదని ప్రచారం చేసారని గుర్తుచేసుకున్నారు. సరైన పత్రాలు లేని104 మంది భారతీయులను అమెరికా ప్రభుత్వం గుర్తించి ఇండియాకు పంపిందని ఆయన తెలిపారు. ఛార్జ్ తీసుకున్నాక ట్రంప్ ఆయన ఫారిన్ పాలసీ క్లియర్ గా చెప్పాడు. అమెరికా కాళ్ళకు చేతులకు సంకెళ్లు వేసి 104 మందిని టెర్రరిస్టుల లాగా తీసుకువచ్చిందని ఆయన వివరించారు. కుంభమేళాను చూపిస్తున్న మోదీ మీడియా 104 మంది పరిస్థితిపై మాట్లాడడం లేదని అన్నారు. మోదీకి ప్రపంచమంతా బయపడుతని బీజేపీ వాళ్లు డబ్బా కొడతారు కానీ దానికి భిన్నంగా జరుగుతోన్నది. ఇజ్రాయెల్ యుద్ధం అపగలిగిన మోదీ అమెరికాలో ఇబ్బంది పడుతున్న వాళ్ళని క్షేమంగా తీసుకరాలేకపోతున్నారని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు విదేశాల్లో ఉన్న జైళ్ల నుండి44,000 మంది ని తెలుగు రాష్టానికి తీసుకువచ్చామని షబ్బీర్ గుర్తుచేసుకొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి వస్తే ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసుకున్నామని నెమరేసుకొన్నారు. మా హిస్టరీ చూసి కేంద్ర ప్రభుత్వం నేర్చుకోవాలని షబ్బీర్ అలీ హితవు చెప్పారు.

**వలసదారులకు సంకెళ్లు వేయడంపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం**

అమెరికాలో భారతీయులను అక్రమ వలసదారులుగా పేర్కొంటూ ట్రంప్ ప్రభుత్వం అమనవీయంగా, అవమానకరంగా కాళ్లకు, చేతులకు బేడీలు వేసి ఇండియా పంపిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఫిరోజ్‌ఖాన్ నేతృత్వంలో శుక్రవారం గాంధీ భవన్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ ఆలీ నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ ఫిరోజ్ ఖాన్, మాజీ ఎంపీ విహెచ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు ఆధ్వర్యంలో నిరసన చేతులకు బేడీలు వేసుకొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావ్, టీపీసీసీ. సీనియర్ ఉపాధ్యక్షులు కుమార్ రావ్ తదితరులు పాల్గొన్నారు. అమెరికా నుంచి భారత పౌరులను నిర్దాక్షి ణ్యంగా బేడీలు వేసి బలవంతంగా తరలిస్తుండడం భారత విదేశంగా మంత్రిత్వ శాఖ వైఫల్యంగా చూడాలని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత పౌరులకు బేడీలు వేసి అమెరికా నుంచి పంపిస్తున్న చలనం లేనట్లు కేంద్రం వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. అమానవీయ ఘటనకు మోదీ, బీజేపీ సిగ్గు పడాలి అని ఆరోపించారు. అమెరికాకు గులాంగిరి బంద్ ఖరో అంటూ కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు.


మల్లు అనంతరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి తదితరులు


# మల్లు అనంతరాములుకు నివాళులర్పించిన సిఎం

**హైదరాబాద్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** పిసిసి మాజీ అధ్యక్షుడు మల్లు అనంత రాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి న్యూఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా రెండుసార్లు ఎన్నికైన మల్లు అనంతరాములు ఆ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని ముఖ్యమంత్రి కొనియాడారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీప్‌దాస్‌మున్షీ, కాంగ్రెస్ నేత రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఆర్టీసి యాజమాన్యం, కార్మిక సంఘాలతో లేబర్ కమిషనర్ చర్చలు

## 10న లేబర్ కమిషనర్ ఆఫీసులో భేటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఆర్‌టీసీ సంస్థని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు.. ఆర్‌టీసీ పరిరక్షణకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం గత నెల జనవరి 27న ఆర్‌టీసీలోని కొన్ని సంఘాలు జేఏసీ పేరుతో సమ్మె నోటిస్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమ్మె నోటీసు ఇచ్చిన సంఘాలతోనూ అలాగే ఆర్‌టీసీ యాజమాన్యంతోనూ చర్చలు జరపడానికి కార్మిక శాఖ సిద్ధ పడింది. సమ్మె నోటీసు ఇచ్చిన జేఏసీ సంఘాలతోపాటు యాజమాన్యంతో లేబర్ కమిషనర్ ఈ నెల 10(సోమవారం)న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ ఆఫీస్(అంజయ్య భవన్)లో చర్చలు చేపట్టనుంది. చర్చలకు సంబంధించి హాజరు కావాలని జేఏసీ యూనియన్లకు ఆర్‌టీసీ ఎండీకి జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శుక్రవారం లేఖలు రాసినట్టు జేఏసీ నాయకులు తెలిపారు. ఆర్‌టీసీ ఉద్యోగులకు ఇచ్చిన ప్రధాన హామీలైన ప్రభుత్వంలో ఆర్‌టీసీ ఉద్యోగుల విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, 2021 నుంచి వేతన సవరణ చేయాలని కోరుతూ సమ్మె నోటీసును జేఏసీ అందజేసింది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని నోటీసులో పేర్కొంది.



కేంద్రమంత్రి పీయూష్‌గోయల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

# బిసిల బడ్జెట్‌ను 2 లక్షల కోట్లకు పెంచండి

## కేంద్రమంత్రి పీయూష్‌గోయల్‌కు ఎంపి ఆర్.కృష్ణయ్య వినతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** కేంద్రంలో బిసిల బడ్జెటు 2లక్షల కోట్లకు పెంచాలని, బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, జనగణనలో కులగణన చేపట్టాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం కేంద్రమంత్రి పీయూష్ గోయల్ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శుక్రవారం సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పలుఅంశాలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా దేశవ్యాప్తంగా బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్లను కేంద్రమంత్రికి వివరించారు. పీయూష్ గోయల్ స్పందిస్తూ బీసీల డిమాండ్ న్యాయమైనవని సంఘం ఇచ్చిన డిమాండ్లపై ప్రత్యేక చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారని కృష్ణయ్య తెలిపారు. ఇప్పటికే కేంద్రం లో 27 మంది బీసీలకు కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకోవడం జరిగిందని ఆరు మంది గవర్నర్లను, జాతీయ బీసీ కమిషన్ కు రాజ్యాంగ బద్ధమైన హోదా ఇచ్చామని. బీసీల రిజర్వేషన్లను ఏ,బి,సి,డి వర్గీకరణకు కమిషన్ నియమించాం. ఇక తొందరలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని, బీసీలకు పెద్ద ఎత్తున బడ్జెట్ పెంచుతామని హామీ ఇచ్చినట్లు కృష్ణయ్య పేర్కొన్నారు. మంత్రిని కలిసినవారిలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బోను దుర్గ నరేష్, కర్రి వేణుమాధవ్, రాజునేత, మనికంఠ, బీమారపు సురేష్ తదితరులు ఉన్నారు.

# పోలీసుల అదుపులో కీచక ఉపాధ్యాయుడు



పోలీసుల అదుపులో నిందితుడు కన్ణయ్య

**ధారూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** గత సంవత్సరం డిసెంబరు 13న ధారూర్ స్టేషన్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలతో అసభ్యంగా ప్రవర్తించిన తెలుగు ఉపాధ్యాయుడుపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా, ఫోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం పాఠకులకు విదితమే. ఇప్పటివరకు పరారీలో ఉన్న ఉపాధ్యాయుడు పెద్దగొల్ల కన్ణయ్యను శుక్రవారం ధారూర్ పోలీసులు వికారాబాద్‌లో అదుపులోకి తీసుకొని రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు ధారూరు ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

# రిజర్వేషన్‌ల పరిరక్షణకు బిజెపి పోరాడాలి

## పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** బిజేపి కి రిజర్వేషన్ ఇవ్వాలని లేదని రిజర్వేషన్ పరిక్షణకోసం బీజేపీ మీద పోరాటం చేయాలని పిసిసి మాజీ అధ్యక్షుడు రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీ భవన్‌లో వి. హనుమంత రావు మాట్లాడుతూ కులగణన చేసి బీసీలకు మేము న్యాయం చేస్తున్నామని అన్నారు. సూర్యాపేట లో రాహుల్ గాంధీ తో సభ పెడుతున్నామని తెలిపారు. ఎస్సి రిజర్వేషన్ చేసినందుకు గజ్వేల్ లో మలికార్జున ఖర్గే తో సభ పెడుతున్నాం అని ఆయన వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీ పక్షపాతి అని విహెచ్ ధృవీకరించారు. సూర్యాపేట, గజ్వేల్ సభకు నా పూర్తి మద్దతు ఉంటుంది అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కులగణన జరగాలని అసెంబ్లీ లో బిల్ పెట్టారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి తో సూర్యాపేటలో సభ పెడితే 2లక్షల మంది వచ్చారని గతంను నెమరేసుకున్నారు.

# వ్యవసాయ వర్సిటీకి అమెరికా ఆబర్న్ వర్సిటీ బృందం

## ఉపకులపతి ఆల్దాస్ జానయ్య.. పలు అంశాలపై ప్రతినిధి బృందం చర్చ

**అత్తాపూర్ ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రణాళికల్ని రూపొందిస్తున్నామని ఉపకులపతి డాక్టర్ ఆల్దాస్ జానయ్య అన్నారు. అందులో భాగంగా అమెరికాలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయం అయిన ఆబర్న్ విశ్వవిద్యాలయానికి చెందిన ఉన్నత స్థాయి బృందం శుక్రవారం ఉపకులపతి ఆల్దాస్ జానయ్య మరియు ఇటీవల నియమితులైన పూర్తిస్థాయి విశ్వవిద్యాలయ అధికారులతో పిజెటీఎయూ పరిపాలన భవనంలో సమావేశం అయింది. అంతర్జాతీయ సంస్థలతో విస్తృతంగా ఒప్పందాలు కుదుర్చుకుని బోధన, పరిశోధన తదితర రంగాల్లో పరస్పరం కలిసి పనిచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జానయ్య ఆ బృందానికి తెలిపారు. అమెరికా దేశంలోని అలబామా రాష్ట్రానికి చెందిన ఈ ఆబర్న్ విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం గ్రాడ్యుయేట్ స్కూల్ డీన్ మరియు మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ జార్జ్ ఫ్లవర్స్ నేతృత్వంలో ఉపకులపతి డాక్టర్ ఆల్దాస్ జానయ్యతో సమావేశం అయ్యి అనేక అంశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి, ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి, అగ్రికల్చర్ ప్రొడక్షన్ కమిషనర్ ఎం . రఘునందన్ రావు, ఐఏఎస్ గతేడాది ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ రెండు విశ్వవిద్యాలయాల మధ్య ఒప్పందం కుదిరేలా చేశారని జానయ్య అన్నారు. తద్వారా వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు తొలి సారిగా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో ఆబర్న్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించడానికి వెళ్లారని వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి పిజెటీఎయూ నుంచి ఆబర్న్ విశ్వ విద్యాలయంతో పాటు ఇతర ప్రఖ్యాత విశ్వ విద్యాలయాలకి 8 10 మంది విద్యార్థుల్ని పంపించడానికి అవసరమైన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు ఉపకులపతి తెలిపారు. అదేవిధంగా ఎం ఎస్ సి విద్యార్హతతో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారు కూడా పి హెచ్ .డి పూర్తి చేసి సాంకేతిక పరిజ్ఞానం, ప్రతిభ, సామర్థ్యాన్ని పెంపొందించుకొని మరల ఇక్కడే పనిచేసే అవకాశాలని పరిశీలిస్తామని ఆల్దాస్ జానయ్య తెలిపారు. తర్వాత రాజేంద్రనగర్ లోని వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో ఆబర్న్ విశ్వవిద్యాలయ బృందం ప్రతినిధులు డిగ్రీ చివరి సంవత్సర విద్యార్థులతో సమావేశం అయ్యారు. ఆబర్న్ విశ్వవిద్యాలయంలో ప్రవేశ ప్రక్రియ గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల సందేహాల్ని నివృత్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి .ఈ .సి హెచ్ . విద్యాసాగర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం . బలరాం, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం . యాకాద్రి, పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ కె .బి ఈశ్వరి, విశ్వవిద్యాలయ అంతర్జాతీయ కార్యక్రమాల విభాగం సంచాలకులు డాక్టర్ వి . రాములు, సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ రఘురామిరెడ్డి, డాక్టర్ జమునా రాణి, ఆబర్న్ విశ్వవిద్యాలయ డైరెక్టర్ డాక్టర్ షీనా స్టీవార్ట్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వృషాంక్ రాఘవ్, డీన్ ఆఫ్ కాలేజీ ఆఫ్ ఫారెస్ట్రీ, వైల్డ్ లైఫ్ అండ్ ఎన్విరాన్మెంట్ డాక్టర్ జానకి అలవలపాటి, ప్రొఫెసర్ డాక్టర్ గోవింద్ కన్నన్ లు పాల్గొన్నారు.


వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశంలో ఆబర్న్ విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం

# మూడు గ్రూపులుగా ఎస్సీ వర్గీకరణ

## బిజెపి, బిఆర్ఎస్ వర్గీకరణను అడ్డుకొన్నాయి

## ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు ఆదేశాలతో వేసిన ఏకసభ్య కమీషన్ జస్టిస్ షామిమ్ అక్తర్ నివేదిక ఆధారంగా ఎస్సీ వర్గీకరణలో మూడు గ్రూపులుగా ప్రభుత్వం విభజించిందని ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మాట్లాడతూ ఎస్సీ వర్గీకరణ కోసం 2011 జనాభా లెక్కల ప్రకారం తీసుకు న్నామని తెలిపారు. 2011 జనాభా లెక్కలు ప్రభుత్వ అధికారిక లెక్కలు కావడంతో వాటిని ప్రామాణికంగా తీసుకోవడం సరైన నిర్ణయం అని ఆయన సమర్థించుకున్నారు.సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు వేసిన ఏకసభ్య కమిషన్ నివేదికకు అనుగుణంగా మూడు గ్రూపులు విభజించారని ఇందులో సిఎం రేవంత్‌రెడ్డిని, మంత్రి రాజనర్సింహకు ఏ దోషం ఆపాదించ కూడదని ఆయన హితవు చెప్పారు.మాల సామాజిక వర్గంతో పోల్చితే మాదిగల జనాభా డబుల్ ఉందని తెలిపారు.గ్రూప్ -2లోని కులాలకు 11శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా9 శాతం రిజర్వేషన్ ఎందుకు కేటాయించారు అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని సంపత్ అభిప్రాయపడ్డారు .ఉమ్మడి ఆంధ్రనరపదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలోనే 59 ఎస్సీ కులాలను ఎబిసిడిగా వర్గీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉషా మెహర్ కమిటీ వేసింది.ఆ తర్వాత తెలంగాణ ఉద్యమం ఉదృతం కావడం. తెలంగాణ ఏర్పాటు కావడం కేంద్రంలో బిజెపి అధికారంలోకి రావడం జరిగిందని చరిత్రను సంపత్ నెమరేసుకున్నారు. కేంద్రంలోని బీజేపీ, బిఆర్ఎస్ లు వర్గీకరణ ను అడ్డుకున్నాయి. కాంగ్రెస్ తెలంగాణ లో అధికారంలోకి వచ్చాక.. సుప్రీం కోర్టులో బలమైన వాదనలు వినిపించడం జరిగింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏకసభ్య కమిషన్ వేసి నివేదిక ఆధారంగా మూడు గ్రూపులు రేవత్ ప్రభుత్వం చేసింది.ఆంధ్రప్రదేశ్ తో విడిపోయాక కొన్ని కులాలు తెలంగాణ లో లేవు కాబట్టి మూడు గ్రూపులు గా చేశారని ఆయన వివరణ ఇచ్చుకున్నారు. .గ్రూప్ 1 కి 1శాతం, గ్రూప్2 కి 9శాతం, గ్రూప్ 3 కి 5 శాతం రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని ఆయన చెప్పారు. గ్రూప్ 1 లో 15 కులాలు ఉన్నాయి.గ్రూప్ 2 లో 18 కులాలు ఉన్నాయి. గ్రూప్ 3 లో 26 కులాలు ఉన్నాయి. 33.96 శాతం మాత్రానే ఎస్సీ జనాభాలో ఉన్నారు ఏ ఒక్క కులానికి ఇచ్చిన రిజర్వేషన్ కాదు ఇది అని ఆయన స్పష్టం చేశారు. ఆ గ్రూప్ లో ఉన్న అన్ని కులాల కు వర్తిస్తుంది. గ్రూపు 3లో ఉన్న 5శాతం రిజర్వేషన్ మాలలకు మాత్రమే కాదు అందులో ఉన్న ఇతర కులాల జనాభా 2 లక్షల 44వేల మందికి వర్తిస్తుంది.గ్రూప్ 3 కి కేటాయించిన 9 శాతం లో మాదిగలకు మాత్రమే కాదని ఆయన వివరించారు. అందులో ఉన్న ఇతర కులాల కు కూడా వర్తిస్తుంది.ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎవరికి అన్యాయం జరగదని భరోసా ఇచ్చే ప్రయత్నం సంపత్ చేశారు. ఎవరికి ఎక్కువ న్యాయం కూడా జరగదు.8వేల పైగా జస్టిజ్ షామిమ్ అక్తర్ కమిషన్ కి విజ్ఞప్తులు వచ్చాయి. ఎబిసిడి వర్గీకరణ నుంచి మూడు గ్రూప్ లలో కుదించేందుకు భావ స్వరూప్యతా.. సంప్రదాయాలు కలగాల్సిన కులాలను ఒక్కటి చేశారు.సీఎం రేవంత్ రెడ్డి,దామోదర రాజనర్సింహా లు ఎలా దోషులు అవుతారు.ఎస్సీ వర్గీకరణ చేసిన జస్టిస్ షామిమ్ అక్తర్ గారికి,ప్రభుత్వానికి,సీఎం,సబ్ కమిటీ కి ప్రత్యేక ధన్యవాదాలని అన్నారు.

# రైతుల బిల్లులు చెల్లింపునకే స్థిరాస్తుల విక్రయాలు

## నార్ముల్ మదర్ డెయిరీ ఛైర్మన్


సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్ (హాయత్‌నగర్), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** బ్యాంకుల్లో తీసుకున్న అప్పును చెల్లించడంతోపాటు రైతులకు చెల్లించాల్సిన పాలబిల్లుల బకాయిలను చెల్లించి సంస్థను గాడిన పడేసేందుకుకే స్థిరాస్థులను అమ్మడానికి పాలక వర్గం నిర్ణయం తీసుకుందని... సొసైటీ ఛైర్మన్లు తీర్మాణాన్ని ఆమోదించి సహ కరించాలని నార్ముల్ మదర్ డెయిరీ ఛైర్మన్ గుడిపాటి మధు సూదన్‌రెడ్డి అన్నారు.
హాయత్ నగర్‌లోని మదర్‌డెయిరీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమా వేశంలో ఆయన మాట్లా డుతూ 2014 వరకు లాభాల బాటలో ఉన్న మదర్ డెయిరీ క్రమంగా పదేళ్లల్లో 60 కోట్ల మేర అప్పులో కూరుకు పోయిందన్నారు. సంస్థ లాభాల్లో ఉన్నట్లు చూపుతూ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నామని... ప్రస్తు తం నష్టాల్లో ఉన్నట్లు బ్యాంకులు గుర్తిస్తే మార్టిగేజ్ చేసుకున్న నికర ఆస్తులను వేలం వేసే ప్రమాదం ఉందన్నారు. అప్పుల్లో నుంచి బయట పడేందుకు తప్పని పరిస్థితుల్లో మార్టిగేజ్ చేసిన చిట్యాలోని 29.36 ఎకరాల భూమితో పాటు నకిలేకల్, చండూరులోని స్థలాలను విక్రయించి వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చడం, రైతులకు చెల్లిం చాల్సిన పాలబిల్లులను చెల్లించడం, సంస్థకు అవసరమైన మిషనరీ కొనడం చేయడం సముచితమని నిర్ణయించినట్లు తెలిపారు.

**స్థిరాస్తుల విక్రయాల్లో పారదర్శకత పాటించాలి**

మదర్ డెయిరీ ఢిల్లీ వారితో పాలవిక్రయాల ఒప్పందం రద్దు, కరోనా పరిస్థితుల కారణంగానే గతంలో సంస్థ లాభాల నుంచి నష్టాల బాటలోకి వెళ్లిందని మాజీ ఛైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి అన్నారు. మార్కెట్‌లో నెలకొన్న పోటీ కారణంగా ఎప్పటికపుడు విక్రయాలు తగ్గడంతో నష్టాలు పెరుగుతూ వచ్చాయన్నారు. స్థిరాస్థి విక్రయాలకు బదులుగా దిద్దుబాటు చర్యలు తీసుకుని సంస్థను గాడిన పెట్టాలని సూచించారు. సొసైటీ ఛైర్మన్లు భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ మాట్లా డుతూ... నష్టాలను పూడ్చుకోవడానికి ఆస్తులను విక్రయించడంపై తమకు అభ్యంతరాలు లేవని, స్థిరాస్తుల విక్రయాలలో పారదర్శకత పాటించాలని భవిష్యత్తులో తిరిగి నష్టం వస్తే పాలకవర్గం బాధ్యత తీసుకుని పదవులకు రాజీనామాలు చేయాలన్నారు.

# ఒకటో తరగతి చిన్నారిపై వ్యాన్ డ్రైవర్ లైంగిక దాడి

## ఇబ్రహీంపట్నం ఘటన మరువకముందుకే మరో ఘటన

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఒకటవ తరగతి చదువుతున్న చిన్నారి(7)పై వ్యాన్ డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇబ్రహీంపట్నంలో ఓ పాఠశాల ప్రిన్సిపాల్ పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ ఘటన మరువకముందుకే శంషాబాద్ లో ఒకటవ తరగతి చదువుతున్న చిన్నారిపై మంచాల లో లైంగిక దాడికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని అన్ ఫ్రెంట్ జీసస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పిక్నిక్ కోసం ఈనెల 4న మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ రిసార్ట్ కు వచ్చారు .చిన్నారి వాష్ రూమ్ కు వెళ్ళింది చూసి వ్యాన్ డ్రైవర్ ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కాగా చిన్నారి తన ఆరోగ్యం బాలేదని తన తల్లికి తెలిపింది. చిన్నారికి రక్తస్రావం అవుతుండడంతో తల్లి ఆస్పత్రికి తీసుకెళ్ళింది. దీంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. శుక్రవారం పాఠశాల ఎదుట చిన్నారి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై చిన్నారి తల్లిదండ్రులు మంచాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.పోలీసులు నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

# సమస్య కోసం వస్తే లైంగికదాడి చేసిన కానిస్టేబుల్

## విషయం బయటకు పొక్కితే అంతుచూస్తానని బెదరింపు

## వేధింపులు భరించలేక ఫిర్యాదు చేసిన బాధిత యువతి

**మేడ్చల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** తనకు సమస్య ఉందని ఓ యువతి పోలీస్ స్టేషన్‌కు వెళితే అక్కడ కానిస్టేబుల్ ఆమెకు సహాయం చేస్తానని చెప్పి లోబర్చు కుని గర్భవతిని చేసిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌కు చెందిన ఓ యువతి (31) డబ్బుల విషయంలో కొందరు తనను ఇబ్బందికి గురిచేస్తున్నారని ఫిర్యాదు చేసేందుకు గతేడాది మార్చి 21న తన తల్లితో కలిసి మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. అనంతరం ఆమె తిరిగి వెళుతున్న సమయంలో అక్కడే ఉన్న క్రైం విభాగంలో పనిచేసే కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి వారికి తగిన న్యాయం చేయిస్తా నని చెప్పి తన సెల్‌ఫోన్ నంబర్‌ను ఆ యువతికి ఇచ్చాడు. మర్నాడు ఆ యువతి కేసు విషయమై కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డికి ఫోన్‌చేయగా లాయర్‌తో చర్చించి సమస్యను పరిష్కరించుకునేలా చేస్తానని చెప్పి అందుకు ఆమెను ఇంటికి రమ్మని తెలిపాడు. ఇంటికి వెళ్లిన ఆమెను కాసేపు కూర్చోబెట్టి లాయర్ ఇంకా రాలేదని, వచ్చేవరకు ఉండమని చెప్పి తనకు పెళ్లి కాలేదని, తాను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమెను లోబర్చుకుని లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో బాధితురాలు గర్భవతి అయితే ఆమె చేత బలవంతంగా మాత్రలు మింగిచ్చి ఆబార్షన్ అయ్యేలా చేశాడు. గత డిసెంబరు 16న సుధాకర్‌రెడ్డి తన వాహనంపై ఆ యువతిని బలవంతంగా తీసుకెళ్లి బెదరించడమే కాకుండా గిర్మాపూర్ రోడ్డులో ఆమెను బండిపై నుండి కిందకి తోసెయడంతో యువతి తీవ్రగాయాల పాలైంది. కాగా, సదరు కానిస్టేబుల్‌ను మేడ్చల్ సిఐ సత్యనారాయణ సైబరాబాద్ కమిషనరేట్‌కు అటాచ్ చేయించాడు. అయినా అతని వేదింపులు, బెదరింపులు ఆగకపోవడంతో ఆగకపోవడంతో బాధిత యువతి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని కానిస్టేబుల్ సుదాకర్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించారు.


కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి


ప్రజావాణిలో దరఖాస్తుదారులతో డా.జి.చిన్నారెడ్డి

# ప్రజావాణికి అందిన దరఖాస్తులు 4,901

**హైదరాబాద్ (బేగంపేట), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 4,901 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 157 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 105 దరఖాస్తులు, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 30 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 2,865 దరఖాస్తులు వచ్చాయి. పౌర సరఫరాల శాఖకు సంబంధించి 1,640 దరఖాస్తులు (రేషన్ కార్డుల కోసం) వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 109 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.జి. చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



## మహా కుంభమేళాలో పాక్ హిందువుల పవిత్రస్నానం

**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 7:** ప్రయాగరాజ్‌లోజరుగుతున్న మహాకుంభమేళాకు దేశవిదేశాలనుంచి భక్తులు, ప్రముఖులు వస్తున్న సంగి తెలిసిందే. పాకిస్థాన్‌నుంచి 68 మంది హిందువులు కూడాప్రయాగరాజ్ వచ్చారు. త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అక్కడి ఘాట్‌లలోప్రత్యేక పూజలునిర్వహించారు. వారు మాట్లాడుతూ తాము పాకిస్థాన్‌లోని సింధ్‌ప్రావిన్స్‌నుంచి వచ్చామన్నారు. జీవితంలో ఒక్కసారి మాత్రమే వచ్చే ఈ పవిత్ర సందర్భాన్ని మిస్‌చేసుకోకూడదన్న లక్ష్యంతో భారత్‌కు వచ్చామన్నారు. హిందూమతం గొప్పతనాన్ని తొలిసారిగా మరింత లోతుగా అర్థంచేసుకునే అవకాశం లభించిందన్నారు. హారిద్వార్‌వెళ్లి తమ పూర్వీకుల అస్థికల్ని గంగలో కలిపామని ఈ అనుభూతి అద్భుతంగా ఉందంటూ పాక్ హిందువులు వ్యాఖ్యానించారు. గతనెల 13న ప్రారంభం అయిన మహాకుంభమేళా ఈనెల 26వరకూ జరుగుతుంది. 45 రోజులపాటు జరిగే కుంభమేళాకు దాదాపు 40 కోట్లమంది పుణ్యస్నానాలు చేసినట్లు యూపి సర్కారు ప్రకటించింది.

## సత్తా చాటిన భారతీయ సైక్లిస్టులు

### ఆసియా రోడ్ పారాసైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో నాలుగు పతకాలు

**హైదరాబాద్ (బేగంపేట) ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** థాయ్‌లాండ్‌లోని ఫిచిట్ నగరంలో జరుగుతున్న ఆసియా రోడ్ పారా సైక్లింగ్ ఛాంపియన్ షిప్‌లో భారతీయ పారా సైక్లిస్టులు మొదటి రోజు అద్భుత ప్రదర్శన కనబర్చారు.వీరి సంకల్పం,నైపుణ్యం,పట్టుదల అంతర్జాతీయ వేదికపై దేశాన్ని గర్వపడేలా చేసింది.భారత జట్టు ఈ పోటీలో నాలుగు పతకాలు కైవసం చేసుకుంది.వీటిలో ఒక స్వర్ణం, రెండు రజత పతకాలు,ఒక కాంస్యం ఉన్నాయి.ఆసియాలోని శక్తివంతమైన ప్రత్యర్థుల మధ్య పోటీ చేస్తూ ఈ ఘనతను సాధించింది.జ్యోతి గడేరియా(మహారాష్ట్ర),మహిళల సీ2 విభాగంలో ఇండివిడ్యువల్ టైమ్ ట్రయల్‌లో స్వర్ణ పతకం గెలుచుకున్నారు.అర్షద్ షేక్ (ఆంధ్రప్రదేశ్) పురుషుల సీ2 విభాగంలో ఇండివిడ్యువల్ టైమ్ ట్రయల్‌లో కాంస్య పతకం గెలుచుకున్నారు.ప్రశాంత్ ఆర్కల్ (మహారాష్ట్ర) పురుషుల హ్యాండ్ సైక్లింగ్ హెచ్4 విభాగంలో ఇండివిడ్యువల్ టైమ్ ట్రయల్‌లో రజత పతకం సాధించారు.ఈ సందర్భంగా పారా సైక్లిస్టులు మాట్లాడుతూ ఈ విజయం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు.ఈ ఘనత సాధించడంలో సహకరించిన కోచ్‌లు ,మద్దతు దారులు దేశానికి కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ విజయం పారాథ్లెట్ల నైపుణ్యానికి,కోచ్ ఆదిత్య మెహతా మార్గదర్శకత్వానికి ,ఆదిత్యా మెహతా ఫౌండేషన్ మద్దతుకు నిదర్శనం.ఇన్వెస్కో ,ఆదిత్య మెహతా ఫౌండేషన్ ఆల్కాన్,జీఎంఎంసీ వంటి సంస్థలు భారత పారాథ్లెట్లకు శిక్షణ,సామాగ్రి,పునరావాస సదుపాయాలు కల్పిస్తూ కీలక భూమిక పోషిస్తున్నాయి.ఈ విజయాలు భారత పారాస్పోర్ట్‌లో మైలురాయిగా నిలుస్తుంది. ప్రపంచ ఛాంపియన్ షిప్‌లు 2028 పారాఒలింపిక్స్ వంటి గొప్ప వేదికలకు సిద్ధమయ్యేందుకు మార్గదర్శకంగా నిలుస్తాయని భావించవచ్చు.

## 13న ఇంగ్లీష్ భాషా దినోత్సవం నిర్వహించాలి

### ఆదేశాలు జారీ చేసిన ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సరోజినాయుడు పుట్టిన రోజైన ఫిబ్రవరి 13న ఇంగ్లీష్ భాషా దినోత్సవంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ డీఈవోలు, ఆర్‌జేడీలను ఆదేశించారు. ఫిబ్రవరి 13న ఇంగ్లీష్ భాషా దినోత్సవంగా నిర్వహించాలని కోరుతూ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఈఎల్‌టీఏ) ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కి విజ్ఞప్తి చేయగా.. ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ డీఈవోలు, ఆర్‌జేడీలకు సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంగ్లీష్ భాషా దినోత్సవం సందర్భంగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని సూచించారు. అదేశింగా కథల పోటీ, కవితల పోటీతోపాటు పోస్టర్స్ మేకింగ్ పోటీలను నిర్వహించాలని సూచించారు. పోటీలను నిర్వహించి గెలిచిన వారికి ఈ నెల 13న ఇంగ్లీష్ భాషా దినోత్సవం రోజున బహుమతులను ప్రదానం చేయాలని సూచించారు.

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి నోటీసులు

**హైదరాబాద్ (అల్వాల్), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** డిప్యూటీ కమిషనర్ విధులకు ఆటంకం కలిగించడంతోపాటుగా బెదిరింపుకు పాల్పడినందుకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి అల్వాల్ పోలీసులు శుక్రవారం నోటీసులు జారీచేశారు. పదకొండు నెలలు తరువాత పోలీసులు చర్యలకు ఉపక్రమించడం చర్చాంశనీయంగా మారింది. గత ఏడాది 6 మార్చి 2024లో ఎమ్మెల్యేతో పాటుగా బిఆర్‌ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు నేతలు, కార్యకర్తలు ప్రజా సమస్యలకు సంబంధించి జిహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాలయం ముందు భైఠాయించడం జరిగింది. అదే సమయంలో కార్యాలయానికి వాహనంలో వచ్చిన డిసి శ్రీనివాస్‌రెడ్డిని బిఆర్‌ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి.



మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌ఈస్ట్ జోన్ డిసిపి పాటిల్ కాంతిలాల్ సుభాష్

## పాతబస్తీలో గంజాయి సరఫరా చేస్తున్న డ్రైవర్ అరెస్ట్

### రూ. 50 లక్షల విలువైన సరకు స్వాధీనం

**హైదరాబాద్ (చార్మినార్), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** హైదరాబాద్ పాతబస్తీ చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ వద్ద అక్రమంగా గంజాయిని తీసుకెళ్తున్న ఓ డ్రైవర్‌ను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు,చాంద్రాయణగుట్ట పోలీసులు కలిసి అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి పాటిల్ కాంతికాల్ సుభాష్ చాంద్రాయణ గుట్ట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.సంగారెడ్డి జిల్లా,నగిలిగిద్ద మండలం.మెఘ్యానాయక్ తాండాకు చెందిన జాదవ్ శివరామ్ (34) వృత్తి రీత్యా డ్రైవర్.జాదవ్ శివరామ్ గంజాయి వ్యాపారం చేస్తుంటాడు.పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లోని సీలేరు.అల్లూరి సీతారామరాజు జిల్లాతో పాటు ఒరిస్సా నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రంలో అమ్ముతుంటాడు.మూడు రోజుల క్రితం జాదవ్ శివరామ్ ఒరిస్సాలో కొనుగోలు చేసిన 200 కేజీల గంజాయిని శంషాబాద్‌కు తీసుకు వచ్చాడు.కాగా అక్కడ నుంచి వాహనంలో గంజాయి తీసుకెళ్తున్న జాదవ్ శివరామ్‌ను చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ వద్ద సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు,చాంద్రాయణగుట్ట పోలీసులు కలిసి అదుపులోకి తీసుకున్నారు.అతని వద్ద నుంచి యాభై లక్షల రూపాయలు విలువ గల 200 కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో సుభాష్,బానావత్ జైపాల్ పరారీలో ఉన్నారు. ఈ కేసును చాంద్రాయణగుట్ట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# యుజిసి ముసాయిదాపై మరో సమావేశం కేరళలో..

### మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 7:** ఉన్నత విద్యపై రాష్ట్ర అధికారాలను నియంత్రించే యుజిసి నిబంధనల ముసాయిదా2025 ను ఉపసంహరించుకునేంతవరకు రాష్ట్ర ప్రభుత్వం పోరాడుతుందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ నెల 5 న బెంగళూరులో 6 రాష్ట్రాల విద్యామంత్రుల సమావేశం దీనిపై సంయుక్త తీర్మానం చేసి కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పంపించింది. ఈ అంశంపై త్వరలో కేరళలో మరోసారి సమావేశం కానున్నట్టు శుక్రవారం నాడు సచివాలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీధర్ బాబు తెలిపారు. రాహుల్ గాంధీ గురువారం నాడు ఢిల్లీలో డిఎంకె నేతలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి ముసాయిదాలో మార్పులు చేయడం లేదా ఉపసంహరించుకునేంత వరకూ తాము ఉద్యమిస్తూనే ఉంటామని ఆయన పేర్కొన్నారు. ఉన్నత విద్యపై రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తోందని, అయినా కేంద్రం తమ అధికారాలను లాక్కోవాలని చూడటం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని శ్రీధర్ బాబు ఆక్షేపించారు. జమ్మూ కశ్మీర్ కూడా తమతో కలిసి రావడానికి సంసిద్ధత వ్యక్తం చేసినట్టు ఆయన వివరించారు. డిగ్రీ ప్రవేశాలకు జాతీయ స్థాయిలో ఎంట్రన్స్ నిర్వహించాలనుకోవడం విద్యార్థులను కళాశాల విద్యకు దూరం చేసే ప్రయత్నమని ఆయన దుయ్యబట్టారు. డిగ్రీ చదివే వయసున్న యువతలో జాతీయ సరాసరి ప్రకారం నూటికి 28 మంది మాత్రమే కళాశాలల్లో చేరుతున్నారని, రాష్ట్రంలో ఇది 40శాతం ఉందని తెలిపారు. ఎంట్రెన్స్ లాంటి నిబంధన వల్ల ఉత్తీర్ణులు కాలేమన్న ఆందోళనతో మరింత ఎక్కువ మంది ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. వైస్ ఛాన్సలర్ల నియామకంలో రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండా అధికారాలను పూర్తిగా తన చేతిలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమని శ్రీధర్‌బాబు అన్నారు. ఈ అంశపై రాష్ట్రం నిరసనను తెలియజేస్తూ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే కేంద్ర విద్యామంత్రికి లేఖ రాసారని తెలిపారు. రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి, తమ అభిప్రాయాల ప్రకారం ముసాయిదాలో మార్పులు చేసేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని వెల్లడించారు.



# సింగరేణిలో బంపర్ ఆఫర్

### కార్మికులకు స్పెషల్ ఇన్‌సెంటివ్

### బొగ్గు ఉత్పత్తి పెంచేందుకు కీలక నిర్ణయం

### మార్చి నెలాఖరు వరకే ఈ అవకాశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు సింగరేణి యాజమాన్యం కార్మికులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. సింగరేణి సంస్థ నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను అధిగమించేందుకు స్పెషల్ ఇన్సెంటివ్ పథకాన్ని ప్రవేశ పెడుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 1వ తేదీ నుంచి మార్చి 31 వరకు రెండు నెలల పాటు ఈ పథకం అమలు ఉంటుందని పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి 31 నాటికి నిర్దేశిత లక్ష్యం 57.59 మిలియన్ టన్నులకు గాను 53.73 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించింది. ఇప్పటి వరకు ఏర్పడిన 3.86 మిలియన్ టన్నుల లోటును భర్తీ చేయడంతోపాటు ఫిబ్రవరి, మార్చి నెలల్లో 18.27 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో దీన్ని అధిగమించేందుకు ఇన్సెంటివ్ ప్రకటించింది. ఈ ప్రోత్సాహకాలను కార్మికులు పొందాలంటే తప్పనిసరిగా ఈ నెల, మార్చి నెలల్లో ప్రతి నెలా 22 మస్టర్లు పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే నెలకు 20 వేల టన్నుల కంటే ఎక్కువగా బొగ్గు ఉత్పత్తి లక్ష్యం ఉన్న భూగర్భ గనులను 1వ కేటగిరీగా, అంతకంటే తక్కువగా ఉండే గనులను 2వ కేటగిరీగా విభజించారు.

స్పెషల్ ఇన్సెంటివ్ పథకాన్ని రెండు కేటగిరీలుగా విభజించారు. మొదటి కేటగిరీలో ప్రొడక్షన్‌లో ఏరియా లక్ష్యం, రెండో కేటగిరీలో గని లక్ష్యాన్ని అధిగమిస్తే ఆ కార్మికులకు నగదు పారితోషికాలు అందుతాయి. ఇందులో భాగంగా మొదటి కేటగిరీలో 100 నుంచి 104 శాతం వరకూ ఉత్పత్తి సాధిస్తే వారికి రూ.1500, 105 నుంచి 109 శాతం వరకు సాధిస్తే రూ.2 వేలు, ఇంకా 110 శాతం కంటే ఎక్కువగా సాధిస్తే రూ.2,500 ఇన్సెంటివ్ లను అందజేస్తారు. ఇక రెండో కేటగిరీలోనూ 100 నుంచి 104 శాతం ఉత్పత్తి సాధిస్తే రూ.1,200, 105 నుంచి 109 శాతం సాధిస్తే రూ.1,700, 110 శాతాన్ని అధిగమించి సాధిస్తే రూ.2,200 కార్మికులకు ఇస్తారు. మిగతా ఏ కారణాలతోనైనా విధులకు గైర్హాజరైన వారిని మాత్రం పరిగణనలోకి తీసుకోరు. సింగరేణి పరిధిలోని 11 ఏరియాలలోని భూగర్భ, ఉపరితల గనులతోపాటు బొగ్గు రవాణా చేసే సీహెచ్‌పీ, సీఎస్‌పీల్లో పనిచేసే కార్మికులందరికీ ఈ పథకం వర్తింపజేయనున్నట్లు సింగరేణి యాజమాన్యం వెల్లడించింది.

## మే 4న నీట్ పరీక్ష(యుజి) నోటిఫికేషన్ జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 7:** దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎంతగానో ఎదురుచూస్తున్న యుజి నీట్ షెడ్యూల్ విడుదలైంది. మే 4న నీట్ పరీక్ష(యుజి) నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు మార్చ్ 7 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. మార్చ్ 9న తప్పుల సవరణకు అవకాశం ఇవ్వనున్నారు. జనరల్ కేటగిరీ- రూ.1700, ఇడబ్ల్యుఎస్,ఓబీసీ- రూ.1600,ఎస్సీ,ఎస్టీ,పిడబ్ల్యుడి-రూ.1000 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. విదేశాల్లో ఉన్నవారు రూ.9500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

## రూ.15వేల కోట్ల నిధుల కోసం కృషిచేయండి

### ఎంపిలకు డిప్యూటీసిఎం భట్టి విక్రమార్క దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 7:** కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన రూ.15వేల కోట్ల నిధులు వచ్చేలా కృషిచేయాలని పార్లమెంటు సభ్యులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్కమార్క దిశానిర్దేశం చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ లో సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్‌కు అన్ని రాష్ట్రాలకు కలిపి రూ.5.50లక్షల కోట్లు రావాల్సి ఉందని, అందులో తెలంగాణకు రావాల్సిన వాటా నిధులు రూ.15వేల కోట్లు ఉన్నాయని ఎంపీలకు తెలిపారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో అందుబాటులోవున్న ఎంపీలతో సమావేశం నిర్వహించారు. కేంద్ర నుంచి రావాల్సిన పెండింగ్ నిధుల వివరాలపై వారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రధానంగా కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్య, పట్టణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖల నుంచి రాష్ట్రానికి నిధులు రావాల్సి ఉందని ఎంపీలకు ఉప ముఖ్యమంత్రి వివరించారు. అదే విధంగా కేంద్రం నుంచి రావాల్సిన పెండింగ్ పనులు, నిధులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన బుక్‌లెట్‌లను ఎంపీలకు ఈ సందర్భంగా అందజేశారు. ఎంపీలు మల్లు రవి, రామ సహాయం రఘురామిరెడ్డి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్, అనిల్‌కుమార్ యాదవ్, కడియం కావ్యలతో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ పాల్గొన్నారు.

## నగరం నడిబొడ్డున కలిస్తే సీక్రెట్ ఎలా అవుతుంది?

### జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**హైదరబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** నగరం నడిబొడ్డున అందరం ఒకచోట కలిస్తే అది స్రీకెట్ మీటింగ్ ఎలా అవుతోందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి స్పందించారు. మా నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలపై అంతా ఒకచోట కూర్చొని మాట్లాడుతుకున్నామని ఆయన స్పష్టం చేశారు. ఆయా సమస్యలపై ముఖ్యమంత్రికి లిఖితపూర్వకంగా రాసి ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాల కాలం తరువాత మా పాలమూరు జిల్లా నుంచి రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని ఆయనకు ఎల్లప్పుడు పిల్లర్లలాగ ఉంటామని తెలిపారు.

జడ్చర్ల చుట్టుపక్కల ఉన్న వేలాది భూధాన్ భూములన్నీ గత ప్రభుత్వంలోని నాయకులు ధరణి పేరుతో కొట్టేశారని ఆయన ఆవేదన చెందారు. దళితులకు ఎస్టీలకు ఎస్సీలకు ఈ విషయంలో న్యాయం జరిగేవరకు నేను పోరాటం చేస్తానని అనిరుద్‌రెడ్డి ఖరాఖండిగా తెలిపారు. ఇటీవల రాష్ట్రంలోని అధికార పార్టీకి చెందిన పదిమంది ఎమ్మెల్యేలు సమావేశం కావడం సంచలనం రేపింది. ఢిల్లీ అధినాయకత్వం కూడా ఈ సమావేశంతో ఒక్కసారి ఉలిక్కి పడింది. ఓ మంత్రి వ్యవహారం నచ్చకనే హోటల్‌లో రహస్యంగా సమావేశమైనారని జోరుగా చర్చ దేశవ్యాప్తంగా సాగుతోన్నది.

## వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికత

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** వ్యవసాయరంగంలో నూతన సాంకేతికతను పరిచయం చేయాలనే ఆలోచనతో తమ ప్రభుత్వం పని చేస్తుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అందుకు అగుణంగానే సబ్సిడీలపై నూతన యంత్రాలను అందిస్తున్నామన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన అగ్రి షో లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగంలో డ్రోన్లు, రోబోల ఉపయోగాలను పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. అందుకోసం ఇలాంటి కిసాన్ అగ్రి షో కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. రైతాంగం, వ్యవసాయ పరిశ్రమ, నూతన సాంకేతికతలను ఒకే వేదికపైకి తెచ్చే విధంగా కిసాన్ అగ్రి షో ఉపయోగపడుతుందని చెప్పారు. కిసాన్ అగ్రి షోలు కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయకుండా, ఉమ్మడి జిల్లా కేంద్రాలలో కూడా నిర్వహించే విధంగా చూడాలని దీంతో రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ విభాగాలను కలిపి రైతులకు సేవలు త్వరితగతిన అందేలా చర్యలు చర్యలను తీసుకోవాలన్నారు. అంతేకాకుండా బాంబో (వెదురు) మిషన్‌లో గిరిజన రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి రాష్ట్ర రైతుల అభివృద్ధి కోసం అనేక రకాల సబ్సిడీలను, అనేక విధానాలను, మరెన్నో అవకాశాలను అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా వ్యవసాయ యాంత్రీకరణ, సన్నధాన్యానికి బోనస్, రుణమాఫీ, రైతు భరోసా, నిరంతర శిక్షణ కార్యక్రమాలు వంటివి నిర్వహిస్తు, దాదాపు 40,000 కోట్ల నిధులను రైతులకు నేరుగా చెల్లించామని వివరించారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు, ఆదాయాన్ని పెంపొందించేందుకు వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికతలు మరియు వినూత్న ఆవిష్కరణలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ రఘునందన్ రావు, డైరెక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.




## లివ్ ఇన్ ఎ హెల్దీస్పేస్ డిజైన్ కాంటెస్ట్‌లో గ్లోబల్ లీడర్‌గా నారాయణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన, నాసా ప్రోత్సహించిన నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లివ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్ డిజైన్ కాంటెస్ట్ 2024లో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. వరల్డ్ నెం. 1 స్థానంలో 4 సెలక్షన్స్ నారాయణ విద్యార్థులు దక్కించుకున్నారు. ఇండియాలో మరి ఏ ఇతర విద్యాసంస్థ ఇలాంటి అరుదైన రికార్డ్ సాధించలేదు. వరల్డ్ నెం. 2 స్థానంలో 13, వరల్డ్ నెం.3 స్థానంలో 9 సెలక్షన్స్‌తో పాటు 32 హానరబుల్ ప్రైజ్‌లను నారాయణ విద్యార్థులు కైవశం చేసుకున్నారని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ డా సింధూర నారాయణ, శరణ్ నారాయణ పేర్కొన్నారు. మొత్తంగా 58 ప్రాజెక్టుల్లో విజయకేతనం ఎగురవేసినట్లు తెలిపారు. 276 మంది నారాయణ విద్యార్థులు తమ ప్రతిభతో ఆకట్టుకున్నారన్నారు. మొత్తం విజేతల్లో నారాయణ విద్యార్థుల సక్సెస్ శాతం అంతర్జాతీయ స్థాయిలో 47.2 శాతం ఉండగా, జాతీయస్థాయిలో 65.9 శాతంగా ఉందన్నారు. ఈ ఘనవిజయంతో రాష్ట్ర స్థాయిలోనే కాకుండా, జాతీయ స్థాయిలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ నారాయణ విద్యార్థుల విజయ ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతోందన్నారు. నేషనల్ స్పేస్ సొసైటీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కాంటెస్ట్‌లో ప్రపంచవ్యాప్తంగా వేలాది విద్యాసంస్థల నుండి వందలాది ప్రాజెక్టులతో ఈ కాంపిటీషనల్లో పాల్గొంటాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా ప్రోగ్రామ్స్‌ను అమలుపరుస్తున్న ఏకైక స్కూల్ నారాయణ మాత్రమే అన్నారు. దీనికోసం సిట స్పార్క్, ఒలింపియాడ్, ఈటెక్నో, మెడిస్పార్క్ వంటి ప్రోగ్రామ్స్ శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ ప్రోగ్రామ్స్ కోసం ప్రత్యేకంగా అత్యున్నత స్థాయి మెటీరియల్స్ రూపొందించామన్నారు. దీని ద్వారా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో సింహాభాగం నారాయణ విద్యార్థులు విజయం సాధించటం అనవాయితీగా కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా నాసా లాంటి ప్రతిష్టాత్మక సంస్థ నిర్వహించే కాంటెస్ట్కు సృజనాత్మకతో కూడిన నూతన ఆవిష్కరణలు చేయాల్సి ఉంటుందన్నారు. దీని కోసం ఎంతగానో శ్రమించాల్సి ఉంటుందన్నారు. ప్రాథమిక దశ నుండే శాస్త్ర, సాంకేతిక అంశాలపై పరిజ్ఞానం పెంచుకోవటంతోపాటు, నూతన ఆవిష్కరణలు కనుగొనే దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఘనవిజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. పునిత్ ప్రత్యేకంగా అభినందించారు.

## కెటిఆర్‌కు మరో అరుదైన గౌరవం

### అమెరికాలోని నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీ నుంచి ప్రత్యేక ఆహ్వానం

### ఐబిసి-2025 సదస్సులో ముఖ్యఅతిథిగా ప్రసంగించాలని విజ్ఞప్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 7:** బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు మరో అరుదైన గౌరవం లభించింది. అమెరికాలోని ఇల్లినాయిస్ రాష్ట్రం, ఇవాన్ స్టన్ లో ఉన్న ప్రతిష్ఠాత్మక నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీలో ఏప్రిల్ 19న జరిగే కెల్లాగ్ ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ 2025లో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించాలని ఐబీసీ వైస్ ప్రెసిడెంట్ చెనాక్షా గోరెంట్ల లేఖలో ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ పదేళ్లలో రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దిన తీరు ఎంతో స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా ప్రశంసించారు. టీ హబ్, టీ వర్క్స్, వీ హబ్ వంటి వినూత్న ఆలోచనల వల్ల తెలంగాణలో సరికొత్త స్టార్టప్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందిందని, ఇది దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచిందని గుర్తుచేశారు. ప్రపంచ ఇన్నోవేషన్ హబ్‌గా హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు సాధించడంలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని, తెలంగాణ వేదికగా భారత్‌లో పెరిగిన ఈ స్టార్టప్ ఎకో సిస్టమ్ గురించి, సాంకేతిక రంగంలో వస్తున్న ఈ విప్లవాత్మక మార్పుల గురించి మరింత తెలుసుకోవాలని అమెరికాలోని బిజినెస్ స్కూల్ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రపంచ దిగ్గజ కంపెనీలు తెలంగాణకు వచ్చి పెట్టుబడులు పెట్టేలా వారిని కేటీఆర్ మెప్పించి ఒప్పించిన తీరు అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఈ డిజిటల్ యుగంలో యువతకు హైదరాబాద్‌ను ఉపాధి అవకాశాల గనిగా తీర్చిదిద్దడం అద్భుతమన్నారు. అలాగే ఔత్సాహికులైన యువతీ యువకులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కేటీఆర్ వేసిన ప్రణాళికలు కూడా తెలంగాణలో గొప్ప ఫలితాలు సాధించాయన్నారు. పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించడం ద్వారా కేటీఆర్ గత పదేళ్లలో రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కూడా బంగారు బాటలు వేశారని అభినందించారు. స్వల్ప కాలంలోనే కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి సాధించడానికి కేటీఆర్ తీసుకున్న అనేక నిర్ణయాలు ఎంతో కీలకపాత్ర పోషించాయని గుర్తుచేశారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రిగా దశాబ్దకాలంలో రూపొందించిన ప్రణాళికలు, సాధించిన విజయాల తాలూకా అనుభవాలను విద్యార్థులకు వివరించాలని లేఖలో విజ్ఞప్తిచేశారు. సుస్థిర అభివృద్ధికి ఎలా, పునాదులు వేయాలో, పరిపాలనలో సాంకేతికతను జోడించి, మెరుపు వేగంతో ఎలా మెరుగైన ఫలితాలు సాధించాలో సూచనలు చేయాలని కోరారు.. కేవలం తమ విద్యార్థులకే కాకుండా, సదస్సుకు హాజరయ్యే యువ పారిశ్రామికవేత్తల్లో కూడా కేటీఆర్ ప్రసంగం స్ఫూర్తి నింపడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు..

## వర్సిటీ ప్రొఫెసర్ల వయోపరిమితి 65 సంవత్సరాల పెంపును విరమించుకోవాలి

### ఉన్నత విద్యామండలికి తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరమ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పెంచిన ప్రొఫెసర్ల వయోపరిమితిని ఉపసంహరించుకోవాలని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరమ్(టీజీఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు టీజీఎఫ్ నాయకులు పల్లా ప్రవీణ్ రెడ్డి, డాక్టర్ వలమల్ల కృష్ణ శుక్రవారం ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డికి విజ్ఞప్తి చేశారు. విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ల వయోపరిమితి 65 సంవత్సరాల పెంచడాన్ని విరమించుకోవాలని కోరారు. యూనివర్సిటీలలో పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత సాధించిన వారు ఎంతో కాలంగా ప్రొఫెసర్ల ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. పీహెచ్‌డీలు పూర్తి చేసిన నిరుద్యోగుల పాలిట 65 సంవత్సరాల వయోపరిమితి పెంపు.. వారి పాలిట శాపంగా మారిందన్నారు. ప్రొఫెసర్ల వయోపరిమితి 65 సంవత్సరాలు పెంచడం వలన కొత్త ఉద్యోగాల నోటిఫికేషన్ ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందని.. కాబట్టి వెంటనే ఆ జీవోను వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 2000 పైచిలుకు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## 'కెటిఆర్ వంగివంగి దండాలు.. కేసుల నుంచి తప్పించుకోవడానికి' : టి.కాంగ్రెస్

**హైదరబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఇ-రేస్ కేసు నుంచి తప్పించుకోవడానికేనా ఢిల్లీలో వంగి వంగి టిల్లు దండాలు అంటూ కాంగ్రెస్ ఎక్స్‌వేదికపై ట్వీట్ చేస్తూ ఎగతాళి చేసింది. అందితే జుట్టు అందకపోతే కాళ్ళు నీ కుతంత్రం వాళ్ళకు తెలిసినట్టుందని అందుకే కేంద్రమంత్రులు అమిషా జెపి నడ్డా అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదంట కదా అని ఎకసెక్కాలు చేస్తూ ట్వీట్ చేశారు. అంతేగాక ఢిల్లీ వెళ్ళి ఎవరినీ కలవకపోతే ఇజ్జత్ పోతుందనేగా నీ నాటకాలు అని యూజిసి అతంటున్నావ్ రోడ్లంట్లున్నావ్,బిడ్డిలు అంటున్నావ్ అని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఏందయ్య కెటిఆర్ ఢిల్లీలోనా నీ పగటి వేశాలు అని వ్యాఖ్యలు చేసింది.

## మస్తాన్‌సాయి కేసులో రంగంలోకి దిగిన టి.నాబ్

### విడియోలు, డ్రగ్స్‌సేవిస్తున్న వారి వివరాల సేకరణ.. అందరికి నోటీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** యూట్యూబర్ మస్తాన్‌సాయి వ్యవహారంలో తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో (టి.నాబ్) పోలీసులు రంగంలో దిగారు. లావణ్య అనే యువతి ఫిర్యాదు మేరకు మస్తాన్ సాయిని నార్సింగి పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. రిమాండులో వున్న ఇతన్ని కస్టడీలోకి తీసుకుని విచారించాలని ఒవైపు పోలీసులు నిర్ణయించగా ఇదే సమయంలో ఇతని హార్డ్ డిస్క్‌లో పదుల సంఖ్యలో మహిళలు, యువకులు డ్రగ్స్ తీసుకుంటూ అశ్లీలంగా నృత్యాలు చేస్తుండడంపై టి.నాబ్ తీవ్రంగా పరిగణించింది. మస్తాన్ సాయి వద్ద లభించిన వీడియోలో వున్న యువతీ, యువకులు ఎవరు...? వారంతా ఎక్కడ పార్టీ చేసుకున్నారు... ? ఒకవేళ తెలంగాణలో ఈ పార్టీ జరిగితే దానికి సంబంధించి వీరందరిని విచారించేందుకు టి.నాబ్ నిర్ణయించింది. ముందుగా అందరి వివరాలను సేకరించే పనిలో టి.నాబ్ నిమగ్నమయ్యింది. ఆ తరువాత వీరికి నోటీసులు ఇచ్చి విచారించాలని భావిస్తోంది. ఒకవేళ మస్తాన్ సాయి నిర్వహించిన పార్టీ ఎపిలో జరిగివుంటే దీనిపై ఆ రాష్ట్ర పోలీసులకు సమాచారం అందించేందుకు టి.నాబ్ నిర్ణయించింది. మస్తాన్ సాయి వద్ద వున్న వీడియోలో అనేకచోట్ల పార్టీలు జరిగినట్లు వుండడంతో ఇందులో ఒకటి రెండయినా తెలంగాణలో జరిగి వుండవచ్చని టి.నాబ్ అధికారులు భావిస్తున్నారు. ఈ విషయంలో మస్తాన్ సాయిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్న సమయం లో తమ బృందాన్ని కూడా పంపి డ్రగ్స్‌కు సంబంధించిన వివరాలను సేకరించాలని టి.నాబ్ అధికారులు భావిస్తున్నారు. మస్తాన్ సాయికి తరచూ డ్రగ్స్ సేవించే అలవాటు వుండడంతో అతనికి సంబంధించిన వ్యక్తులు హైదరాబాద్‌లో కచ్చితంగా వుండి వుంటారని భావిస్తున్న టి.నాబ్ అధికారులు ఈ విషయంలో మరింత సమాచారానికి టాస్క్‌ఫోర్స్ సహకారాన్ని తీసుకోనున్నారు.

# 'తండేల్' అంచనాలకు మించి సర్ ప్రైజ్ చేస్తుంది

## -హీరో నాగచైతన్య



**యువ సామ్రాట్** అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. భారీ అంచనాలు వున్న ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగావిడుదల కానుంది. ఈ సందర్భంగా టీం ప్రీరిలీజ్ క్యూ అండ్ ఏ ప్రెస్ మీట్ నిర్వహించింది.

**చైతన్య మీ సినిమా పై చాలా అంచనాలు వున్నాయి. ఈ సినిమా కోసం ఫ్యాన్స్‌కి ఏం చెబుతారు?**
మేమంతా సినిమాచూశాం. చాలాపాజిటివ్‌గా హ్యాపీగా వున్నాం. చివరి ముప్పై నిముషాలు సినిమా పీక్స్‌లో వుంటుంది. అంచనాలుకు మించి సర్ ప్రైజ్ చేస్తుంది. ఈ పాలి యేట గురితప్పేలేదు. రేపొద్దున్న రాజులమ్మ జాతరే.

**చైతన్య మీ నాన్న సినిమా చూశారా?**
నాన్న సినిమా చూశారు. ఆయనకి చాలా నచ్చింది. ఆయన డేట్స్ తెలుసుకుంటున్నాం. సక్సెస్ మీట్‌కి తీసుకువెళ్తాం.

**అరవింద్ మీరు ఈ సినిమా కథ ముందు విన్నప్పుడు కొన్ని మార్పులు చెప్పారట?**
ముందు కథ విన్నప్పుడు ఫస్ట్ హాఫ్ అదిరిపోయింది. సెకండ్ హాఫ్ డాక్యుమెంటరీ నేచర్‌లో వుంది. అందుకని కథ కొని రైటర్ డైరెక్టర్‌కి ఇస్తే బావుంటుదని అనుకున్నాం. అలాగే జైలుకి వెళ్ళిన 30మందిని స్వయంగా కలిసి వారి నుంచి రైట్స్ తీసుకున్నాం.

**అరవింద్ ఈ సినిమా స్వయంగా మీరే రిలీజ్ చేయడానికి కారణం?**
మా కంట్రోల్ లేని ఏరియాల్లో బయటికి ఇస్తాం తప్పితే మిగతా అంతా మేమే రిలీజ్ చేస్తాం, లాభం, నష్టం మేమే భరించడం గీతఆర్ట్స్ పాలసీ. మేముతీసిన సినిమా మీద మాకు నమ్మకం. మేము అనుకున్న దానికంటే ఈ సినిమాకి ఎక్కువ ఖర్చు అయ్యింది. వాసు వచ్చి అమ్మేద్దామా అన్నారు. ఏం పర్వాలేదు మనమే రిలీజ్ చేస్తున్నామని చెప్పా. తండేల్‌లో మోస్ట్ సర్ ప్రైజ్ చైతు పెర్ఫార్మెన్స్. సినిమా సూపర్ హిట్. నేను 4.5 స్టార్స్ ఇస్తాను. రేపు మార్నింగ్ దుల్లకొట్టేద్దాం.

**చందు..ఇది జరిగిన కథ. స్క్రీన్ ప్లే పరంగా ఎలాంటి ఛాలెంజ్ వచ్చింది ?**
ఈ ప్రేమకథలోని బ్యూటీ దూరం, ఎడబాటు. తొమ్మిది నెలలు ఓ మనిషి కోసం ఎదురుచూపు, ఆ మనిషి తనకోసం వస్తాడనే నమ్మకం.. ఇలా చాలా బ్యూటీఫుల్ ఎమోషన్ ఈ సినిమాలో వుంది.

**చందు,చైతు సాయిపల్లవి ఈ ఇద్దరిలో ఎవరి పెర్ఫార్మెన్స్ బావుటుంది?**
ఈ సినిమా చూసి బయటికి వచ్చిన తర్వాత ఎవరు బాగా చేశారనే డిబేట్స్ వుంటాయి. నన్ను అడిగే రాజు పాత్ర అని చెబుతా.

**చందు.. ఇందులో వుండే ఎమోషన్ మణిరత్నం రోజా సినిమా అనిపించాయి ?**
మీకు అలా అనిపించిందంటే ఐయాం సో హ్యాపీ. అందులో ఎమోషన్ కూడా వుండి అంతకు మించి వుంటాయి.

**చైతు..ఈ సినిమాలో మీరు ఫీలైన ఎమోషన్ ఏమిటి?**
ఈ సినిమా ప్యూర్ లవ్ స్టోరీ. రాజు సత్య ప్రేమ తర్వాతే ఏదైనా. ఈ సినిమాలో డ్యాన్స్ పరంగా పల్లవి నేను లవ్ స్టోరీకంటే ఒక స్టెప్ పైకివెళ్లాం. శివుని పాట థియేటర్స్‌లో మీరు చాలా బాగా ఎంజాయ్ చేస్తారు.

**అరవింద్ అప్పట్లోనే 45 కోట్లు పెట్టి మగధీర సినిమా తీశారు ఇప్పుడు వందల కోట్లు పెట్టి సినిమాలు చేస్తున్నారు ? ఇంత ధైర్యం ఎలా వస్తోంది?**
అప్పటికి 40 కోట్లు ఈ రోజు ద్రవ్యోల్బణం తీసుకుంటే సుమారు 350 కోట్లు అవుతుంది. ఈ రోజుల్లో ఇంత బడ్జెట్‌తో సినిమాలు అందరూ తీస్తున్నారు. ఈ రోజు తెలుగు సినిమా నిర్మాత అంటే తలెత్తి చూస్తున్నారు. దీనికి కారణం అలాంటి సినిమాలు చేయగల హీరోలు, దర్శకులు తెలుగులో వున్నారు. ఇది తెలుగు వారి విజయం. గీత ఆర్ట్స్ పై రానున్న రోజుల్లో మచ్ బిగ్గర్ ఫిలిమ్స్ వస్తాయి. లిరిక్ రైటర్ శ్రీమణి మాట్లాడుతూ, సినిమా పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. ఆజాది పాట కూడా అద్భుతంగా వుంటుంది. సాహిత్యానికి గొప్ప స్థానం వున్న సినిమా ఇది. ఖచ్చితంగా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను అన్నారు.

## 'డాన్ బోస్కో' చిత్రీకరణ ప్రారంభం..



**సైమా అండ్ ఎహెచ్ఎం** అవార్డులలో ఉత్తమ డెబ్యూటెంట్ ప్రొడక్షన్ హౌస్ అవార్డును అందుకున్న ఎమర్జింగ్ ప్రొడక్షన్ హౌస్ లౌక్య ఎంటర్టైన్మెంట్స్, శ్రీ మాయ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పనేని, శైలేష్ రామ నిర్మిస్తున్న మూవీ "డాన్ బోస్కో. కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమాకు పి.శంకర్ గౌరి దర్శకత్వం వహిస్తున్నారు. శుక్రవారం పూజా కార్యక్రమాలతో మూవీ చిత్రీకరణ ప్రారంభమైంది. ముహూర్తం షాట్‌కు నిర్మాత సాహు గారపాటి కెమెరా స్విచ్ ఆన్ చేయగా ..చుక్కపల్లి సురేష్ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా మూవీ టైటిల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదలచేశారు. పోలీస్ స్టేషన్ లోని మోస్ట్ వాంటెడ్ బోర్డు ఇంట్రెస్టింగా ఉంది. ప్రిన్సిపాల్ విశ్వనాథ్‌గా మురళీశర్మ కీలక పాత్ర పోషిస్తున్నారు. లెక్చరర్ సుమతిగా మిర్నా మీనన్ నటిస్తున్నారు.'డాన్ బోస్కో అనే టైటిల్‌ను ఖరారు చేయగా.. 'వెల్‌కమ్ టు ది క్లాస్ రీయూనియన్‌బ్యాచ్ 2014, 'అన్ని రీయూనియన్లు జ్ఞాపకాల కోసం కాదు; కొన్ని విముక్తికి సంబంధించినవి' అంటూ పోస్టర్‌పై రాసిన క్యాప్షన్ ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## 15 న తలసేమియా బాధితులకు సహాయార్థం
# ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్



**తలసేమియా** బాధితుల కోసం ఈ నెల 15న మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసాము. ప్రతి టికెట్‌పై వచ్చే రూపాయి తలసేమియా బాధితులకు అందిస్తాం. అడియన్స్ ఖర్చు చేసిన ప్రతి ఒక్క రూపాయి తిరిగి సమాజ సేవకే ఉపయోగపడుతుంది అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి. ఎన్టీఆర్ ట్రస్ట్ అధ్వర్యంలో ఫిబ్రవరి15న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఎన్టీఆర్ ట్రస్ట్ యూఫోరియా మ్యూజికల్ నైట్ షో జరగనుంది.

ఈ సందర్భంగా జరిగిన ప్రెస్ మీట్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి మాట్లాడుతూ, సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే స్ఫూర్తితో ఎన్టీఆర్ ట్రస్ట్ నడుస్తుంది. జెనిటిక్ డిసార్డర్ తలసేమియాతో చాలామంది పిల్లలు, పెద్దలు బాధపడుతున్నారు. ఈ వ్యాధి వున్న వారు ఊపిరి పీల్చుకోవడానికి కూడా ఇబ్బంది పడుతుంటారు. ఇది తీవ్రంగా వచ్చినప్పుడు రక్త మార్పిడి వెంటనే జరగాలి. దీనికి చాలా రక్తం అవసరం. బ్లడ్ డొనేట్ చేస్తే చాలా మంది జీవితాలు నిలబడతాయి. తలసేమియా బాధితుల కోసం ఈ నెల 15న మ్యూజికల్ నైట్ ఏర్పాటుచేసాము. ప్రతి టికెట్‌పైవచ్చే రూపాయి తలసేమియా బాధితులకు అందిస్తాం. తమన్ కూడా ఒక్క నిమిషం ఆలోచించకుండా వెంటనే మ్యూజికల్ నైట్‌కి వస్తా అన్నారు. తమన్ ఈ షో ఫ్రీగా చేస్తా అని గొప్ప హృదయంతో చెప్పారు. సమాజ సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరు చేయాలి. మనం వెళ్ళేటప్పుడు మన వెంట డబ్బు రాదు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తే అందరికి గుర్తు ఉంటుంది. ప్రతి ఒక్కరు కొనే టికెట్ సమాజ సేవకే ఉపయోగపడుతుంది, బుక్ మై షోలో టికెట్స్ అవైల్ బుల్‌గా వుంటాయి. ప్రతి ఒక్కరూ టికెట్ కొనుక్కొని కుటుంబ సమేతంగా వచ్చి ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను. ఆడియన్స్ ఖర్చు చేసిన ప్రతి ఒక్క రూపాయి తిరిగి సమాజ సేవకే ఉపయోగపడుతుంది అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ, చాలా మంచి ఆలోచనతో మొదలైన కార్యక్రమం ఇది. ఈ షో నేను చేయడం చాలా సంతోషంగా ఉంది. నారా భువనేశ్వరి గారి ఆలోచన చాలా గొప్పది. తలసేమియా బాధితులకు సహాయం కోసం అని చెప్పగానే నేను వెంటనే ఈ కార్యక్రమంకి వస్తా అని చెప్పాను. భువనేశ్వరి నాపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద కార్యక్రమం నా చేతిలో పెట్టారు. ఎపి సిఎం చంద్రబాబు రాష్ట్రం కోసం పగలు రాత్రి పని చేస్తున్నారు. టికెట్‌పై పెట్టె ప్రతి రూపాయి తలసేమియా భాదితులకు వెళ్తుంది. ఈ షో చేయడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. ఈ షోని సూపర్ సక్సెస్ చేసే బాధ్యత మన అందరిపై వుంది. ఇది బిగ్గెస్ట్ షో కాబోతోంది అన్నారు .




# '3 బిహెచ్‌కె' ఫస్ట్ లుక్ టైటిల్ టీజర్ రిలీజ్



**సిద్ధార్థ్ హీరోగా** గణేష్ దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ తెరకెక్కుతోంది. బ్లాక్ బస్టర్ హిట్ చిమావీరన్ష్ నిర్మాత అరుణ్ విశ్వశాంతి టాకీస్‌పై తెలుగు తమిళ్‌లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ రోజు సినిమా ఫస్ట్ లుక్ టైటిల్ టీజర్‌ని రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి 3 బిహెచ్‌కె అనే ఇంట్రస్టింగ్ టైటిల్ పెట్టారు. సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని బ్యూటీఫుల్ ఫ్యామిలీగా కనిపించిన ఫస్ట్ లుక్ పోస్టర్ పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేసింది. 'ఇది మన ఇంటి కథ ఈ ఇంట్లోనే చిన్న చిన్నగా చాలా కథలు వున్నాయి. ఇది మసాల డబ్బా కాదు. అమ్మచిన్న బ్యాంక్. ఇది నాన్న సెంటిమెంటు బీరువా' అంటూ సిద్ధార్థ్ వాయిస్‌తో మొదలైన టైటిల్ టీజర్ ఫీల్ గుడ్ మూమెంట్స్‌తో చాలా క్యురియాసిటీని పెంచింది. సిద్ధార్థ్ కూల్ అండ్ చార్మ్‌లుక్‌తో ఆకట్టుకున్నారు. శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు ప్రజెన్స్ కూడా అలరించింది. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా రూపొందుతోందని టీజర్ చూస్తే అర్థమోతోంది.

## దినేష్‌మహీంద్ర దర్శకత్వంలో ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ!



**ఎన్.శంకర్..** ఈ పేరు వినగానే అందరికి శ్రీరాములయ్య, ఎన్‌కౌంటర్, జయం మనదేరా, భద్రాచలం, జై భోలో తెలంగాణ వంటి సంచలన విజయాలు సాధించిన చిత్రాలు మన కళ్ల ముందు మెదులుతాయి. అప్పట్లో ఈ చిత్రాలు ఎలాంటి ప్రేక్షకాదరణ పొందాయో అందరికి తెలిసిందే. తాజాగా ప్రముఖ దర్శకుడు ఎన్.శంకర్ తనయుడు దినేష్‌మహీంద్ర తండ్రి బాటలో దర్శకత్వ ప్రతిభను నిరూపించుకోవడానికి రెడీ అయ్యాడు. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో దర్శకత్వ విభాగంలో శిక్షణ పొంది, స్క్రీన్‌ప్లే విషయంలో పలు కోర్సులను పూర్తిచేశాడు దినేష్‌మహీంద్ర. త్వరలోనే దినేష్‌మహీంద్ర దర్శకత్వంలో ఓ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ రూపుదిద్దుకోబోతుంది. నూతన తారలతో పాటు నూతన టెక్నిషియన్లను పరిచయం చేస్తూ యూత్‌ఫుల్ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీగా రూపొందనున్న ఈ చిత్రాన్ని 'ఆరెక్స్ క్రియేషన్స్' సంస్థ నిర్మిస్తుంది..షూటింగ్ ఏప్రిల్‌లో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పాటల రికార్డింగ్స్ జరుగుతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తారు.

## ఆద్యంతం ఆకట్టుకునేలా'లైలా' ట్రైలర్



**మాస్ కా దాస్** విశ్వక్ సేన్ నటించిన లేటెస్ట్ మూవీ 'లైలా'. ఈ సినిమాను దర్శకుడు రామ్ నారాయణ్ పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయ్యింది. విశ్వక్ సేన్ తొలిసారి ఈ సినిమాలో లేడీ గెటప్‌లో కనిపిస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు క్రియేట్ అయ్యాయి. సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో చేస్తున్న టీమ్ తాజాగా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఏ మాల్‌గా చాలా గ్రాండియర్‌గా నిర్వహించింది. ఈ ఈవెంట్‌లో ట్రైలర్ రిలీజ్ చేసి ఆడియన్స్‌లో మరింత హైప్ పెంచేసింది. ఈ ట్రైలర్ ఆద్యంతం ఫన్ రైడ్‌గా ఉంది. లేడీ పాత్రలో విశ్వక్ సేన్ చేసే అల్లరి థియేటర్లలో ప్రేక్షకులు పడిపడి నవ్వేలా చేస్తుందనడంలో సందేహం లేదు. అటు హీరోయిన్ ఆకాంక్ష శర్మ తన గ్లామర్ షోతో యూత్‌ను ఆకట్టుకోనుంది. లియోన్ జేమ్స్ సంగీతం మేజర్ అసెట్‌గా రానున్న ఈ సినిమాపై ఈ ట్రైలర్ అంచనాలను రెట్టింపు చేసింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ,ట్రైలర్ అందరికీ నచ్చిందని అనుకుంటున్నా. ట్రైలర్ బయటకు వచ్చింది కాబట్టి నాకంటే ట్రైలర్ ఎక్కువ మాట్లాడాలని అనుకుంటున్నా. ఫిబ్రవరి 14న అందరూ థియేటర్లలో కలుద్దాం. అని చెప్పారు. అనంతరం మీడియా అడిగిన ఆసక్తికర ప్రశ్నలకు టీమ్ సమాధానాలిచ్చారు.

**లైలా టార్గెట్ ఏంటి? ఎంటర్‌టైన్‌మెంట్‌యేనా?**
పూర్తిగా ఎంటర్‌టైన్‌మెంట్ ఉంది. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది.

**సినిమా సెన్సార్ అయింది కదా? రిపోర్ట్ ఏం వచ్చింది?**
నేను ఈ సినిమాలో లేడీ గెటప్ వేసింది ఎంటర్‌టైన్ చేయడానికి. మా ఇంటెన్షన్ కేవలం మిమ్మల్ని నవ్వించడమే. అందులో భాగంగానే కొన్ని డైలాగ్స్ ఉన్నాయి.

**విశ్వక్ ఈ సినిమాకు సంబంధించి మీకు కష్టమనిపించింది ఏంటి?**
సాయంత్ర పూట ఇంట్లో ఒక్కడినే ఉండడం కష్టం అయింది. ప్యాంట్, షర్ట్ వేసుకుని ఈ గెటప్‌లో బయటకు వెళ్లడం కుదరలేదు. ఈ గెటప్ కోసం రోజూ రెండు గంటలు పట్టేది.

**కామాక్షి ఈ సినిమాలో మీ రోల్ ఏలా ఉంటుంది?**
ఈ సినిమాలో నా క్యారెక్టర్ చాలా సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. అందుకే టీజర్, ట్రైలర్‌లో ఎక్కడా చూపించలేదు. కామాక్షి అంటే చాలా ఇంటెన్స్ రోల్స్ చేస్తుందనే మార్క్ ఉంది. ఆ మార్క్‌కు తగ్గట్లే ఇందులో నా పాత్ర ఉంటుంది. ఆ క్రెడిట్ అంతా డైరెక్టర్ రామ్ నారాయణ్‌దే.

**భానూ విశ్వక్ సేన్‌తో మీ ఎక్స్‌పీరియన్స్ ఎలా ఉంది?**
ఈ సినిమాలో అన్ని పాటలు నేను చేశాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన విశ్వక్‌కి థ్యాంక్స్. ఫస్ట్ సాంగ్ సోనూ మోడల్ పెద్ద హిట్ అయింది. అలాగే లాస్ట్ సాంగ్ కోయి కోయిని కూడా హిట్ చేశారు. ప్రతి సాంగ్ సందర్భానుసారం ఉంటుంది. సినిమా మొత్తం బ్లాక్‌బస్టర్‌గా ఉంటుంది.

## 'మోగ్లీ 2025' రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం



**తన తొలి చిత్రం** 'బబుల్ గమ్'తో అందరినీ ఆకట్టుకున్న రోషన్ కనకాల తనదైన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. సహజమైన నటన ఫ్రెష్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో అలరించిన రోషన్ ఇప్పుడు కథల ఎంపికలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాడు. ప్రస్తుతం ఆయన 'మోగ్లీ 2025' చిత్రంలో నటిస్తున్నారు. కలర్ ఫోటోతో జాతీయ అవార్డును గెలుచుకుని యంగెస్ట్ దర్శకుడిగా గుర్తింపు పొందిన సందీప్ రాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆసక్తికరమైన టైటిల్, ఫస్ట్ లుక్‌తో ఈ సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేపింది. విభిన్నమైన కథనాలకు పేరొందిన సందీప్ రాజ్ రోషన్‌ను కొత్త కోణంలో చూపించనున్నారని చిత్ర పరిశ్రమలో మంచి అంచనాలు ఉన్నాయి. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కాంటెంపరరీ లవ్ స్టోరీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై గిబి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ నెలలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

మోగ్లీ తర్వాత రోషన్ మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. 2025 రెండో అర్థభాగంలో ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. కథల ఎంపిక విషయంలో ఆయన చూపుతున్న చిత్తశుద్ధి సంఖ్య కంటే నాణ్యతను ప్రాధాన్యమిస్తూ సాగే ఆయన నిర్ణయాలు సినిమాపై ఉన్న ఆసక్తిని ప్రతిబింబిస్తున్నాయి. ప్రముఖ నటుడిగా ఎదుగుతున్న రోషన్ కనకాల ఒక్కొక్క అడుగుగా తనదైన ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంటున్నాడు. ప్రతీ చిత్రంతోనూ కేవలం వారసత్వాన్ని కొనసాగించడం కాదు తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును కూడా సొంతం చేసుకుంటున్నాడు.



## 'తెలుసు కద్దా' పోస్టర్ రిలీజ్

**స్టార్ బాయ్** సిద్ధు జొన్నలగడ్డ ఈరోజు తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు, ఈ సందర్భంగా ఆయన మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'తెలుసు కద్దా' నుండి ఒక బ్రాండ్ న్యూ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో సిద్ధు తన మోస్ట్ స్టైలిష్ అవతార్ లో అదరగొట్టారు.

బర్త్ డే స్పెషల్ పోస్టర్‌లో, సిద్ధు, శ్రీనిధి శెట్టి మధ్య రొమాంటిక్ మూమెంట్, మరో సైడ్ రాశి ఖన్నా నుదిటిపై ముద్దు పెడుతూ కనిపించారు. పోస్టర్ ఇద్దరు అమ్మాయిలతో హీరో ప్రేమకథను ప్రజెంట్ చేస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై క్యురియాసిటీని క్రియేట్ చేసింది.

ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన డైరెక్టర్‌గా పరిచయం అవుతున్న మూవీ 'తెలుసు కద్దా' పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వప్రసాద్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమాలో వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఈ చిత్రానికి జ్ఞానశేఖర్ బాబా సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. థమన్ ఎస్ సంగీతం సమకూరుస్తున్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న ప్రొఫెషనల్ నవీన్ నూలి ఎడిటర్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. శీతల్ శర్మ కాస్ట్యూమ్ డిజైనర్.

# మహిళలకు అల్లికల్లో శిక్షణ



ఏడు పదుల వయసంటే విశ్రాంతిని కోరుకుంటారు. కానీ ముంబయికి చెందిన చంద్రప్రభ పరిహార్ మాత్రం ఓ కొత్త ప్రయాణం మొదలుపెట్టారు. స్కూల్ రోజుల్లో సరదాగా టైలరింగ్ నేర్చుకుని తన చెల్లెళ్లకు గౌన్లు కుట్టారు. తర్వాత కాలేజీలో చేరడం, 19ఏళ్లకు పెళ్లి, కుటుంబ బాధ్యతలు. అప్పుడే తీరిక సమయాల్లో మ్యాగజీన్లు తిరగేస్తూ అల్లికలు నేర్చుకున్నారు. పిల్లలకు, మనవలూమనవరాళ్లకు స్వెట్టర్లు అల్లేవారు. 2022లో తన కూతురి కోరిక మేరకు తొలిసారి విభిన్నమైన క్రోషే బ్యాగు అల్లారు. అది కుటుంబసభ్యులకు ఎంతో నచ్చింది. దాన్ని చూసి తెలిసినవాళ్లు అలాంటిది కావాలని కోరారట. అలా వేరొకరికి అల్లడం, వాళ్లూ మెచ్చుకోవడంతో యూట్యూబ్లో చూస్తూ క్లిష్టమైన క్రోషే అల్లికల్ని నేర్చుకోవడం మొదలుపెట్టారు. ఏడాదిలో 60 రకాల ఉత్పత్తుల్ని తయారుచేశారు. ఈ క్రమంలో తన కోడలు స్వాతి సలహా, సహకారంతో వ్యాపారిగా మారి... నేహార్ (may-ber.com) పేరుతో సంస్థను ప్రారంభించి క్రోషే ఉత్పత్తుల అమ్మకాన్ని మొదలుపెట్టారు. మహిళలకు బ్యాగులు, జ్యువెలరీ, చిన్నారులకు స్వెట్టర్లు, బ్లాంకెట్లు అందిస్తున్నారు. గృహాలంకరణ విభాగంలోనూ కొన్ని ఉత్పత్తులు తెస్తున్నారు. వీటికి సోషల్ మీడియాలో ప్రచారం చేశారు స్వాతి. ఆస్ట్రేలియా నుంచి ఓసారి పెద్ద మొత్తంలో ఆర్డర్లు తీసుకున్నారు చంద్రప్రభ. సకాలంలో అందించడంతోపాటు, అవెంతో నచ్చడంతో వాళ్లు అప్పట్నుంచీ రెగ్యులర్‌గా తీసుకోవడం మొదలుపెట్టారు. ఈమె గురించి తెలుసుకుని మరో ఆరుగురు మహిళలు ఈవిడ దగ్గరే క్రోషే అల్లికల్లో శిక్షణ తీసుకోవడంతోపాటు, ఉపాధి పొందుతున్నారు. కాస్త ప్రోత్సాహం, చేయాలన్న కుతూహలం ఉండాలేకానీ, వయసు అడ్డంకికానే కాదంటారు చంద్రప్రభ. □

# పిల్లలకు పరీక్షల వేళ పోషకాహారం..

**'అమ్మా ప్లీజ్... నన్ను కదిలించకు... ఇప్పుడేం తినను' అని విసుక్కుంటుంది పదో తరగతి చదువుతోన్న అమ్మాయి. ఎన్ని సార్లు చెప్పాలమ్మా... పెరుగు తింటే నిద్రొస్తుందని అంటూ అమ్మమీద చిరాకుపడతాడు ఇంటర్ సెకండ్ ఇయర్‌లో ఉన్న శ్రీకర్. వీళ్లిద్దరే కాదు... ఇంట్లో పిల్లలున్న అమ్మలందరికీ ఇలాంటివన్నీ అనుభవమే. అసలే పరీక్షలు... తినకపోతే మరీ నీరసపడతారన్నది తల్లి ఆందోళన. దాంతో వాళ్లకిష్టమైనవేవో చేసి పెట్టేస్తుంటారు. కానీ అది సరికాదు. మామూలుగానే పిల్లలకు పోషకాహారాన్ని ఇవ్వాలి. ఇక, పరీక్షల వేళ మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. నిపుణులు.**



మనం రోజూ తినే ఆహారంలో కొన్ని పదార్థాలు గ్యాస్ట్రైటిస్‌ని పొట్టలో ఎప్పటికైనా కలిగిస్తాయి. నిద్ర, బద్ధకాలకి దారి తీస్తాయి. అలాగే కొన్ని పదార్థాలు మెదడును శక్తిని మార్చి అందిస్తే, ఏకాగ్రతని పెంచుతాయి. ఇంకొన్ని ఒత్తిడీ, ఆందోళనల్ని తగ్గిస్తాయి. కాబట్టి పరీక్షల ముందు పిల్లలకిచ్చే ఆహారంలో తల్లులు కొన్ని నియమాలను తప్పక పాటించాలి.

**నిర్ణీత వేళల్లోనే...** సెకండరీ స్కూలు స్థాయి నుంచి మాస్టర్స్ వరకూ. ఏ విద్యార్థికైనా పరీక్ష లంటే ఒత్తిడి ఉంటుంది. దాన్ని ఆహారంతో అధిగమించడం. కాబట్టి విద్యార్థులకు నిర్ణీత వేళల్లో ఆహారం ఇవ్వాలి. బ్రేక్ ఫాస్ట్ అస్సలు మిస్ చేయొద్దు. అలాచేస్తే రక్తంలో చక్కెర నిల్వలు తగ్గిపోయాయి. ఆలోచనాశక్తిమీద ప్రభావం పడుతుంది. పరీక్షల సమయంలో పిల్లలకు అధిక పిండి పదార్థాలతో కూడిన ఆహారం, నూనె వస్తువులు పెట్టొద్దు. వీటివల్ల అధిక నిద్ర గ్యాస్ట్రైటిస్ సమస్యలు వస్తాయి. పంచదార, ఉప్పు తగ్గించాలి. ప్రాసెస్డ్, జంక్, ఫాస్ట్, ప్యాకేజ్డ్ ఫుడ్స్ ఇవ్వొద్దు. పిజ్జా, బర్గర్, వడాపావ్, సమోసా... వంటి క్రేవింగ్స్ దూరంగా ఉంచాలి. ఇవి జీర్ణశక్తిని తగ్గిస్తాయి. ఏకాగ్రతనూ దెబ్బతీస్తాయి. మైదా, వెన్న, పంచదారతో చేసిన బేకరీ పదార్థాలూ స్వీట్లూ పూర్తిగా మానేయాలి. వాటిలోని కొవ్వులు, తీపి వల్ల ఆ క్షణానికి హుషారుగా అనిపించినా మెదడు కణాలు నిస్తేజంగా మారతాయి. కానీ



మనదేశంలో ఒత్తిడి కారణంగా మామూలుగా కన్నా పరీక్షల సమయం లోనే 30 శాతం ఎక్కువ జంక్, ప్రాసెస్డ్ ఫుడ్స్ తింటారట. దానితో అధ్యయనం, జ్ఞాపకశక్తి సామర్థ్యాలు తగ్గిపోవడంతో పాటు భవిష్యత్తులో ఊబకాయం, హృద్రోగాల బారినపడుతున్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి. నిద్ర రాకుండా పిల్లలకు టీ, కాఫీ ఇస్తుంటారు కొందరు. బదులుగా తాజా పండ్లూ పండ్లరసాలూ ఇవ్వొచ్చు. కాఫీ, టీల అలవాటు ఉంటే కప్పు వరకూ తాగనివ్వొచ్చు. శీతల పానీయాలు ఆనారోగ్యాలకు దారితీస్తాయి. వాటిని మానిపించడమే మంచిది. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే ముడిధాన్యాలతో చేసిన పోహా, రాగి దోసె, ఇడ్లీ... నిలువు పెట్టాలి. ఇవి వద్దు అంటే పిల్లలకోసం ఓట్స్, చక్కెర శాతం తక్కువగా ఉన్న మ్యూజిలీ... ఇవ్వొచ్చు. ఇవయితే రక్తంలో చక్కెరల్ని కొంచెంకొంచెంగా వదిలేశారు. ఉప్మా, పోహా, ఇడ్లీ.... వంటివే బ్రేక్‌ఫాస్ట్‌గా ఇచ్చేటటు వంటి వాటిని కూరగాయలు, ఆకుకూరలతో కలిపి వండాలి. ఓట్లు గాని ఇస్తే అందులో కొన్ని రకాల పండ్లముక్కలు, డ్రైఫ్రూట్స్ జోడిస్తే మేలు. వీటితోపాటు పచ్చసొనతోసహా గుడ్డు. గ్లాసు పాలు ఇస్తే ప్రొటీన్ అందుతుంది. టొండిమిల్క్ చాలు, రోగనిరోధకశక్తి పెరుగుతుంది.

**భోజనంలో...** కూరగాయలు, పప్పులతో చేసిన కిచిడీ, చపాతీ, పప్పు, పన్నీర్, వెజిటబుల్ కర్రీ లేదా సాంబాడా ఒకటిరెండు కూరలతో అన్నం పెట్టాలి. ఆకుకూరలు, కూరగాయలు విధిగా ఉండాలి. లేదా వీటినే చపాతీలో కలిపి చేయొచ్చు. పెరుగు తప్పనిసరి. ఇది ప్రొబయాటిక్ కావడంతో గ్యాస్ట్రైటిస్, తేన్పులు, పొట్టలో ప్రస్తుతం లేకుండా ఉంటాయి. మొత్తమ్మీద భోజనంలో ప్రొటీన్లు, పీచు, గుడ్డ కార్బోహైడ్రేట్లు ఉండేలా చూడాలి.



**స్నాక్స్‌లో ఏవంటే...** భోజనానికి మధ్యలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే బాదం, అక్రోట్లు, గుమ్మడి, సన్‌ఫ్లవర్ గింజలు, విటమిన్లూ ఖనిజాలూ ఎక్కువగా ఉండే అరటి, ఆపిల్, కమలా, జామ.. వంటి తాజా పండ్లూ లేదా వాటితో చేసిన స్మూతీ, సలాడ్లూ ఇస్తే మేలు. పండ్లు ఒత్తిడినీ తగ్గిస్తాయి. కనీసం రోజూ రెండు మూడు ఇవ్వాలి. అవీ సీజన్‌లో స్థానికంగా దొకేవీ చాలు. జామ మరీ మంచిది. మిగిలిన వాటితో పోలిస్తే ఆహారం లోని ఐరన్ శాతాన్ని పదిరెట్లు ఎక్కువ శోషించుకునేలా చేస్తుంది.

**మంచినీళ్లు ఎన్నంటే.. ...** రోజును మంచినీళ్లతోనే ప్రారంభించాలి. కొన్ని విద్యాసంస్థల హాస్టళ్లలోనూ ఈ నియమాన్ని పెట్టాక మంచి ఫలితాలు వచ్చాయట. ఎటువంటి డీహైడ్రేషన్‌కు గురైన కండరాలలో అలసట, తలనొప్పి వస్తాయి. దాంతో పరీక్షలు సరిగ్గా రాయలేరు. వీలైతే పరీక్ష హాల్లోకీ ఓ బాటిల్ మంచినీళ్లు తీసుకెళ్లాలి. పరీక్ష మధ్యలో నీళ్లు తాగిన పిల్లలు మిగిలిన వాళ్లకన్నా ఐదు శాతం బాగా రాసినట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. కొబ్బరినీళ్లలో పుదీనా, నిమ్మరసం కలిపి ఇస్తే సహజ ఎలక్ట్రోలైట్లూ యాంటీ ఆక్సిడెంట్లూ రెండూ అందుతాయి. ఒత్తిడిని తగ్గించేందుకు అల్లం టీ కూడా ఇవ్వొచ్చు. రోజుకు రెండు లీటర్ల మంచినీళ్లనీ; కొబ్బరినీళ్లు, నిమ్మరసం తేనె, మజ్జిగ, రాగిజావ... వంటి వాటితో కలిపి మూడు లీటర్లు నీళ్ల వరకూ తీసుకునేలా చూడాలి. పీచు అధికంగా ఉండే ఆహాఈరంతో అజీర్తి మలబద్ధకం. వంటిపొట్ట సమస్యలు ఉండవు. అరటి పండు, నట్స్.. వంటివి పరీక్షకి ముందూ ఇవ్వొచ్చు. వీటివల్ల రక్తంలో చక్కెర నిల్వలు సరిపడా ఉండి కన్ఫ్యూజన్ లేకుండా చదవడం, రాయడం చేస్తారు. పాలు, పెరుగు, మజ్జిగ... ఈ మూడింటిలో ఏదైనా ఒక్క రోజుకి కనీసం పావులీటరు తీసుకునేలా చూడాలి. ఒత్తిడివల్ల ఆకలి ఉండదు. అయినా రోజుకి మూడుసార్లు తినేలా చూడాలి. రాత్రి ఎనిమిది. గంటలకి ముందే తక్కువ మోతాదులో డిన్నర్ ముగించాలి. టైంకి తినాలి. నిద్రపోవాలి. మేలు కోవాలి. అప్పుడే వాళ్లు ఎగ్జామ్స్ సరిగ్గా రాయగలరు. ఆరోగ్యకరమైన ఆహారం... జీవనశైలిలో భాగంగా ఉన్నవాళ్లు పరీక్షల కోసం ప్రత్యేకంగా తినాల్సిన పనిలేదు. □



# ఈ ఫ్యాషన్లదే హవా

అమ్మాయిలు కోరుకునేదే కొత్తదనం. అందుకే ఆ ముచ్చట తీర్చేస్తూ అటు అమ్మాయిల్నీ ఇటు అబ్బాయిల్నీ ఆకట్టుకోవడానికి ఈ ఏడాది బోలెడన్ని ఫ్యాషన్లు రంగంలోకి దిగాయి. వాటిల్లో కొన్ని.



**పలాజో..**
అమ్మాయిల మనస్సు పలాజో పైకెళ్లింది. కాస్త పాదాలపైకి ఉండే ఈ పలాజోలు అన్ని రకాల కుర్తాలకూ సరిపోయేలా వచ్చాయి.



**స్టైలిష్ కఫ్తాన్... న**డెస్సు ఫంకీగా ఉంటూనే సౌకర్యంగా ఉండాలనుకునేవారి మనసును దోచుకున్న కఫ్తాన్ ఫ్యాన్.



**మెరిసిన లంగా ఓణీ :**
ఆడపిల్లల్ని ఆకట్టుకునే లంగా ఓణీల్లో బోలెడన్ని ఫ్యాషన్లు. అయితే ఒకప్పుడు పట్టుతోనే అలరించిన లంగా ఓణీ. ఈ ఏడు మెరుపుల దోలా సిల్క్ క్లాత్‌తో మార్కెట్లోకి వచ్చింది. రంగురంగుల్లో ...ఛ్‌వాయి నుంచి కలంకారి వరకూ ఎన్నెన్నో ప్రింట్ల డిజైన్లతో సరికొత్తగా కనువిందు చేస్తుంది.



**చిల్లుల జాకెట్ :**
బ్లౌజుల్లో ఎన్ని రకాలొచ్చినా.. ఆడవాళ్లు అస్సలు సంతృప్తి చెందరు. అందుకే మరి ఎప్పటికప్పుడు జాకెట్లలో కొత్తకొత్త ట్రెండ్స్ పుట్టుకొస్తూనే ఉంటాయి. అలా ఈ ఏడాది కూడా అతివల కోసం చాలానే వచ్చాయి వాటిల్లో ఒకటి ఈ చిల్లుల బ్లౌజు.

# టి.బి. లింఫాడినైటిస్ -2

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

**వ్యాధిలక్షణాలు** : ఎర్రని వాపుతో, నొప్పి లేకుండా లింఫ్ గ్రంథులు. ఉబ్బి ఉంటాయి. వళ్ళు, నొప్పులు, జ్వరం, దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, నీరసం, అలసట. కఫంలో రక్తం పడడం, రాత్రిళ్ళు చెమటలు పట్టడం, కొన్ని సార్లు గట్టిగా, నొప్పిగా ఉండే లింఫ్ గ్రంథుల వాపు ఉంటుంది.

**ఇది 5 దశలుగా తయారవుతాయి.**

**మొదటిదశ :** నాన్ స్పెసిఫిక్ రియాక్టివ్ హైపర్‌ప్లాసియా వల్ల లింఫ్ గ్రంథులు గట్టిగా ఉండి కదులుతాయి.

**రెండవదశ :** లింఫ్ గ్రంథులు పెరిగి రబ్బర్‌లాగా ఉండి చుట్టు ఉన్న కణజాలానికి అతుక్కొని ఉంటాయి. దీన్నే పెరి ఎడినైటిస్ దశ అంటారు.

**మూడవ దశ :** లింప్ గ్రంథి మధ్య భాగంలో మెత్తబడి అబ్సెస్ తయారు కావడం. దీన్నే కోల్డ్ అబ్సెస్ అని అంటారు.

**నాల్గవ దశ :** కాలర్‌స్టడ్ అబ్సెస్ తయారుకావడం.

**ఐదవదశ :** సైనస్ ట్రాక్ట్ (రంధ్రం) ఏర్పడడం, చీము, రక్తం కారడం వంటి లోణాలుంటాయి.

**రిస్క్ ఫ్యాక్టర్స్ :** హెచ్ఐవి, పోషకాహారలోపం, ఇమ్యూనిటీని తగ్గించే మందులు, కార్టికోస్టిరాయిడ్ వాడేవారు. కేన్సర్స్, ఆటో ఇమ్యూన్ వ్యాధులుండేవారిలో, కీమోథెరపీ వాడేవారిలో రిస్క్ ఎక్కువ.

**కాంప్లికేషన్స్ :-** సైనస్.. **ప్రివెన్షన్ :** బి.సి.జి. వాక్సినేషన్ వేయడం ద్వారా టి.బి. లింఫాటినైటిస్ వ్యాధిని ఆరి కట్టవచ్చు. నీడిల్ ఆస్పిరేషన్, వయాప్సీ, సిటీస్కాన్, గళ్ళ పరీక్ష రక్త పరీక్షలు, కల్చర్ టెస్ట్‌లు, స్కానింగ్, టి.బి.టెస్ట్‌లు, ఆసిడ్ ఫాస్ బాసిల్లస్ టెస్ట్, ఎక్స్‌రే ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు.

**చికిత్స :** మెడికల్ థిరపీ ద్వారా వ్యాధిని 3 నెలలు(30-40%) లేదా 6 నెలలు (80%) వ్యాధిని నయం చేయవచ్చు. రెండు ప్రక్కలా (50% కేసుల్లో) వచ్చే కేసుల్లో వ్యాధి నిరోధకతను పెంచే పోషకాహారాన్ని ఇస్తూ సర్జరీ ద్వారా తీసివేయవచ్చు.

**హోమియో చికిత్స :** డా.పటేల్ బయో కాంబినేషన్ 22 స్కోపులా 4 మాత్రలు చొప్పున మూడు పూటలా వేసుకోవాలి.

**బైరటాకార్బ్ :** 30 సర్వైకల్, మిసెంట్రిక్ లింఫ్ గ్రంథుల వాపున్న స్క్రోపులా తత్వం ఉన్న పిల్లల కిది మంచి మందు టాన్సిల్స్. ఎడినాయిడ్స్ వాపుతో చెవుడు, ఎదుగుదల లోపం ఉంటుంది.

**కాలీ అయోడ్ :** ఇంగ్వైనయిల్, సర్వైకల్ లింఫాయిడైటిస్‌కిది మంచి మందు. దగ్గు, కఫం చీమువంటి కఫం వల్ల ఊపిరాడకపోవడం చర్మంపై పొక్కులున్న వారికిది మంచి మందు.



**మెర్క్‌సాల్:** మాంసగ్రంథుల వాపు, సైనస్, అచ్చెస్ పగిలి దర్వాసన గల స్రావాలు వెలువడడం, నోరు దుర్వాసన లాలాజల గ్రంథలు టాన్సిల్స్ వాచి ఉంటాయి. గుటక వేయడం కష్టంగా ఉండడం. గజ్జంలోని మాంసగ్రంథులు వాచి చీము పట్టేవారికిది మంచి మందు.

**స్పాంజియా :** పిల్లలు, స్త్రీలలో థైరాయిడ్ వ్యాధులు రావడం, మాంస గ్రంథులు వాచి గట్టిపడడం, జలుబుతో కూడిన శ్లేష్మ రాగాలు మాట బొంగురుగా ఉంటుంది. ఆయాసంతో వచ్చే దగ్గుకిది మంచి మందు. ఇవేగాక కాల్కేరియా కార్బ్, సల్ఫర్, సైలీషియా గ్రాఫైటిస్, సెపియా అయోడియం, ఫాస్పరస్, బ్రోమియం, సిస్టిక్ కానడెన్సిస్, థెరియాడన్ మందుల్ని వైద్య పర్యవేక్షణలో లక్షణాల్ని బట్టి వాడుకోవచ్చు. ప్రివెంటివ్‌గా 8 సంవత్సరాల మగ పిల్లలకి కాల్కేరియతూకార్బ్ 30, ట్యూబర్‌కులినమ్ 300, సైలీషియా 6 ఎక్స్ ఇవ్వాల్సి ఉంటుంది. 15 సంవత్సరాల మగ పిల్లలకి సైలీషియమా 200, ట్యూబర్క్యులినమ్ 200 కాల్కేరియా పాస్ 6 ఎక్స్ మందుల్ని వైద్య పర్యవేఓణలో లక్షణాల్ని బట్టి, వయస్సుని బట్టి ఇవ్వాల్సి ఉంటుంది. □

# ఉత్పాదకత మెరుగుపడాలని..

**ఉదయం లేచింది మొదలు ఉరుకులు, పరుగులే. పిల్లల్ని స్కూల్‌కి తయారుచేయడం దగ్గర్నుంచీ పెద్దవాళ్లకు అన్నీ సమకూర్చేదాకా ఒకటా రెండా ఎన్ని పనులో ఇవికాక కెరియర్‌లో రాణించాలన్న తపన మరోవైపు. వీటనినంటి మధ్యా రోజెలా గడిచిపోతుందో కూడా తెలియదు. ఇది సరిపోదని ఉత్పాదకత మెరుగుపడాలంటే పని గంటల్ని పెంచాలంటున్నారు కొందరు ప్రముఖులు. ఇందుకు తమ జీవితాల్నే ఉదాహరణగా చెబుతున్నారు. దీనివల్ల ఒత్తిడి మరింత పెరుగుతుందే తప్ప, ఉపయోగం ఉండదు అంటోందీ తరం.**



ఇప్పటి పరిస్థితుల్లో రోజులో 10 గంటలు వృత్తిగత జీవితానికి కేటాయిస్తున్న వారే అధికం. అవసరాలరీత్యా ఇంతకన్నా ఎక్కువసేపు పనిచేసే మహిళలూ లేకపోలేదు. సెలవు రోజుల్లోనూ ఇంటి దగ్గరనుంచీ సేవలందిస్తున్నారు. దీనికితోడు ప్రత్యేకించి మరీ పనిగంటల్ని పెంచితే... ఒత్తిడి పెరిగి శారీరక, మానసిక సమస్యలు ఎక్కువవుతాయి. అందుకే దీనికి బదులు సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇవ్వమంటోందీ తరం. ఇష్టంతో చేస్తే ఎంత పనైనా త్వరగా అయిపోతుంది. అలాంటి వాతావరణాన్ని సృష్టించమంటున్నారు. ఉద్యోగినుల నైపుణ్యాలను మెరుగుపరిచే దిశగా కృషి చేయమంటున్నారు.

✦ మహిళ ఎంత ఉన్నతస్థానంలో ఉన్నా కుటుంబ బాధ్యతల్లో తానే ముందుంటుంది. చిన్నా పెద్దా ఎవరికి బాగోకపోయినా దగ్గరుండి చూసుకోవాలి. దాంతో ఆఫీసుకి సెలవు పెట్టాల్సిన పరిస్థితులూ ఎదురవుతున్నాయి. దీనివల్ల ప్రమోషన్స్, ప్రాజెక్టులు తీసుకోవడం, లీడర్షిప్ లాంటి అంశాల్లో వెనకబడుతున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని కొన్ని వెసులు బాటులు కల్పిస్తే వాళ్లూ పురుషులతో సమానంగా ఉత్పాదకతను అందిస్తారు.

✦ ఏ పని పూర్తిచేయాలన్నా ఇప్పటికీ కొన్ని కార్యాలయాల్లో పాత పద్ధతులే ఆచరణలో ఉన్నాయి. వీటివల్ల చాలా సమయం వృథా అవుతోంది. అలాకాకుండా కొత్తవాటినీ, సాంకేతికతనీ అందిపుచ్చుకునే అవకాశాల్ని యాజమాన్యం కల్పించాలి. దీనివల్ల స్మార్ట్‌వర్కింగ్ అలవాటవుతుంది. ఫలితాలూ తొందరగా వస్తాయి. ✦ కార్పొరేట్ ఉద్యోగాల్లో ఉన్నతస్థానాల్లో పురుషులే ఎక్కువ. మహిళలు ఒకవేళ ఉన్నా జీతంలో వ్యత్యాసం ఉంటుంది. ఈ లోపాల్ని సవరించి, నాయకత్వ హోదాలో మహిళల సంఖ్యను పెంచితే ఆయాసంస్థల ఉత్పాదకత ఎక్కువగా ఉన్నట్లు ఇప్పటికే పలు అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి ఆ దిశగా దృష్టిపెడితే మేలు అంటోందీ తరం. □

# చైతన్యపరిచే వెలుగు

ఆధ్యాత్మికం

ఓ బాటసారి నీరసంగా చెట్టు కింద కూర్చుని మంచి ఆహారం దొరికితే బాగుణ్ను.. నా ఆకలి తీరుతుంది అనుకున్నాడు. వెంటనే రుచికరమైన ఆహారం వచ్చింది. తృప్తిగా తినడంతో నిద్ర ముంచుకొచ్చింది. మంచి ఉంటే బాగుండు అనుకున్నాడు. పట్టు పాన్పు ప్రత్యక్ష మయ్యింది. ఆత్మీయనేస్తం చెంతనుంటే బాగుంటుంది. అనుకున్నాడు. అది కూడా నెరవేరింది. ఇదేం మాయ? కోరుకున్నవన్నీ లభిస్తున్నాయి. ఈమె మంచిదేనా? దెయ్యమై నన్ను భయపెడితే? అనుకున్నాడు. అంతే అందాకా స్నేహంగా ఉన్న స్త్రీ కాస్తా వికృతంగా మారడంతో వణికిపోయాడు. నిజానికి అతడు సేదతీరిన చెట్టు ఆశలు తీర్చే కల్పవృక్షం. అది తెలియక ప్రాణం కోల్పోయాడు. కల్పవృక్షాన్ని వెతుక్కుంటూ వెళ్లనవసరంలేదు. మనసులో స్థిరంగా ఉంటే ఆశలు రూపుదాలుస్తాయి. అదే కల్పవృక్షం అన్నారు మహర్షులు. బలమైన భావ తరంగాలకు అనంత శక్తి ఉంటుందని శాస్త్రవేత్తలూ చెబుతున్నారు. మన ఆలోచనలు మంచిగా ఉంటే పాజిటివ్ ఎనర్జీ, చెడుగా ఉంటే నెగెటివ్ ఎనర్జీ. మనమంతా కావలసిన దానికోసం ఆశపడతాం. కానీ అది దక్కుతుందా లేదా అనే భయం, అపనమ్మకం కలుగుతుంటాయి. వ్యతిరేక భావాలను పారదోలి అనుకూలతను పెంచుకుంటే అవి గొప్ప శక్తినిస్తాయి. అందుకే నిరంతరం మంచి పనులే చేయాలి. సద్భావనలను సదా ధ్యానించాలి. దైవమనే భావన కల్పితం కాదు. అది ఆశలకు స్ఫూర్తి కేంద్రం. మనోసీమలను చైతన్యపరిచే వెలుగు. దైవాన్ని మదిలో నిలుపుకుంటే చెడుకు తావుండదు. □

# పానీపూరీ ఎప్పుడంటే అప్పుడే..



**పానీపూరీ మనందరికీ చాలా ఇష్టమైన** స్ట్రీట్ ఫుడ్, రోజూ తిన్నా విసుగేయదు. మరి పానీపూరీ వీధుల్లోనే ఎందుకు తినాలి? దుమ్ముధూళీ లేకుండా ఇంట్లోనే తింటే బాగుంటుంది కదూ! పూరీల ప్యాకెట్ కొనుక్కోవచ్చు కానీ.. పానీ ఎలా అనుకుంటున్నారా? అదేం కష్టం కాదు, తేలిగ్గా ఇంట్లోనే చేసుకోవచ్చు. ఎలా గంటారా... రెండున్నర టేబుల్ స్పూన్ల ఎండిన పుదీనా ఆకుల పొడి, రెండు టేబుల్ స్పూన్ల వేయించిన జీలకర్ర, చెంచా చొప్పున మిరియాల పొడి, సైంధవ లవణం, ధనియాల పొడి, అర చెంచా చొప్పున శొంఠి పొడి, ఆమ్చూర్ పౌడర్, పంచదార, కాస్త ఇంగువ, చిటికెడు సిట్రిక్ యాసిడ్ క్రిస్టల్స్‌ను తీసుకోవాలి. వీటన్నిటినీ కలిపి గ్రైండ్ చేస్తే చాలు ఘుమఘుమలాడే పానీపూరీ మసాలా తయారైపోతుంది. పొడి మాత్రం బరకగా లేకుండా చాలా మెత్తగా ఉండాలి. లేదంటే సరిగ్గా కలవదు. దీన్ని తడి లేని సీసాలో భద్రం చేసుకుంటే పానీపూరీ తినదలచినప్పుడు కప్పు నీళ్లల్లో అర చెంచా చొప్పున కలిపితే సరిపోతుంది. □



# నేవీ బ్యాండ్‌లో మహిళా అగ్నివీర్‌లు



గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భారత్ మరోసారి స్త్రీ శక్తిని చాటనుంది. ఈ సందర్భంగా 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 144 మంది సిబ్బందితో నావికాదళం మినీ ఇండియాకు నాయకత్వం వహిస్తోంది. ఇందులో 80 మందితో కూడిన నేవీ బ్యాండ్‌లో ఆరుగురు మహిళా అగ్నివీరులు ఉన్నారు. సంప్రదాయ అడ్డంకులను దాటి వీరు తొలిసారి తమ ప్రదర్శన ఇవ్వనున్నారు. □

# ఛాంపియన్స్ ట్రోఫీలో.. భారత్‌కు బిగ్ షాక్

## అంపైర్స్, రిఫరీ టీమ్‌ల్లో నో ప్లేస్

## ఐసిసి కీలక నిర్ణయం




అనంత పద్మనాభన్



జవగళ్ శ్రీనాథ్




నితిన్ మీనన్

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) భారత్‌కు బిగ్ షాకిచ్చింది. త్వరలో జరగబోయే ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ-2025 కోసం ఏర్పాటు చేసిన అంపైర్లు, రిఫరీ బృందంలో భారత్‌కు చోటు దక్కలేదు. ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ ఈ నెల 19 నుంచి పాకిస్తాన్, దుబాయ్‌లలో ప్రారంభం కానుంది. ఇందుకు గాను ఐసిసి 12 మంది అంపైర్ల పేర్లను ప్రకటించింది. ఇందులో ఒక్క భారతీయ అంపైర్‌కు కూడా స్థానం దక్కలేదు. అలాగే, భారత మ్యాచ్ రిఫరీకి కూడా చోటు లభించలేదు. భారత్‌కు సంబంధించిన అంపైర్లలో నితిన్ మీనన్, కెవెన్ అనంత పద్మనాభన్, ఉల్హాస్ గాంధీ, సదాశివ అయ్యర్, కృష్ణరాజ్ శ్రీనాథ్, శంషుద్దీన్ తదితరులు ఉండగా, రిఫరీలకు సంబంధించి జవగళ్ శ్రీనాథ్, వృంధా రతి, శివానీ మిశ్రా, జీఎస్ లక్ష్మి తదితరులు ఉన్నారు. ఇక హైబ్రిడ్ మోడల్ ఆధారంగా జరిగే ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో, టీం ఇండియా తన అన్ని మ్యాచ్‌లన్నింటినీ హైబ్రిడ్ మోడల్‌లో దుబాయ్‌లో ఆడుతుంది. మిగిలిన మ్యాచ్‌లు పాకిస్తాన్ దేశంలో జరగనున్నాయి. ఈ ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారతీయ అంపైర్లు లేదా మ్యాచ్ రిఫరీలు ఎవరూ పాకిస్తాన్‌కు వెళ్లకపోవడమే ఇందుకు కారణం. ఇందులో ఐసిసి మ్యాచ్ రిఫరీ జవగళ్ శ్రీనాథ్, ఎలైట్ ప్యానెల్ అంపైర్ నితిన్ మీనన్ పేర్లు ఉన్నాయి.

కానీ, ఐసిసితో చర్చల తర్వాత వారిద్దరూ పాకిస్తాన్ వెళ్లడం లేదు. టీమిండియా మ్యాచ్‌లు దుబాయ్‌లో జరగాల్సి ఉండగా, ఈ ఇద్దరు సభ్యులు టీమ్ ఇండియా మ్యాచ్‌లో మ్యాచ్ ఆఫీసర్ బాధ్యతను నిర్వర్తించలేరు. భారత మాజీ ఫాస్ట్ బౌలర్లు జవగళ్ శ్రీనాథ్, నితిన్ మీనన్ ఇప్పుడు ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025 నుంచి దూరంగా ఉండటానికి ఇదే కారణమని తెలుస్తోంది. ఇక ఐసిసి ప్రకటించిన 12 మంది అంపైర్ల టీం, ముగ్గురు మ్యాచ్ రిఫరీల్లో ఒక్క భారతీయుడు కూడా లేడు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికైన అంపైర్లలో కుమార్ ధర్మసేన, క్రిస్ గాఫ్నీ, మైఖేల్ గాఫ్, అడ్రియన్ హోల్డ్‌స్టాక్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, రిచర్డ్ కెటిల్‌బరో, ఎహ్సాన్ రాజా, పాల్ రీఫెల్, షరాఫ్ ఉద్దౌలా, రోడ్నీ టక్కర్, అలెక్స్ వార్ఫ్, జోయెల్ విల్సన్. అలాగే మ్యాచ్ రిఫరీల్లో డేవిడ్ బూన్, రంజన్ మదుగలే, ఆండ్రూ పైక్రాఫ్ట్ ఉన్నారు.







# 38వ జాతీయ క్రీడల్లో..

## దీపికకు స్వర్ణం, స్వప్నిల్‌కు కాంస్యం

# ఛాంపియన్‌గా జూయెల్

**న్యూఢిల్లీ:** జాతీయ క్రీడల్లో ఒలింపిక్ పతక విజేత స్వప్నిల్ కుసాలె కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. డెహ్రాడూన్‌లో జరిగిన షూటింగ్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రిపొజిషన్ విభాగంలో మహారాష్ట్ర షూటర్ స్వప్నిల్ మూడో స్థానంలో నిలిచాడు. ఈ విభాగంలో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్‌ఎస్సీబీ) తరఫున బరిలోకి దిగిన 25ఏళ్ల నీరజ్ కుమార్ 464.1 పాయింట్లతో స్వర్ణం చేజిక్కించుకున్నాడు. అలాగే మధ్యప్రదేశ్‌కు చెందిన ఐశ్వరి ప్రతాప్ సింగ్ (462.4 పాయింట్లు) రజత పతకం దక్కించుకోగా, పారిస్ ఒలింపిక్స్ కాంస్యం నెగ్గి ఈ విభాగంలో దేశానికి తొలిపతకం అందించిన స్వప్నిల్ (447.7 పాయింట్లు) కాంస్యం గెలుచుకున్నాడు. మరోవైపు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్డ్ టీమ్ ఈవెంట్లో సురుచి సింగ్-ప్రమోద్ (హరియాణా) 17-7 పాయింట్ల తేడాతో అంజలి షెఖావత్-ఉమేశ్ చౌదరి(రాజస్తాన్)పై గెలిచి పసిడి ఖాతాలో వేసుకుంది. ఇక రాహి సర్నోబత్-ప్రణవ్ అరవింద్ పాటిల్ (మహారాష్ట్ర) జట్టు కాంస్యం గెలుచుకుంది. సుదీర్ఘకాలంగా భారత టాప్ ఆర్చర్గా ఉన్న దీపిక కుమారి పసిడిని అందుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించడంలో విఫలమైన దీపిక నేషనల్ గేమ్స్‌లో జార్ఖండ్ తరఫున బరిలోకి దిగి వ్యక్తిగత విభాగంతో పాటు, టీమ్ ఈవెంట్లోనూ స్వర్ణం కైవసం చేసుకుంది. కాగా పురుషుల విభాగంలో నాలుగుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న సీనియర్ ఆర్చర్ తరుణ్‌దీప్ రాయ్‌ను ఓడించిన 18 ఏళ్ల బెంగాల్ ఆర్చర్ జుయెల్ సర్కార్ జాతీయ ఛాంపియన్‌గా అవతరించాడు. మరోవైపు బాక్సింగ్స్‌లో లవ్లీనా బోర్గోహైన్, ఆరు సార్లు ఆసియా ఛాంపియన్ శివ థాపా విజయాలు సాధించారు. మహిళల 75 కేజీల విభాగంలో లవ్లీనా తిరుగులేని ప్రదర్శన కనబర్చగా, పురుషుల 64 కేజీల విభాగంలో శివ థాపా (అసోం) సత్తాచాటాడు.

## సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో...

# ఫైనల్లోకి సన్‌రైజర్స్

## రాయల్స్ 8 వికెట్ల తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికా టీ20 లీగ్-2025 ఫైనల్లోకి సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ (సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం) అడుగుపెట్టింది. సెంచూరియన్ వేదికగా జరిగిన క్వాలిఫయర్-2లో పార్ల్ రాయల్స్‌ను 8 వికెట్ల తేడాతో చిత్తు చేసిన సన్‌రైజర్స్ వరుసగా మూడోసారి తమ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పార్ల్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 175 పరుగుల భారీ స్కోర్ సాధించింది. పార్ల్ బ్యాటర్లలో రూబిన్ హెర్మాన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 53 బంతులు మాత్రమే ఎదుర్కొన్న హెర్మాన్ 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 81 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతడితో పాటు ఓపెనర్ లువాన్ డ్రే ప్రిటోరియస్ (59) హాఫ్ సెంచరీతో మెరిశాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో ఓవర్టన్, మార్కో జానెసన్, బార్ట్‌మన్, మార్క్రమ్ తలా వికెట్ సాధించారు. అనంతరం 176 పరుగుల లక్ష్యాన్ని సన్‌రైజర్స్ కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 19.2 ఓవర్లలో ఛేదించింది. లక్ష్య ఛేధనలో ఈస్టర్న్ కేప్ ఓపెనర్ టోనీ డి జోర్జి ఆకాశమే హద్దుగా చెలరేగాడు. రాయల్స్ బౌలర్లను టోనీ ఊచకోత కోశాడు. కేవలం 49 బంతుల్లోనే 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 78 పరుగులు చేసి ఔటయ్యాడు. అతడితో పాటు జోర్డాన్ హెర్మాన్ సైతం కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 48 బంతుల్లో 4ఫోర్లు, 4 సిక్స్‌లతో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. రాయల్స్ బౌలర్లలో మఫాక, దునిత్ వెల్లలాగే తలా వికెట్ సాధించారు. మిగితా బౌలర్లంతా దారుణంగా విఫలమయ్యారు. ఇక ఈనెల 8న జోహాన్స్‌బర్గ్ వేదికగా జరగనున్న ఫైనల్ పోరులో సన్‌రైజర్స్, ఎంఐ కేప్‌టౌన్ జట్లు అమీతుమీ తెల్చుకోనున్నాయి. కేప్‌టౌన్‌కు ఇదే తొలి ఫైనల్ కాగా, సన్‌రైజర్స్‌కు మాత్రం ఇది ముచ్చటగా మూడో ఫైనల్. తొలి రెండుసీజన్లలోనూ మార్క్రమ్ సారథ్యంలోనే సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ ఛాంపియన్స్గా నిలిచింది. కాగా ఈస్టర్న్ కేప్ జట్టు ఐపీఎల్ ఫ్రాంఛైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యానికి సంబంధించినదే కావడం గమనార్హం.

# రెండో టెస్టులో..ఆధిక్యంలో ఆస్ట్రేలియా




**న్యూఢిల్లీ:** శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఆధిక్యంలో కొనసాగుతోంది. గాలే వేదికగా ఈ మ్యాచ్‌లో శ్రీలంక 330 పరుగులు చేయగా, ఆస్ట్రేలియా 330 పరుగులతో ముందుంది. ఆసీస్ వికెట్‌కీపర్, బ్యాటర్ అలెక్స్ క్యారీ శతక్కొట్టాడు. ఈ మ్యాచ్‌లో ఐదోస్థానంలో బరిలోకి దిగిన క్యారీ 156 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సర్ సాయంతో కెరీర్లో రెండోటెస్ట్ సెంచరీని పూర్తిచేసుకున్నాడు. ఇదే మ్యాచ్‌లో క్యారీకిముందు స్టీవ్ స్మిత్ కూడా సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇలా స్మిత్, క్యారీ సెంచరీలతో కదం తొక్కడంతో ఆస్ట్రేలియా ఆధిక్యంలోకి వెళ్లింది. 74 ఓవర్ల అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ స్కోర్ 3 వికెట్లు నష్టానికి 330 పరుగులుగా ఉంది. క్యారీ (139), స్మిత్ (120) సెంచరీల అనంతరం అదే జోరుతో ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా 73 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో హెడ్ 21, ఉస్మాన్ ఖ్వాజా 36, లబూషేన్ 4 పరు గులు చేసి ఔటయ్యారు. లంక బౌలర్లలో నిషాన్ పెయిరిస్ 2, ప్రభాత్ జయసూర్య ఓ వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 257 పరుగు లకు ఆలౌటైంది. చండీమల్ (74), కుసాల్ మెండిస్ (85 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించి శ్రీలంకకు గౌరవప్రదమైన స్కోర్ అందించారు. కెరీర్లో చివరి మ్యాచ్ ఆడుతున్న దిముత్ కరుణరత్నే 36 పరుగులకే ఔట య్యాడు. రమేశ్ మెండిస్ (28), కమిందు మెండిస్ (13), పథుమ్ నిస్సంక (11) రెండం కెల స్కోర్లు చేశారు. ఆసీస్ బౌలర్లలో స్టార్క్, కున్హేమన్, లయోన్ తలో 3 వికెట్లు పడగొట్టగా, ట్రవిస్ హెడ్ ఓ వికెట్ దక్కించుకున్నాడు.

కాగా రెండు టెస్టు మ్యాచ్‌లు, రెండు వన్డేల సిరీస్ కోసం ఆస్ట్రేలియా శ్రీలంకలో పర్యటిస్తోంది. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో ఆసీస్ ఇన్నింగ్స్ 242 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ఉస్మాన్ ఖ్వాజా (232) డబుల్ సెంచరీతో కదంతొక్కగా, జోష్ ఇంగ్లిస్ (102), స్టీవ్ స్మిత్ (141) సెంచరీలతో మెరిశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 165 పరుగులకే ఆలౌట్ అయి ఫాలో ఆన్ ఆడింది. సెకెండ్ ఇన్నింగ్స్‌లోనూ (247 ఆలౌట్) లంక పరిస్థితి మారలేదు. ఫలితంగా ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. ఆసీస్ బౌలర్లు కున్హేమన్ 9, నాథన్ లయోన్ 7 వికెట్లు తీసి లంక పతనాన్ని శాశించారు. కాగా, ఈ టెస్ట్ సిరీస్ అనంతరం ఈ నెల 12, 14 తేదీల్లో కొలొంబో వేదికగా శ్రీలంక, ఆస్ట్రేలియా మధ్య రెండు వన్డేలు జరుగనున్నాయి.

# ఇండియన్ సూపర్ లీగ్‌లో..

# గోవా ఫుట్‌బాల్ క్లబ్ సంచలనం

## 2-1 స్కోరుతో ఒడిశాపై విజయం




**న్యూఢిల్లీ:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)-2025 ఫుట్‌బాల్ టోర్నమెంట్లో గోవా ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్సీ) 2-1 స్కోరుతో ఒడిశా జట్టుపై విజయం సాధించింది. గోవాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో గోవా తరఫున బ్రిసన్ డ్యూబెన్ ఫెర్నాండెజ్ 29వ నిమిషంలో గోల్ సాధించి గోవాకు తొలి ఆధిక్యం ఇచ్చాడు. ఒడిశా ఆటగాడు లాల్తతంగ ఖవిహ్రింగ్ (47వ నిమిషంలో) చేసిన సెల్ఫ్ గోల్ గోవా ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. 54వ నిమిషంలో ఒడిశా స్ట్రయికర్ కెపి రాహుల్ గోల్ చేసినప్పటికీ గోవా విజయాన్ని మాత్రం అడ్డుకోలేక పోయాడు. నిజానికి ఈ మ్యాచ్‌లో ఒడిశా తమ దాడులకు పదును పెట్టలేకపోయింది. అవతలివైపు నుంచి గోవా ఎఫ్సీ ఆటగాళ్లు మాత్రం పదే పదే ప్రత్యర్థి గోల్‌ఫోస్ట్ వైపు దూసుకొచ్చి ఏకంగా 20 షాట్లు కొట్టారు. లక్ష్యంపై ఆరుసార్లు గురిపెట్టగా ఒకసారి గోల్‌తో విజయవంతమైంది. ఒడిశా 15 షాట్లు ఆడినా, కేవలం ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై రెండే సార్లు దాడి చేసింది. ఇందులో ఒకసారి మాత్రం ఫలితాన్ని సాధించింది. గోవా ఆటగాళ్లు మైదానంలో పాదరసంలా కదిలారు. బంతిని ప్రత్యర్థుల కంటే తమ ఆధీనంలో ఉంచుకునేందుకు అదే పనిగా చకచకా పాస్లు చేశారు.

# పన్ను చెల్లింపుదారులకు ఏది బెస్ట్?

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** నిర్ణీత పరిమితికి మించిన ఆదాయం సంపాదించే దేశంలోని పౌరులందరూ ప్రభుత్వానికి ఆదాయపు పన్ను చెల్లించాలి. అయితే వారికి ఖర్చులు, పెట్టుబడులకు సంబంధించి కొన్ని మినహాయింపులు లభిస్తాయి. ప్రస్తుతం పాత, కొత్త విధానాల్లో ఆదాయపు పన్ను చెల్లింపులు చేయవచ్చు ఏ విధానంలో ఎక్కువ మినహాయింపు లభిస్తుందో లెక్కించుకుని నిర్ణయం తీసుకోవాలి. కొత్త విధానంలో ఏడాదికి రూ.12.75 లక్షల వరకు సంపాదించేవారు (రూ.75 వేల ప్రామాణిక తగ్గింపుతో సహా) 2025-26 ఆర్థిక సంవత్సరంలో సున్నా పన్ను చెల్లిస్తారు. అయితే ఈ విధానంలో రూ.75 వేల ప్రామాణిక మినహాయింపు ఉన్నప్పటికీ పెట్టుబడులకు తగ్గింపులు లేవు. ఒక వేళ ఆర్థిక సంవత్సరంలో రూ.12.75 లక్షల ఆదాయం దాటితే మొత్తం ఆదాయంపై పన్ను వర్తిస్తుంది. ఎటువంటి తగ్గింపులు ఉండవు. ఎందుకంటే ఈ విధానంలో హెచ్‌ఆర్‌ఏ, ఈఎల్‌ఎస్‌ఎస్, ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్, ఎన్పీఎస్ తదితర వాటిని క్లెయిమ్‌చేసుకునే వీలుండదు. బడ్జెట్‌లో పాత పన్ను విధానాన్ని మార్చలేదు. దీనిలో రిబేటు కారణంగా రూ.5లక్షల వరకూ ఆదాయం పన్ను రహితంగా ఉంటుంది. అలాగే ఈ విధానంలో సెక్షన్ 80సీ కింద పీపీఎఫ్, ఈఎల్‌ఎస్‌ఎస్, ఎల్ఐసీ ప్రీమియాలకు రూ.1.50 లక్షల వరకూ మినహాయింపు ఉంటుంది. సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమాప్రీమియాలను క్లెయిమ్‌చేసుకోవచ్చు. సెక్షన్ 24(బి) ప్రకారం రూ.2లక్షల వరకూ హౌసింగ్ రుణంపై వడ్డీని మినహాయింపు లభిస్తుంది. వీటితో పాటు





హెచ్‌ఆర్‌ఏ, ఎల్టీఏ తదితర ఇతర ప్రయోజనాలు కూడా కలుగుతాయి. ఆదాయపుపన్ను నిపుణుల అభిప్రాయం ప్రకారం, యేడాదికి రూ.12.75లక్షల వరకూ సంపాదించే వారికి కొత్తఆదాయపు పన్ను విధానం చాలా బాగుంటుంది. అంతకంటే ఎక్కువ సంపాదించే వారుమాత్రం తమ పెట్టుబడులు, ఇతర తగ్గింపులను లెక్కించుకోవాలి. పాతవిధానంలో వచ్చే మినహాయింపులను పరిగణనలోకి తీసుకోవాలి. ఏ విధానంలో ఎక్కువ మినహాయింపు ఉంటుందో గమనించి, దాని ప్రకారం పన్ను చెల్లించాలి.

## ఈ రంగాల్లో పెట్టుబడులు భేష్: మోతీలాల్ ఓస్వాల్!

**ముంబై, ఫిబ్రవరి 7:** బడ్జెట్ ప్రవేశపెట్టి దాదాపు రెండు రోజులు గడుస్తోంది. బడ్జెట్ తర్వాత దేశీయ స్టాక్‌మార్కెట్లు తెరచుకున్నప్పటికీ అమెరికాఅధ్యక్షుడు చైనా, కెనడా, మెక్సికోలపై వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించటంతో మార్కెట్లు కుప్పకూలిన సంగతి తెలిసిందే. అలాగే బడ్జెట్ మినహాయింపు పరిమితిని రూ.7 లక్షల నుండి రూ.12 లక్షలకు పెంచటం జరిగింది. ప్రభుత్వ ఈ నిర్ణయం పన్ను చెల్లింపుదారులకు ఎంతో ఉపశమనం కలిగించింది. ప్రధానంగా హై పెయిడ్ ఉద్యోగాలు చేస్తున్న ఐటీరంగంలోని ఉద్యోగులకు దీని నుంచి పెద్ద ప్రయోజనం దక్కింది. ఈ క్రమంలో దేశీయ స్టాక్ మార్కెట్లు పెట్టుబడిదారులు ఏఏ రంగాల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు, బడ్జెట్ తర్వాత ఎలా ముందుకు సాగాలని ఆలోచిస్తున్నారు. దీనిపై ప్రముఖ దేశీయ బ్రోకరేజ్ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్

2025 ప్రధానంగా దేశంలోని సామాన్య ప్రజలను ఈసారి ఫోకస్ చేస్తూ తీసుకురాబడిన సంగతి తెలిసిందే. ప్రధాన ప్రకటనలను పరిశీలిస్తే 2025 సర్వీసెస్ చైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ స్పందిస్తూ.. తాజా బడ్జెట్లో ప్రభుత్వ నిర్ణయం వినియోగాన్ని పెంచడం ద్వారా మూలధన మార్కెట్‌కు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందన్నారు. ఈ నిర్ణయం ఎఫ్ఎంసిజి వంటి రంగాలు లేదా చిన్న వస్తువులతో వ్యవహరించే జొమాటో వంటి కంపెనీలు ప్రయోజనం పొందే అవకాశం ఉందని అగర్వాల్ అభిప్రాయపడ్డారు. పన్నుల తగ్గింపు వల్ల కన్స్యూమర్ డ్యూరబుల్ కంపెనీలకు ప్రయోజనం దక్కుతుందని చెబుతున్నారు. రూ.25 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ సంపాదన కలిగిన వ్యక్తులు తమ ఆదాయాన్ని ఖర్చు చేయవలసిన అవసరం లేదని అగర్వాల్ అన్నారు. అటువంటి పరిస్థితిలో వారు పన్ను ఆదా ద్వారా వచ్చే డబ్బులో ఎక్కువ భాగాన్ని మూలధన మార్కెట్లో పెట్టుబడి పెట్టవచ్చని




బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యతరగతికి పెద్ద ఉపశమనం కల్పించారు. ఈ క్రమంలో ఆమె ప్రజల వద్ద వినియోగానికి అధిక నిధుల లభ్యతను పెంచేందుకు.. కొత్త పన్ను విధానంలో ఆదాయపు పన్ను పేర్కొన్నారు. క్విక్ కామర్స్ కంపెనీలు ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. జెప్టో, బ్లింకిట్, టాటా బిగ్‌బాస్కెట్, ఇన్ స్టామార్ట్ వంటి కంపెనీలు మంచి గ్రోత్ నమోదు చేయగలవని అంచనాలను వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో పాత కంపెనీలకు ఆదాయ వృద్ధి నెమ్మదిగా ఉన్నప్పటికీ విలువలు ఎక్కువగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

## భారత్ మార్కెట్‌కు ఫారిన్ లగ్జరీ బ్రాండ్స్

**ముంబై, ఫిబ్రవరి 7:** విదేశీ బ్రాండ్లను భారత రిటైల్ మార్కెట్ ఊరిస్తోంది. 2024లో దాదాపు 27కొత్త విదేశీ రిటైల్ బ్రాండ్ దేశీయ విపణిలోకి ఎంట్రీ ఇచ్చాయి. విలాసవంత వస్తువుల కోసం పెరుగుతున్న డిమాండ్ ప్రస్తుతం తమ ఉనికిని చాటుకోవడానికి ఇవి భారత్‌లో రంగ ప్రవేశం చేస్తున్నాయని రియల్టీ కన్సల్టెంట్ జేఎల్ఎల్ ప్రదర్శన. అంతక్రితం. ఏడాదితో భారత్‌లో అడుగుపెట్టిన బ్రాండ్ల సంఖ్య 2024లో రెట్టింపు అయిందని, పట్టణీకరణ, ఖర్చు చేయదగ్గ ఆదాయం పెరగడం, షాపింగ్ ప్రాధాన్యతల్లో మార్పు లగ్జరీ ఉత్పత్తులకు డిమాండ్‌ను పెంచుతోందని వివరించింది. భారత్‌ను ప్రపంచవ్యాప్తంగా చురుకైన రిట్రల్ మార్కెట్లలో ఒకటిగా మార్చిందని, 2023లో 14 బ్రాండ్లు ఇక్కడికి ప్రవేశించాయి. నాలుగేళ్లలో 60 విదేశీ బ్రాండ్లు భారతకు వచ్చాయి. దేశీయ రిటైల్ బ్యూటీ, సాధనాలు, ఆరోగ్య సంరక్షణ పాదరక్షలు,బ్యాగ్స్, యాక్సెసరీస్,ప్యాషన్, దుస్తుల విభాగాల్లో టాప్3లో నిలిచాయి. భారత రిటైల్ రంగం అంతర్జాతీయ కంపెనీల దృష్టిని ఆకర్షించింది. నాలుగేళ్లుగా ఇక్కడి విపణిలో ఉనికిని నెలకొల్పడానికి ప్రయత్నాలను క్రమంగా పెంచుతుంది. గత సంవత్సరం ప్రవేశించిన కంపెనీలలో 56 శాతం యూరప్, మధ్యప్రాచ్య, ఆఫ్రికా స్థాపించబడినవి. ఫ్రెంచ్ ఇటాలియన్ సంస్థలు కూడా ఉన్నాయి.



# ఆధార్‌పై కేంద్రం కీలక అప్‌డేట్

# వాణిజ్యం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** భారతీయ పౌరులకు ఆధార్ అత్యంత ముఖ్యమైన గుర్తింపు కార్డులలో ఒకటి. ఆధార్ కార్డులో కాలానుగుణంగా కొన్ని మార్పులు చేస్తోంది కేంద్రం. ఆ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆధార్ కార్డుకు సంబంధించి కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. అంటే ప్రైవేట్ కంపెనీలు ఆధార్ కార్డు వివరాలను ఉపయోగించుకోవడానికి అనుమతించింది. కేంద్ర ప్రభుత్వం చేసిన ఈ కొత్త ప్రకటన ఏంటో చూద్దాం. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ భారతదేశంలోని ప్రతి పౌరుడికి 12 అంకెల ఆధార్ కార్డును జారీ చేస్తుంది. 12 అంకెల సంఖ్యతో పాటు, ఆధార్ కార్డులో పేరు, వయస్సు, చిరునామా, మొబైల్ నంబర్, వేలిముద్రతో సహా కొన్ని ముఖ్యమైన వ్యక్తిగత సమాచారం కూడా ఉంటుంది. ఆధార్‌లో అంత ముఖ్యమైన వివరాలు ఉన్నందున, దానిని భారతపౌరులకు ముఖ్యమైన గుర్తింపు పత్రంగా పరిగణిస్తారు.ప్రభుత్వ మంత్రిత్వ శాఖ, విభాగం కాకుండా ఏదైనా సంస్థ ఆధార్ ప్రామాణీకరణను ఉపయోగించాలనుకుంటే తప్పనిసరిగా అందుకు కారణాలను కేంద్రానికి గానీ, యూఐడీఏకి గానీ వివరించాలని కేంద్రం నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ ప్రతిపాదన ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం ప్రామాణీకరణ ఎందుకు అవసరమో, అది ప్రజలకు ఎలా ప్రయోజనం చేకూరుస్తుందో కూడా ప్రైవేట్ సంస్థలు వివరించాల్సి ఉంటుంది. దానిని సంబంధిత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ,విభాగానికి పంపాలి. ఏదైనా దుర్వినియోగానికి సంబంధించినవి ఉంటే అనుమతి ఉండదు. అయితే ఈ ప్రైవేట్ సంస్థలు ఆధార్ యాక్సెస్ చేసేందుకు పలు నిబంధనలు విధించింది కేంద్రం. సంస్థలు ఆధార్ యాక్సెస్ చేసేందుకు కారణాలు ఏమిటి? ఆధార్ వివరాలను పొందాలంటే అందుకు కారణాలు కేంద్ర ప్రభుత్వానికి గానీ, యూఐడీఏఐకి గానీ ప్రైవేట్ సంస్థలు వివరించాలి. అలాగే ఆ వివరాలన్నీ కూడా ప్రజలకు సమ్మతమైనవిగా ఉండాలి. కేంద్రం విధించిన నిబంధనలకు సరిగ్గా ఉండాలి.




అందులో ఏ ఒక్కటి కూడా వ్యతిరేకంగా ఉంటే కేంద్రం అనుమతి ఇవ్వదు. ఆధార్ కార్డులపై వేలిముద్రలు, ఐరిస్ వంటి సమాచారాన్ని ఉపయోగించి మోసానికి పాల్పడిన సంఘటనలు అనేకం జరుగుతున్నాయి.

# ఐపిఒకు అజాక్స్ ఇంజినీరింగ్


**ముంబై, ఫిబ్రవరి 7:** ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కేదారా కేపిటల్ మద్దతు కలిగిన కాంక్రీట్ ఎక్విప్‌మెంట్ తయారీదారు అజాక్స్ ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూ ఫిబ్రవరి 10న ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 12న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. మొత్తం రూ.1269 కోట్లు సమీకరించనుంది. ఐపిఒలో భాగంగా ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.599-629గా కంపెనీ నిర్ణయించింది. యాంకర్ ఇన్వెస్టర్లకు ఫిబ్రవరి ఏడో తేదీన సబ్‌స్క్రిప్షన్ విండో తెరుచుకోనుంది. ఐపిఒ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 2.01 కోట్ల షేర్లను ప్రమోటర్లు, షేర్ హోల్డర్లు విక్రయించనున్నారు. కేదారా కేపిటల్ మొత్తం 74.37 లక్షల షేర్లను విక్రయించనుంది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుండడంతో కంపెనీకి ఎలాంటి డబ్బులూ రాబోవు. అప్పర్ ప్రైస్ బ్యాండ్ వద్ద కంపెనీ మార్కెట్ విలువరూ.7200 కోట్లుగా ఉండనుంది. ప్రముఖ కాంక్రీట్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీలో అజాక్స్ ఇంజినీరింగ్ ఒకటి. కర్ణాటకలో నాలుగు అసెంబ్లింగ్, తయారీ యూనిట్లున్నాయి. కర్ణాటకలో మరో యూనిట్ ఈ యేడాది ఆగస్టు నాటికి అందుబాటులోకి రానుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.17441 కోట్ల ఆదాయాన్ని, రూ.225 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ప్రకటించింది. ఈ ఐపిఒకు ఐసిఐసిఐ సెక్యూరిటీస్, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా, జెఎం ఫైనాన్షియల్, నువామా వెల్త్ మేనేజ్‌మెంట్, ఎస్‌బిఐ కేపిటల్ మార్కెట్స్ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి.




**ముంబై, ఫిబ్రవరి 7:**150 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన, ప్రపంచంలోనే అతి పెద్ద పోస్టల్ నెట్‌వర్క్ అయిన ఇండియాపోస్ట్‌ను 1.5లక్షల గ్రామీణ తపాలా కార్యాలయాలతో పెద్ద లాజిస్టిక్స్ సంస్థగా మార్చనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ తెలిపారు. కేంద్ర బడ్జెట్ 2025ను సమర్పిస్తూ గ్రామీణ ఆర్థికవ్యవస్థకు ఇండియా పోస్ట్‌కు సంబంధించిన పరివర్తన ఒక ఉత్ప్రేరకంగా పని చేస్తుందని సీతారామన్ హామీ ఇచ్చారు. గ్రామీణ రంగానికి సంబంధించిన ఇతర సంస్కరణ చర్యలలో రుణ కార్యకలాపాల కోసం నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు మద్దతు ఉందని చెప్పారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్‌తో 1.5 లక్షల గ్రామీణ తపాలా కార్యాలయాలు, 2.4 లక్షల మంది డాక్ సేవకుల విస్తృత నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఊపందుకుంటుందని వివరించరు. ఇండియా పోస్ట్‌ను మార్చే ప్రణాళికలను టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా గతేడాది సెప్టెంబర్‌లో మొదటిసారి ప్రకటించారు. దీన్ని లాజిస్టిక్స్ సంస్థగా మార్చడం వల్ల

ను పెట్టుబడిగా పెట్టుకునే

# పోస్టల్ శాఖలో పెను మార్పులు



వచ్చే మూడు, నాలుగేళ్లలో శాఖ ఆదాయం 50నుంచి 60శాతం పెరుగుతుందనిఆయన చెప్పారు. దీని కోసం ఆక్న డిసెంబరులో ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి నిధులను కోరారు. తద్వారా 2029 నాటికి డిపార్ట్‌మెంట్‌ను లాభదాయకంగా మార్చడానికి, లాజిస్టిక్స్ కంపెనీగా మార్చడానికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వస్తువుల డెలివరీ సేవలను పెంపొందించడానికి సహాయం చేస్తుందని వివరించారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో శాఖ పాత్ర దిశగా ముందుకు సాగింది. డిసెంబరులో డిపార్ట్‌మెంట్ కోసం కొత్త డెవలప్‌మెంట్ ప్లాన్ కోసం తన ప్రెజెంటేషన్‌ను ఇస్తూ త్వరలోనే పోస్టల్ సేవలను ప్రజల ఇంటి వద్దకు తీసుకెళ్తామని సింధియా చెప్పారు. డిపార్ట్‌మెంట్ ఆదాయాన్ని పెంచడానికి, ఖర్చులను హేతుబద్ధీకరించడం, మెజారిటీ ప్రక్రియలను డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో సహా అన్ని సంభావ్య సేవలను పరిశీలిస్తామన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.